# శ్రీ ధునీవాలా దాదా మహరాజ్



"ఈ దాదా తన బిడ్డలను ఎన్నటికీ
మధ్యలో విడువడు"


పర్యవేక్షణ

పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజ మాష్టర్ గారు

సేకరణ

పెసల సుబ్బరామయ్య

ప్రథమముద్రణ 2000 సం॥

ప్రతులు - 1000

సర్వహక్కులు - **పెసల సుబ్బరామయ్య.**

**ప్రతులకు** - పెసల సుబ్బరామయ్య
గొలగమూడి (పోస్టు),
(వయా) సర్వేపల్లి, నెల్లూరు జిల్లా - 524 321.

**వెల**
**రూ. 15/-**



***అంకితము:-*** నన్ను మనిషిగా తీర్చిదిద్దుచున్న పూజ్యపాదులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టరుగారి దివ్యపాదారవిందములకు.

**కృతజ్ఞతలు:-** పూజ్యపాదులు ఆచార్య శ్రీభరద్వాజ మాష్టర్ గారు ఖాండ్వా దర్శించి హింధీ భాషలోనున్న శ్రీ ధునీవాలా దాదా గారి చరిత్ర తెచ్చి దానిని తెలుగు భాషలోకి అనువధించే సేవను నాకు ప్రసాదించారు. అనువాద గ్రంధమును నాచే చదివించుకొని సంపూర్ణముగా విని అందలి కొన్ని వర్ణనలను తొలగించారు. కొన్ని విషయాలు ఖాండ్వాకు వ్రాసి తెలుసుకున్నారు. శ్రీ మాష్టరు గారి హస్త స్పర్శకు నోచుకున్న ఆ వ్రాతప్రతిని నేనుంచుకున్నాను. శ్రీ దత్త రూపమైన ఈ సద్గురు మూర్తి యొక్క దివ్య లీలా రూపాన్ని అక్షర రూపంలో అనుగ్రహించిన శ్రీ మాష్టరు గారికి పాఠకులందరూ కృతజ్ఞతా పూర్వక సాష్టాంగదండ ప్రణామములర్పిస్తున్నాము.

ఎంతో శ్రమ కోర్చి ఈ అనువాదము చేసిన మిత్రులు శ్రీ యమ్.సి. క్రిష్ణమూర్తి గారు, మరియు టి. మల్లిఖార్జున రావు గారికి (తలుపూరు హైస్కూలు హింధీ పండితులు) గ్రంధ ముద్రణము గావించిన శివరాం ఆఫ్‌సెట్ ప్రింటర్స్ వారికి, గ్రంధప్రచురణకు ఆర్ధిక సహాయమందించిన వారికి శ్రీ దాదాగారి సంపూర్ణ ఆశీస్సులు కలుగవలెనని ప్రార్ధిస్తున్నాను.

**పెసల సుబ్బరామయ్య**

## ముందుమాట

ఈ పవిత్ర గ్రంధమును భక్తుల కందించుటలో గల నా పవిత్రాశయము:-

శ్రీ షిరిడి సాయి నాధులు ఆత్మజ్ఞానానికి ధ్యాన మవసరమని అధ్యానానికి నాలుగు పద్ధతులు చెప్పారు. (1) కేవలం ఆనందంగా నైనా ధ్యానించు. (2) అట్లా వీలు కానప్పుడు నఖశిఖ పర్యంతం నారూపాన్ని చింతనచెయ్యి. (3) నీకు అదీ విసుగనిపిస్తే నాలీలలు చింతన చెయ్యి (4) అలా కూడా చేయలేనప్పుడు ప్రేమతో నా నామాన్ని ఉచ్చరించు అని చెప్పారు. కోతి గంతులు వేసే ఈ మనసు యొక్క చంచలత్వాన్ని అరికట్టే అభ్యాసంలో పై నాలుగు మార్గాలు అవసరమే. తన ఇష్ట మొచ్చినట్లు మనస్సు పరుగెత్తకుండా మనం చెప్పినట్లు ఆలోచించడమే లీలాచింతనలో మనస్సుకు మనమిచ్చే శిక్షణ. మనో చలనం దాని ఇష్టానుసారం గాకుండా మన ఇష్టానుసారం ఆలోచించాలి. శ్రద్ధా భక్తులతో పట్టు విడువకుండా పై నాల్గు పద్ధతులూ మన ఉత్సాహాన్ని బట్టి మార్చుకుంటూ చేస్తుంటే తప్పక దత్తానుగ్రహం కలుగుతుంది. ఆత్మానందం పొందుతాము.

శ్రీ షిరిడీ సాయి మనాకీవాలా అనే భక్తునితో "తాను, శ్రీ అక్కల్ కోట స్వామి, శ్రీ తాజుద్దీన్ బాబా, శ్రీ ధునీవాలా దాదాగారు, శ్రీ వాసుదేవానంద సరస్వతిగారు భూమి మీద శ్రీ దత్త కార్యాన్ని నెరవేరుస్తున్నామని" చెప్పారు. శ్రీ సాయి నాధుడు స్వయంగా చెప్పిన ఈ మహనీయుని చరిత్ర మనకందించిన శ్రీ మాష్టరు గారికి మన మందరమూ ఋణపడియున్నాము.

# శ్రీ ధునీ వాలా దాదా గారి విశిష్టత

1. మధ్యప్రదేశ్ - ఖాండ్వా అను పట్టణములోని వీరి ఆశ్రమములోని శ్రీ దాదాగారి సమాది దర్శనమునకు గాని, భోజనమునకుగాని, రూములకు గాని ఎలాంటి డబ్బు చెల్లించనవసరంలేదు.

2. ఆశ్రమానికి ఎప్పటి కేది అవసరమైతే దాన్ని శ్రీ దాదా గారే నిత్యసత్యులై నేటికీ సమకూరుస్తున్నారు. శ్రీ దాదా గారే ఈ ఆశ్రమానికి నిజమైన ఆస్థి.

3. ప్రపంచం తల్లి క్రిందు లైనా ఈ ఆశ్రమం నుండి పోస్టులో పుస్తకాలు పంపబడవు. శ్రీ దాదాగారి సమాధిని దర్శించి పుస్తకాలు తెచ్చుకోవలసినదే.

4. రైల్వే స్టేషను నుండి ఆశ్రమానికి గల ఐదు కిలోమీటర్ల దూరము. ఆశ్రమం వారి ఉచిత బస్సు సౌకర్యము గలదు.

**ఈమహనీయుని ప్రత్యేకత:-**

1. ఏసుక్రీస్తు ఒక్కసారి మాత్రమే సమాది నుండి లేచి మరలా దర్శనము ప్రసాదించారు. కానీ శ్రీ దాదాగారు నాలుగుసార్లు సమాధి నుండి పునర్జీవితులై కొన్ని సంవత్సరాలు మనుషుల మధ్య జీవించారు. పోలీసుల సమక్షములో ఇటుక సిమెంటుతో కట్టిన సమాది నుండి లేచి దర్శనమనుగ్రహించి కొన్నేళ్ళు మన మధ్య తిరిగారు.

2. శ్రీ షిరిడీ సాయితో సహా అందరు మహాత్ములూ వెండి పాదుకలు, డాలర్లు, విగ్రహాలు, విభూతి మొ॥ వాటిని ఎప్పుడూ సృష్టించి భక్తుల కివ్వలేదు. శ్రీ షిర్డిసాయి ఇరవై రూపాయలు దక్షిణ వున్నప్పుడు కూడా తన జేబులో చేయి పెట్టి వందలు, వేల రూపాయలు తీసి ఇచ్చారుగాని డబ్బు గాలిలో సృష్టించి భక్తులను భ్రమ కోల్పలేదు. అదేమి చిత్రమో కాని శ్రీ దాదాగారు ఇద్దరు



ముగ్గురు భక్తులకు బంగారు రూపాయలు మరికొందరికి తన ధుని (గుండం) నుండి బంగారు ఇటుకలు తీసి ప్రసాదించారు. ఇవి నకిలీ వస్తువులు కాదు, నర్మదా నీటితో హల్వాలు మొ॥ వాటిని సృష్టించి భక్తులకిచ్చారు. వీరి జీవితంలో ఈ నాలుగైదు సార్లు తప్ప మరలా ఇలాంటి మహిమలు కానము. వస్తువులు గాలిలో సృష్టించడం చాలా అల్పమైన లీలలేగాక ఆద్యాత్మిక మార్గములో గొప్ప అవరోధమని శ్రీ మాష్టరు చెప్పేవారు. ఈ నాలుగు లీలలు దేశ, కాల పరిస్థితులను బట్టి వారెందుకు చేశారో ఈ అల్ప జీవి చెప్ప జాలడు.

3. మృత్యువుతో వారికొక క్రీడగా ఉండేది. కొంటె పిల్లలు చచ్చిన పాములు, పక్షులు తెచ్చి వారిపైన వేసి నవ్వేవారు. పొమ్మన గానే ఆ మృత జీవులన్నీ సజీవులై వెళ్ళేవి.

4. మిఠాయి అంగళ్ళను కొల్లగొట్టి పిల్లలకు పెట్టేవారు. అంగడి యజమాని ప్రార్థిస్తే ఆ మిఠాయి ధర అక్కడున్న బండ క్రింద చూడమంటే లభించేది.

5. వీరి ద్వారా రూపు దిద్ద బడ్డ సిద్ధపురుషుల సంఖ్యకు లెక్కేలేదు.

6. భారత దేశం లోని అనేక చోట్ల గల వీరి ఆశ్రమాలన్నింటిలో అగ్ని హోత్రం ఉండి తీరవలసిందే.

7. నేటికీ తన్నాశ్రయించిన మానవుల సమస్యలన్నీ పరిష్కరిస్తున్నారు.

ఈ మహనీయుని చరిత్ర పఠించిన భక్తుల హృదయాలు తప్పక పరవ సిస్థాయని అందు వలన దివ్యలీలా మననం చేయకుండా ఉండలేరని ఆశిస్తున్నాను. ఇట్టి లీలా మననం ద్వారా మనస్సు యొక్క చంచలత్వం అరికట్టగలగడం తప్పక సాధ్యమని స్వానుభవం వల్ల గ్రహించి సోదర భక్తులందరికీ అట్టి దివ్యస్థితి శ్రీ దాదాగారు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు
లోనాన్ సమస్తాన్ సుఖినోభవంతు

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | బాల్యము | 5 |
| 2. | సకల దేవతా స్వరూపి | 13 |
| 3. | సకల సాధు స్వరూపి | 19 |
| 4. | ప్రాణదానము | 22 |
| 5. | సర్వజ్ఞులు | 36 |
| 6. | సర్వవ్యాపకుడు | 44 |
| 7. | భక్తపాలన | 47 |
| 8. | యోగనాధుడు | 58 |
| 9. | శ్రీ దాదాగారి వచనామృతము | 72 |
| 10. | కల్ప వృక్షాలు | 74 |
| 11. | మహాసమాది | 77 |
| 12. | మహాసమాది అనంతరం లీలలు | 80 |


**ఖాండ్వా వెళ్ళుటకు రైలు మార్గము**

1. మద్రాసు నుండి విజయవాడ మీదుగా అహమ్మదాబాద్ వెళ్ళు నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి అకోల్లా స్టేషన్‌లో దిగాలి. అక్కడ నుండి పాసింజర్ రైలులో ఖాండ్వా రైలుస్టేషను చేరాలి.

2. డిల్లీ వెళ్ళు రైలెక్కి ఇటార్సీ స్టేషన్‌లో దిగి అక్కడ నుండి పాసింజర్ రైలులో వెళ్ళి ఖాండ్వా రైలు స్టేషన్‌లో దిగాలి.

శ్రీ ధునీ వాలా దాదాగారి సమాది మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వాలో ఉన్నది.



# శ్రీ ధునీవాలా దాదాగారి దివ్యచరిత్ర

## అధ్యాయం 1 - బాల్యము

మతసామరస్యమే తమ అవతార కార్యముగాగల దత్తావతారాలైన శ్రీ షిరిడీ సాయి, శ్రీ అక్కల్ కోట స్వామి, సంత్ కబీరు వంటి మహనీయుల తల్లిదండ్రుల గురించి గాని, జన్మ వివరాలు గాని, వారిమతము కులముల గురించి గాని లోకమునకు వెల్లడి కాలేదు. తమ అవతార కార్యమైన సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని భోదించుటకు భూమిపై వెలసిన పరంబ్రహ్మ స్వరూపులు ఒక మతానికి కులానికి చెందియుండడం వారి లోకకల్యాణ కార్యానికి వెలితే అవుతుంది. గనుకనే వీరి తల్లిదండ్రులను గురించి గాని, కులమతాలను గురించిగాని, ఏ గ్రామానికి చెందినవారో గూడా వీరు వెల్లడించ లేదు, ఇదే విధంగా శ్రీ ధునీ వాలా దాదాగారు కూడా ఎవరి బిడ్డడో ఏకుల మతానికి చెందినవారో ఎవ్వరికీ తెలియదు.

మన కథానాయుకుడైన శ్రీ ధునీవాలా దాదాగారి గురువుగారిపేరు శ్రీ గౌరీ శంకర్ మహారాజ్ గారు. వీరు మహారాష్ట్రము నందలి నర్మదా నదీ తీరమున నివసించిన గొప్ప సిద్ధపురుషులు. హోషంగా బాద్‌నకు పదునాలుగు మైళ్ళ దూరమునగల కౌసర్ అనే గ్రామములో వీరు నేటికీ జీవసమాదిలో ఉన్నారు. నేటికీ వీరి సమాది అర్తులపాలిటి కల్పవృక్షమై వెల్గుచున్నది.

శ్రీ గౌరీ శంకర్ మహారాజ్ గారికి నర్మదానదీ, తీరములో ఏడెనిమిది సంవత్సరముల పిల్లవాడుగా శ్రీధునీవాలా దాదాగారు కనిపించారు. ఈ బాలకుడే తన పీఠమునకు వారసుడని తన దివ్య దృష్టితో తెలుసుకొన్న గౌరీ శంకర్ మహారాజ్ గారు పరమానందముతో ఆబాలుని ఆలింగనము చేసుకొని మాధవుడని పేరుపెట్టెను, సన్యాసధీక్షా సమయమున

శ్రీకృష్ణానంద అని నామకరణము చేసెను. కాలాంతరములో వీరి సాధు మిత్రులు వీరిని శ్రీ కేశవానంద అని కూడ పిలిచేవారు. చివరకు భక్తులు వీరిని శ్రీ ధునీవాలా దాదా గారని ప్రేమతో పిలుచు కునేవారు. వీరు నిరంతరం ధుని (అగ్ని) వెలిగించుకొని యుండుటయే ఇందుకు కారణము.

మాధవుడు క్రమక్రమంగా ఆ ఆశ్రమమునకే గాక సకల సృష్టికే వెలుగై ప్రకాశింప సాగెను. అచిర కాలముననే వేదా ధ్యయనము కొరకు కాశీ క్షేత్రమునకు పంపబడెను. అచ్చట వీరు సరస్వతీ వర ప్రసాదిగా గుర్తింపబడి అతి స్వల్ప కాలములో ఆచార్య పదవికి డిగ్రీ సంపాదించుకొని తిరిగి గురు సన్నిధి కరుదెంచెను. శ్రీ దేవానంద్, శ్రీ బ్రహ్మానంద్ అను మహనీయుల కడ వీరు హఠయోగ మభ్యసించారు. బ్రాహ్మ ముహూర్తమున నిద్ర లేచినది మొదలు అర్థ రాత్రమున పరుండు వరకు విరామము లేకుండా కర్మకాండ అధ్యయనము, గురుసేవ, సాధుసేవ, నర్మదా స్నానము, వ్యాయామము, ప్రాణాయామము మొదలైన కార్యములలో నిమగ్నమై ఉండేవారు. వీరి గొప్పదనానికి ముగ్ధుడైన శ్రీ గౌరీ శంకర్ మహరాజు గారు వీరికి ఆశ్రమ వంటగది భాధ్యత వప్పగించెను.

**సింహాల కాపలా:-** పరతత్వాన్ని పొందాలనే తీవ్రకాంక్షతో చాలా సార్లు రాత్రి సమయాల్లో సమీప అడవులకెళ్ళి తీవ్రధ్యానంలో మునిగిపోయేవారు. అలాంటప్పుడు వారికి కాలగతిగాని పరిసరాలు గాని తెలిసేవిగావు. రాత్రంతా రెండు సింహాలు వచ్చి వారికిరువైపులా కూర్చొని కాపలాకాచి తెల్లవారగనే అడవిలోకి వెళ్ళేవి. శ్రీ దాదాగారి కొరకు వెదకుచున్న సాదువులు ఆ సింహాలను చూచి భయభ్రాంతులయ్యారు. "ఆత్మే అన్ని జీవులలోనూ ఉంది. కనుక మీరు భయపడవలసిన పని లేదు" అని చెప్పి వారిని ఊరడించారు.

ఒక్కొక్కప్పుడు శ్రీ దాదాగారు తన్మయులై సాదుసంగములో పరవసించి పాడేవారు. ఆసాదువులందరూ ఆదివ్యగానం విని ఈలోకాన్నే మరచేవారు.



**దినచర్య:-** వీరికెప్పుడూ నిద్రరావడమంటూ ఉండేదికాదు. ఆధ్యాత్మికంగాను, మానసికంగాను. శారీరకంగాను కష్టపడవలసి వచ్చినప్పుడు వీరెన్నడూ హృదయదౌర్బల్యం చూపించి ఎరుగరు. ప్రాతఃకాలమున 4-00 గం॥లకు నిద్రలేచి స్నానానంతరం గంటల తరబడి ప్రాణాయామంచేసేవారు. ఆతర్వాత వెయ్యి బస్కీలు, వెయ్యి గుంజీళ్ళు తీసేవారు. పగలు 2-00గం॥ల సమయంలో సాధారణ భోజనాన్ని చాలా స్వల్పంగా మాత్రమే భుజించేవారు. సాయంకాలం 5-00 గం॥లకు స్నానానంతరం సంధ్యావందనము, ప్రాణాయామముచేసేవారు. రాత్రి 7-00 గం॥లకు నర్మదామాత పూజ హారతి చేసేవారు ఆ తర్వాత రాత్రి 11-00 గం॥ల వరకు ఆశుకవిత్వంగా స్తోత్రాలుచదివేవారు.

శ్రీ దాదాగారు ఎప్పుడూ ఏకాంత ప్రియులు. ప్రపంచ మంతా నిద్రించు అర్థరాత్రి సమయమున నర్మదామాతను ఏకాగ్రమనస్సుతో స్తోత్రముచేయుచు ఆతల్లిని ప్రసన్నము చేసుకొను చుండేవారు. నర్మదానది ఇసుక, నీరు కలిపి చక్కెర, నెయ్యి. జీడిపప్పు, ద్రాక్షగల మధురమైన హల్వాతయారుచేసి నిద్రించు సాధువులందరి తలలదగ్గర ఆకులలో పెట్టేవారు. పిన్నవయస్కుడైన శ్రీదాదాగారి యోగశక్తులెరుగని ఆశ్రమ సాదువులు, ఆశ్రమ వంటగదిలోని వస్తువులు దుబారాచేయుచున్నాడని గురువుగారైన శ్రీ గౌరీశంకర్ మహరాజ్‌గారికి ఫిర్యాదుచేశారు. సర్వజ్ఞులైన శ్రీ గౌరీశంకర్ మహరాజ్‌గారు శ్రీ దాదాగారి గొప్పదనం అందరికీ వెల్లడి చేయు తలంపుతో అందరి సమక్షమున శ్రీ దాదాగారిని ఈ విషయమై ప్రశ్నించారు. తాను ఆశ్రమ పదార్థాలు వాడడం లేదనియు నర్మదా మాత కృపవల్లనే తనకా ప్రసాదము లభించుచున్నదనియు చెప్పి సాదుసంగము సమక్షములో నర్మదా మాత ఇసుక నీరు కలిపి హల్వా సృష్టించారు. ఈ అద్భుతము గాంచిన సాధుసంగము భక్తి ప్రపత్తులతో శ్రీ దాదాగారికి ప్రణమిల్లారు. గురుదేవులు తన ప్రియశిష్యుని ఆలింగన మొనర్చెను. కార్యదీక్ష, నిస్వార్థత, గురుభక్తి, గురుసేవ, గురు మర్యాద మొదలైన సద్గుణాల రాసియై శ్రీ దాదాగారు ప్రఖ్యాతి గాంచారు. గురుకృపవలన వారి యోగాభ్యాస కాలమున వారు భూమిపై పదడుగుల ఎత్తు వరకు పైకి లేచెడి బాలయోగిగా పేరు పొందారు.

శ్రీ దాదాగారు అప్పుడప్పుడూ భయంకరారణ్యములోకి వెళ్ళి ఎన్నో రోజుల పాటు సమాధి నిష్టులై వుండేవారు. ఒకరోజు వారట్టి సమాధి నిష్టలో నుండగా ఒక కొండచిలువ వీరి ఎడమకాలు మ్రింగసాగింది. ఆ దృశ్యమును చూచిన పశువులకాపర్లు గ్రామస్తుల సహాయంతో పెద్ద శబ్దముచేయగా శ్రీ దాదాజీగారికి బాహ్య ప్రజ్ఞకలిగి కాలు ఝాడించారు. పాముపెళ్ళిపోయింది. కానీ వీరి చిటికిన వ్రేలి ప్రక్కవ్రేలును అప్పటికే పాము జీర్ణముచేసుకున్నది. సాధుమిత్రులందరూ వీరిని తిరిగి ఆశ్రమమునకు తీసుకపోయారు.

అటు తర్వాత కొన్నాళ్ళకు మరలా శ్రీ దాదాజీగారు ఆశ్రమములో కన్పించనందున సాధుమిత్రులందరూ కలవరపడసాగిరి. ఆ ఘోరారణ్యములో కొన్నిరోజులపాటు నలుమూలలా గాలించిరి. చివర కొకచోట వారు శ్రీ దాదాజీగారి మృతదేహమును చూచారు. వారి శరీరఛాయ, పాముకాటువేసిన చోట కారి ఎండిపోయిన రక్తమును బట్టి శ్రీ దాదాగారు పాముకాటుచే మృతి చెందారని తలచి మిత్రులందరు ఎంతో దు:ఖముతో ఆకళేబరమును సమీపమందలి నర్మదానదిలో జలసమాధి గావించి ఆశ్రమంచేరిరి.

పై సంఘటన జరిగిన తర్వాత కొన్నివారములకు శ్రీదాదాజీ గారు హోషంగాబాద్‌లో రామఫల్ అనుపేరుతో దర్శనమిచ్చి భక్తుల ననుగ్రహింపమొదలు పెట్టారు. ఈ విధముగా మరణానంతరము పునర్జీవితులవడం యోగపూర్ణులైన మహనీయులకు దప్ప సామాన్యమానవులకు సాధ్యముకాదుగదా? అయితే ఈ సమయములో శ్రీ దాదాగారు "బాలోన్మత్త పిశాచ" దశలో నుండేవారు. కొంతమంది అజ్ఞానులు వారి వారి సంస్కారాన్ననుసరించి ఆమహనీయుని విమర్శిస్తూ పాపాన్ని మూటగట్టుకునేవారు. ఈ దశలో వీరు చిన్నపిల్లలకు కోరిన మిఠాయీలను సృష్టించి ఇచ్చు చున్నందున వారెప్పుడూ వీరివెంటుండేవారు. శ్రద్ధాభక్తులు గల కొందరు జనులు వీరి పాదధూళి గ్రహించి కృతార్థులగుచుండిరి.



అసంఖ్యాకమయిన వీరి దివ్యలీలలో ఒకటి రెండు స్మరించడం మంచిది. హోషంగాబాద్‌లో వీరు ప్రభుత్వాధికారుల అనుమతి లేకుండా వారి వాహనము లెక్కి తిరిగేవారు. ఒకరోజు అధికారులు కూడబలుక్కొని వీరిని జైలులో బంధించారు. మరుక్షణంలో వీరు నవ్వుచూ జైలు వెలుపల దర్శన మిచ్చి వారిని సంభ్రమాశ్చర్యములో ముంచెను.

ఒకపేద విద్యార్థి వీధి దీపపు వెలుతురులో చదువుకొంటుండగా పోలీసులాతనిని అనుమానించి స్టేషనుకు తీసుకవెళ్ళి బాగాకొట్టారు ఈ విషయం శ్రీ దాదాగారికి తెలిసి తనచేతికర్రతో పట్టణములోని అనేక దీపములను బ్రద్దలు కొట్టెను. గనుక సబ్ ఇనస్పెక్టరు శ్రీ దాదాగారిని జైలులో బందించెను. జైలు వెలుపలకు రాగానే ఆ ఇనస్పెక్టరునకు శ్రీ దాదాగారు నవ్వుచూ రోడ్డుమీద కనిపించాడు. ఆ అధికారి పరుగున పోయి జైలులో చూస్తే అక్కడకూడా శ్రీ దాదాగారే ఉన్నారు. మతిపోయిన పోలీసు ఇనస్పెక్టరు శ్రీ దాదాగారిని జైలునుండి వదలిపెట్టి క్షమాపణచెపుతూ దయచేసి దీపాలు పగులగొట్టి నష్టము కల్గించవద్దని' ప్రార్థించెను.

## రెండవ సారి మృత్యువుపై ఘనవిజయము

ఈ విధంగా కొంతకాలం హోషంగాబాద్‌లో తన దివ్యలీలలతో భక్తనముద్ధరణగావించాక ఆప్రదేశము వదలి వెళ్ళవలెనని నిశ్చయించుకున్నారు. ఒకరోజు వారు ఒక అలౌకిక స్థితిలో సంచరిస్తూ ఆ పట్టణములోని ఒక బావిలో పడిపరమ పదించారు. పోలీసువారి పర్యవేక్షణలో ఆనగరములోని భక్తులందరూ అశ్రుతర్పణాలతో శ్రీ దాదాగారి భౌతికకాయాన్ని సమాధిచేసి పూజాదికములు నిర్వర్తించారు. నగరమంతా తమ ప్రియబాంధవుని కోల్పోయామని శోకసాగరంలో మునిగిపోయింది. తల్లిని కోల్పోయిన బిడ్డలవలె పిల్లలంతా శ్రీ దాదాజీ గారికొరకు దుఃఖించారు. అమాయకులైన జనసందోహమునకు శ్రీ దాదాగారి నిజస్థితి తెలిసే ప్రశక్తే లేదుగదా! సకల సృష్టి తామేననే అనుభవజ్ఞానము గల మహనీయులకు మరణమెక్కడిదీ! ఇట్టి మహనీయులు శరీరము

చాలించాక కూడా కోరిన చోట శరీరముతో భక్తులకు దర్శనమీయగలరు. అట్టి వారి మహాద్భుత దివ్యస్థితినే "శాశ్వత దేవరాజ్యమని, మృత్యువుపై వారు సాధించిన ఘనవిజయమని ఆచార్య శ్రీ భరద్వాజగారు పేర్కొన్నారు. శ్రీ దాదాగారు ఒక సారి కాదుగదా అనేకసార్లు పోలీసుల సమక్షమున సమాధిచేశాక తిరిగి పునరుద్ధానమై మనమధ్య సంచరించారు. ఇదే దత్తావతారాల యొక్క విశిష్టత.

పై సంఘటన జరిగిన తరువాత కొద్దిరోజులలోనే సోహగ్‌పూర్ అడవులలో తిరిగి ప్రత్యక్షమై తన దివ్యలీలలు చూపసాగారు. ఈవార్త గ్రామగ్రామాలలో మార్మోగిపోయింది. శరీరం వదిలాక పునరుద్ధానమైన ఈ మహనీయుని దర్శనానికి గ్రామ గ్రామాలే తరలివచ్చాయి. పోలీసువారి సమక్షములో సమాదిచేయబడిన శ్రీ దాదాగారీవిధముగా పునర్జీవితులవడం పోలీసుశాఖ వారికి దిగ్భ్రమ కల్గించింది. సోహగ్‌పూరులో శ్రీ దాదాగారు ఆశవదలిన రోగులకు స్వస్థత కూర్చుట, మనశ్శాంతి ప్రసాదించడం వంటి అలౌకిక లీలలు ప్రదర్శిస్తూ వేలమందికి ప్రీతిపాత్రులయ్యారు.

ప్రేమదాసను భక్తుడు తన నిజమైన భక్తిశ్రద్ధలనే దక్షిణగా సమర్పించి శ్రీ దాదాగారిని తన హృదయంలో బందించుకున్నారు. ప్రేమదాసు కడుపేద వాడైనప్పటికి అతని శ్రద్ధాభక్తులకు సంతృప్తి చెందిన శ్రీ దాదాగారు అతని కోరికననుసరించి నరసింగ్‌పూర్ చేరారు. ప్రేమదాసు ఊరంతా అప్పులుచేసి నిండైన భక్తితో శ్రీ దాదాగారికి ఆతిధ్యమిస్తుండే వాడు. అతనికి ఆగ్రామములో అప్పే పుట్టని పరిస్థితి ఏర్పడింది. సర్వసాక్షియైన శ్రీ దాదాగారికి తెలియనిదేముంది. ఒకరోజు శ్రీ దాదాగారు నర్మదా మాత (నది) ఇసుకను తెప్పించి అందరి సమక్షములో ఆ ఇసుకను తన స్పర్శ మాత్రంచేత బంగారుగా మార్చి ప్రేమదాసుకిచ్చి ఋణబాధను తొలగించు కొమ్మని ఆశీర్వదించారు.



శ్రీ దాదాగారి దివ్యమహిమకు ఆకర్షితులైన వేలమంది భక్తి మార్గమనుసరించ సాగారు. వీరంతా ఒకగురు పూర్ణిమ రోజు శ్రీ దాదాగారి నుండి మంత్రోపదేశము పొందవలెనని నర్మదానది యొక్క బ్రహ్మాణ ఘాట్ యొద్దకు శ్రీ దాదాగారిని భజనలతోను, ఆనందోత్సాహములతోను తీసుకవచ్చారు. భక్తి పారవస్యములో భక్తులు చేయుసంకీర్తన, భజనలకు తన్మయులైన శ్రీ దాదాగారు నదిలోదిగి ఆనందోత్సాహములతో జలక్రీడలాడసాగారు. భక్తుల జయజయ ద్వానాలతో దిక్కులు మార్మోగుతున్నాయి. ఆపారవశ్యములో శ్రీ దాదాగారు అధికముగా నీరు త్రాగి "మేమిప్పుడు సమాధిలోకి పోవుచున్నాము" అని పిచ్చివానివలె ముమ్మారు కేకలు పెట్టి వాంతి చేసుకున్నారు. మరుక్షణమే స్పృహ కోల్పోయి నీటిలో పడి పోయారు. ఆనంద పారవస్యంతో మొదలైన గురుపూర్ణిమ ఆవిధంగా వేలమంది భక్తుల అశ్రుతర్పణాలతో ముగిసింది. పోలీసువారి పర్యవేక్షణలో శ్రీ దాదాజీ గారి శరీరాన్ని మూడు రోజులు భద్రంగా ఉంచారు. ఎందుకంటే వారి శరీరంలో జీవలక్షణాలు లేకున్నాగాని ఉష్ణము తగ్గలేదు. నాలుగవ నాడు వేలాది భక్తులు పుష్పాంజలులర్పిస్తుండగా వారి భౌతిక కాయాన్ని పోలీసుల సమక్షములో సమాధి చేశారు. ఇప్పటికే మూడు మార్లు సమాధి నుండి పునరుద్ధానమైన శ్రీ దాదాగారికీ సమాధికూడా మరొక పూలపల్లకి మాత్రమేనని అమాయకులైన భక్తులు తెలుసుకోలేక దుఃఖసాగరంలో మునిగిపోయారు. కానీ నిత్య సత్యులైన శ్రీ దాదాగారు జనన మరణాలకతీతులు.

అటు తర్వాత ఒక సంవత్సరమునకు శ్రీ దాదాగారు దిగంబరులై సిరిసిరి సిందూర్ అను గ్రామములో కేశవానంద్ అను పేరుతో అద్భుత లీలలు ప్రదర్శించి మధ్యప్రదేశ్ రాష్ట్రాన్నే గాక ఇతర చుట్టుప్రక్కల గ్రామాలను గూడ సంభ్రమాశ్చర్యములలో ముంచివేశారు.

సిరిసిరి సింధూర్ గ్రామములో శ్రీ దాదాగారు చూపరులకు దిగంబరులైన పిచ్చి వానివలె కన్పించినప్పటికి వారనుగ్రహించిన దివ్యలీలల ద్వారా అనతికాలములో వారి ఖ్యాతి నలుదెసలా వ్యాపించసాగింది. శ్రీ దాదాగారు గ్రుడ్డి వారికి చూపునివ్వడం, దరిద్రులకు

సిరిసంపదలనుగ్రహించడం మొండి వ్యాధులు నయం చేయడం. ప్రేతబాధలు తొలగించడం లాంటి ఎన్నో దివ్యలీలలు చూపారు. దైవశక్తిని నిరూపించారు. 1907 సం॥లో శివలాల్ పటేల్ అను భక్తుడు శ్రీ దాదాగారిని సాయిఖేడా అను పుణ్యక్షేత్రమున కేతెంచి భక్తులనను గ్రహించమని వేడుకున్నాడు. శ్రీ స్వామి మదనానంద్. శ్రీ మగనీసుబాబా, శ్రీ స్వామి నరహరియానంద్ అను మహాత్ముల నివాసమైన సాయిఖేడా క్షేత్రములో తన అవతారకార్యము సాగించారు. కులమతాలకతీతంగా వారు సాగించిన దివ్యలీలలు రాబోవు అధ్యాయంలో చూస్తాము.

**శ్రీ దాదాజీగారు సిరిసిరి సింధూర్ వదలి సాయిఖేడా అనే గ్రామం రావడం :-** సాయి ఖేడాలో మసూచి వ్యాధి ఉధృతంగా వ్యాపించి అనేక మంది మరణానికి గురియగుచున్న సమయమది. సాయిఖేడాలోని భూస్వామి పెద్ద కుమారుడు మసూచికి గురియై చివరిదశలో ఉన్నాడు. సిరిసిరి సింధూర్‌లోని వారి బంధువు కడసారి చూపులకై సాయిఖేడా వచ్చి పూజ్యశ్రీ దాదాగారిని తీసుకవచ్చిన ఈ బిడ్డతప్పక బ్రతుక గలడని వారికి ఆశచెప్పెను. వెంటనే ఆ భూస్వామి పల్లకి నలంకరించుకొని వందమందికి పైగా గ్రామస్తులతో వెళ్ళి శ్రీ దాదాగారిని వారిపై కృపచూపమని ప్రార్థించెను. వారి ప్రార్థన మన్నించి శ్రీ దాదాజీగారు సాయిఖేడా ఏతెంచెను. ఆ గ్రామ పటేల్ గారి కోటలో మకాం వేశారు.

ఈ గ్రామస్తులంతా పూలమాలలతోను కానుకలతోను వచ్చి భజనచేయసాగిరి. అందులో ఒక ముసలమ్మ గోధుమరొట్టెలు తెచ్చి చేతనట్టుకొని ఆర్తితో భజనచేయసాగెను. కరుణామయుడైన శ్రీ దాదాజీ అంతమందిలోను ఆ తల్లి దగ్గరున్న రొట్టెలు తీసుకొని వెళ్ళి మసూచితో చివరి దశలో నున్న ఆ పటేల్ బిడ్డకు పెట్టసాగెను. ఆ రొట్టెలు తినగానే కొద్ది నిమిషాలలో ఆ బిడ్డ మసూచి ఏమైందోగాని ఆ బిడ్డ ఎంతో హుషారుగా లేచి ఆడుకునేందుకు వెళ్ళిపోయాడు. ఈ లీలను కన్నులారాగాంచిన ప్రజలందరూ ఎంతో శ్రద్ధాభక్తులతో శ్రీ దాదాజీని పూజించారు. నాటినుండి ఆ గ్రామంలో మసూచి వ్యాధి అదృశ్యమాయెను.



## సకల దేవతా స్వరూపి

సర్వజీవుల సముద్ధరణకై తననుతాను జీవకోటికి దత్తముచేసుకొన్న విశ్వగురు తత్వమే (దత్తుడు) దేశకాల భేదాన్ననుసరించి భూమిపై అనేక మంది సద్గురువులుగా మానవశరీరం ధరిస్తుంది. ఇట్టి మహనీయులు మతం పేరుతో పేరుకొన్న మతమౌఢ్యాన్ని నివారించి నాదేవుడే గొప్ప, నామతమేగొప్ప అనే భక్తుల హృదయాల లోని సంకుచిత భావాలను తొలగిస్తారు. భగవంతుడు నామరూపాలకతీతుడని సద్గురునికి సంపూర్ణశరణా గతిచేసి, వారి అజ్ఞలను హృదయ పూర్వకమైన ప్రేమతో సాధకులు ఆచరించి ముక్తిపొందాలనేదే వారి తపన. భక్తులపైగల అపారమైన ప్రేమతో, ఎంతో సాధన తపస్సుతోగాని సాధ్యముకాని ఇష్టదేవతా దర్శనాన్ని ఎంతో సులభంగా పొందిన సద్భక్తునికి ఆసద్గురునిపై అపారమైన ప్రేమ, విశ్వాసము ఏర్పడడం సహజము, అప్పుడతడు ఆసద్గురుని ఆజ్ఞలను హృదయపూర్వకమైన ప్రేమతో ఆచరించి సాధనచేసి తరిస్తాడు. అందుకే మన దాదాజీగారు ఎంతో మంది భక్తులకు వారివారి ఇష్టదైవాల రూపంలో దర్శనమనుగ్రహించారు.

జబల్‌పూర్ నివాసి శ్రీ భాస్కరానంద స్వామిగారు వారి మిత్రులు నాజర్‌గారు సాయిఖేడాలో శ్రీ దాదాజీ గారిని దర్శించారు. హారతి సమయంలో వారికి జటాజూట దారియైన శంకరునివలె దర్శనమిచ్చారు. ఆ సమయంలో శంకరుని వెనుక ఖడ్గధారియైన కాళీమాత కూడా దర్శనమిచ్చింది.

మరొకప్పుడు డులహరయా నుండి వచ్చిన శేట్ గారి భక్తిశ్రద్ధలకు సంతసించి శ్రీ దాదాగారు విరాట్ రూపంలో దర్శన మిచ్చారు.

సర్వానర్థదాయకమైన గర్వం అనేక రూపాలలో సాధకులకు తెలియకుండానే వారి అంతరాత్మలో ఉంటూ వారి ఆధ్యాత్మికాభివృద్ధికెంతో అవరోధమై నిలుస్తుంది. అట్టి అంతర్హిత అవలక్షణాలను ఒక్క సద్గురువులు మాత్రమే పసిగట్టి దాన్ని రూపుమాప సమర్థులు. ఒకనాటి రాత్రి

శ్రీ దాదాగారు భాస్కరానంద్ గారి ఒడిలో విశ్రమించి యుండగా మరొక భక్తుడు వారిపాదములు వత్తుతున్నాడు. ఒక శ్రద్ధాళువైన భక్తుడు వారిని దర్శించి నమస్కరించాడు. శ్రీ దాదాగారు వారి భక్తిశ్రద్ధలకు సంప్రీతులై కొంచెము రొట్టెను వారికి ప్రసాదముగా ఇచ్చారు. అవచ్చిన భక్తుని అంతరాత్మలోని గర్వం ఆ కొద్దిపాటి రొట్టెను నిరాకరించేలా చేసింది. వెంటనే వారికి శ్రీ దాదాగారు శేషపాన్పుపై నున్న శ్రీ మహావిష్ణువు గను, లక్ష్మీదేవి వారి పాదములు వత్తుచున్నట్లు దర్శనమైంది. ఆ ఆనంద పారవస్యములో ఆభక్తుడు శ్రీ దాదాగారి పాదములపై వాలి ఆనందభాష్పాలు రాలుస్తూ రొట్టెను ప్రసాదంగా అనుగ్రహించమని అర్థించి స్వీకరించారు.

మదన్ మోహన్ దుబే కొందరు స్నేహితులతో కలసి శ్రీ దాదాగారిని ఉజ్జయనీలో దర్శించారు. స్నేహితులంతా మహాకాలుని అలయానికి వెళ్ళారు. కానీ మదన్ మోహన్ అనన్య గురుబక్తుడు గనుక శ్రీ దాదాజీ గారితోనే ఉండి ఇలా తలపోశాడు. "నాసర్వస్వము శ్రీ దాదాగారే నాకిక మహాకాలునితో పనిఏమి?" అని తలచిన వెంటనే శ్రీ దాదాగారు "మదన్, మహాకాలుడూ మేమే. కానీ ఏదైనా క్షేత్రానికి వచ్చినప్పుడు తన పొట్టనింపుకొనడమే గాక కొంత దానము పుణ్యము చేయాలనే మాట మరువ రాదు సుమా!" అని సెలవిచ్చారు. శ్రీ దాదాగారి ఆజ్ఞమేరకు ఆలయానికి వెళ్ళి మహాకాలునికి అభిషేకము చేయించాడు. తర్వాత అష్టాధ్యాయిలనబడు పురోహితులచేత వేదపండితుల సమక్షములో వేదోక్తముగా శ్రీ దాదాగారికి అభిషేకము పూజలు జరిపించారు. వేదపురోహితులు మంత్రములు త్వరత్వరగా చెప్పుచుండుటచే మదన్ మోహన్ గారా మంత్రములను పలుకలేక ఊరకుండెను. వేంటనే శ్రీ దాదాగారు "మదన్! మంత్రములు నీవు చెప్పకున్న నాకు తృప్తి ఉండదు' ' అని సెలవిచ్చిరి. ఆ కరుణామయుని ఆజ్ఞమేరకు భక్తి శ్రద్ధలతో మదన్‌గారామంత్రములు ఉచ్చరించుచూ హృదయ పారవస్యముతో అభిషేకము పూజలు పూర్తిగావించి ధన్యులైరి. అందుకే ఈ దత్తావతారములందరూ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సామూహిక



ఆరతి ప్రోత్సహించారు. నేటికీ షిరిడీలో మంత్రాలన్నీ పురోహితులు చెపుతుంటే పూర్తిగా భక్తులు కూడా చెప్పూ పూజచేసుకునే ఏర్పాటు చేశారు. అన్ని మందిరాలలోను అలాంటి పద్ధతే ఉంటే కూలిపూజల బెడద తీరుతుంది. పుణ్యము పురుషార్థము సంపూర్ణంగా దక్కుతాయని గుర్తించాలి.

దర్శనార్థం వచ్చిన సదన సింహరాజపుత్ గారిని చూడగానే 'నిత్యం అందరికీ ఆహారం పెట్టే మేము, నేడు నీ చేతి ఆహారం తింటాము" అని సెలవిచ్చారు శ్రీ దాదాగారు. ఆ భాగ్యానికెంతో సంబరపడిన సదన సింహులు మిఠాయి తీసుకొని దాదాగారి నోటిలో పెట్టబోయాడు. దాదాగారి నోటిలో తనయిష్టదైవమైన శ్రీ కృష్ణుని దర్శనం కొద్ది క్షణాలు పాటులభించి ఆనందపరవశుడై శ్రీ దాదాగారి పాదాలకు ప్రణమిల్లాడు. అనంతరం నైవేద్యం సమర్పించి హారతిచ్చారు.

శ్రీ శిరిడీసాయి 1918 లో మహా సమాధి చెందాక హార్దానివాసి సదాశివరావ్ తనకిక దిక్కెవ్వరని చాలా హృదయ విదారకంగా దుఃఖించాడు. కరుణామయుడైన సాయి స్వప్నదర్శనమిచ్చి, "బిడ్డా దుఃఖించవద్దు - ప్రస్తుతం మేము సాయిఖేడాలో వున్నాము. అక్కడ నన్ను దర్శించు". అన్నారు. సాయిఖేడా వెళ్ళిన సదాశివ్‌రావుగారికి దాదాగారి స్థానంలో కొంత సేపు షిరిడీ సాయినాదుని దర్శనమైంది. శ్రీ సాయి, శ్రీ దాదాగారు వేరుగాదని అది మొదలుకొని హృదయపూర్వకంగా దాదాగారినే సాయిగా భావించి సేవించసాగాడు.

సాయిఖేడాలోని శివాలయంలో మదన్‌మోహన్ డుబే మరికొందరు స్నేహితులతో కలసి యజ్ఞము చేస్తున్నాడు. పరమ దయానిధియైన శ్రీ దాదాగారు దివ్య ప్రకాశరూపంలో దర్శనమిచ్చి తన మామూలు గొంతుతో, "ఇచ్చటేమిచేస్తున్నారని" అడిగారు. గురువు గారికంఠధ్వనివిని మదన్‌గారు ఉలిక్కిపడి, "ఏమిలేదు దాదాగారు" అని జవాబిచ్చారు. "అయితే మీరిక్కడ ఆటలాడు కొనుచున్నారా" అనిచెప్పి ఆదివ్యప్రకాశం అదృశ్యమైంది. ఇదే విధంగా మదన్ గారికి అనేక పర్యాయములు

శ్రీ దాదాగారు దర్శన మిచ్చారు. అంతేగాక పూజ్యురాలైన ఆజీగారికి కూడా అనేక సార్లు ప్రత్యక్ష దర్శనం ప్రసాదించి యున్నారు. మృత్యువుపై విజయంసాధించిన మహనీయులంటే వీరేగదా! వీరు నిత్య సత్యులు. సృష్టి స్థితిలయాలకు అతీతులు. కోరిన చోట దర్శనమిచ్చి భక్త రక్షణ గావించడంలోనే దత్తావతారాల విశిష్ఠత యిమిడి వుంది. అది గుర్తించి తగు విధంగా మనం వారిని సేవించి తరించాలనే తలంపుతోనే వారు మనకట్టి దివ్యానుభవాలు ప్రసాదిస్తున్నారు.

హోషంగాబాదు నివాసి పండిత రామకృష్ణ తన మిత్రుడు మురళీధర్‌తో కలసి ఈశ్వరాన్వేషణకై 'అమరకంత' వెళ్ళి సాధన చేయసాగారు. శ్రద్ధా భక్తులతో చేయువారి సాధనకు నర్మదా మాత సంప్రీతురాలై ఒక వృద్ధ స్త్రీ రూపమున ప్రత్యక్షమై "మీరే ఈశ్వరుని కొఅకు అన్వేషిస్తున్నారో వారు మీకు సాయి ఖేడాలో లభిస్తారు" అని చెప్పి అదృశ్యమైనది. వీరిద్దరూ సాయిఖేడాపేరు గాని శ్రీ దాదాగారి పేరుగాని అంతవరకు వినియుండలేదు. అనేక మందిని విచారించి సాయిఖేడాచేరి, శ్రీ దాదాగారిని దర్శించారు.

ఆ సమయంలో ఒక అందమైన వేశ్య తన మధుర గానముతో శ్రీ దాదాగారి సన్నిధిలో శంకర భజన చేస్తున్నది. శ్రీ దాదాగారు ఆపాటలకు అనుగుణంగా ఊగుతూ, అశ్లీలమైన పదజాలంతోను, వేళ్ళసైగలతోను సంభోగావస్థను వర్ణించారు. ఆ వర్ణనలోని మహత్మ్యమేమో గాని వీరిద్దరి మనస్సులు మాత్రం పరమాత్మతత్వ జిజ్ఞాసతో మైమరచిపోయాయి. అంతే గాక ఏబాధలేకుండానే చాలా కాలంగా వారిని బాధించుచున్న అనేక తాత్వికమైన ప్రశ్నలన్నీ సమాధాన పడిపోయాయి. ఈ మిత్రులిద్దరూ ఈ విధంగా ఆనంద పారవశ్యంలో నుండగా వారికి శ్రీ దాదాగారి తలపై చంద్రవంక, ముఖాన ఫాలనేత్రము దర్శనమైంది. ఆనందోద్వేగములతో మిత్రులిద్దరూ శ్రీ దాదాగారి పాదములకు ప్రణమిల్లారు. వీరిద్దరూ తమ శేష జీవితాన్ని శ్రీ దాదాగారి సేవలో గడిపి శ్రీ దాదాగారితో ఐక్యమయ్యారు. తాను శంకరుడనని శ్రీ దాదాగారు జిజీబాయికి చెప్పినమాట యదార్థమని మరొకసారి నిరూపించారు.



అనేక సంత్సరములుగా భక్తి శ్రద్ధలతో కాళికాదేవిని ఉపాశించు భక్తుడొకడు శ్రీ దాదాగారిని దర్శించి తన సాధనంతా నిష్ఫలమైనదని, తనకు కాళికాదేవి దర్శనం కాలేదని, తనపైన కరుణించి దేవిదర్శన మిచ్చునట్లు, అనుగ్రహించమనీ ప్రార్థించాడు. పరమదయానిధియైన శ్రీ దాదాగారు ఆభక్తుణ్ణి ఆసమీపంలోని గుడిసెలో వున్న కాళికాదేవిని దర్శించి రమ్మని పంపారు. కాని అతని కచ్చట కాళీమాత దర్శనము కాలేదని తిరిగి వచ్చి మొరపెట్టుకొనెను. అప్పుడు శ్రీ దాదాగారు తీవ్రస్వరంతో, "ఓ ముండా! నీవీ భక్తునికేల దర్శన మీయవు?" అని గద్దించి పల్కారు. తక్షణమే ఆకాళీ భక్తునకు కాళికామాత దర్శనమైంది. శ్రీ దాదాగారి దయవల్ల అనేక సంవత్సరములుగా తాను చేసిన సాధనలన్నీ నాడు ఫలించెనని ఆభక్తుడు ఎంతో హృదయపూర్వకమైన భక్తి ప్రేమలతో శ్రీ దాదాగారి పాదములపై శిరస్సు నుంచి నమస్కరించాడు.

సిరిసిరి సింధూర్ అను గ్రామంలో ఒక పుట్టంధుడైన బాలకునికి దృష్టి నిమ్మని అతని తల్లిదండ్రులు శ్రీ దాదాగారి పాదములపైబడి శరణువేడారు. స్పర్శించినంత మాత్రాన మరుక్షణములో ఆ బిడ్డకు దృష్టిరావడంతో అచ్చట చేరిన భక్తులందరూ శ్రీ దాదాగారి శక్తిసామర్థ్యములకు ఆశ్చర్యానందములతో జేజేలు చెప్పారు.

బొంబాయి నుండి తన దర్శనార్థమొచ్చియున్న ఒకషావుకారుతో శ్రీ దాదాగారు "నీయింటికి నిప్పంటుకున్నది, నీవు వెంటనే ఇంటికి వెళ్ళు' ' అని ఆజ్ఞాపించారు. అతడు వెంటనే బయలుదేరి స్వగృహానికి చేరాడు. వారి ఇల్లు ప్రమాదానికి గురి అయ్యెననియు, అయితె ఎంతో చిత్రంగా సాయిఖేడా నుండి ఒక పెద్ద గాలివచ్చినదనియు, ఆ గాలికి మంటలు ఇంకా పెద్దగా ప్రజ్వరిల్లుతాయని అందరూ భీతిల్లారు. కానీ మంటలు నీరు చల్లినప్పుడు ఆరిపోయినట్లు ఆరిపోవడ మొకగొప్ప అద్భుతమనీ అందరూ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు. ఈ సృష్టంతా తానేయైన సద్గురువుల ఆజ్ఞలకు తిరుగేమున్నది.

## అమోఘమైన ఆశీస్సులు

ఒకరోజు శ్రీ దాదాగారు ఖాంజుడేతో "నీకు నేను 5,9,10 తరగతి చదువు చెప్పనా?" అని అడిగారు. "మీదయ ఎలావుంటే అలాగే బోధించండి." అని ఖాంజుడే విన్నవించుకొన్నాడు. అతడప్పుడు తొమ్మిదవ తరగతి పరీక్ష తప్పి వున్నాడు. గనుక మరుసటి సంత్సరమతడు తొమ్మిది, పది తరగతులు రెండు పరీక్షలకు ఒకేసారి కూర్చోగా రెండు పరీక్షలు తప్పినట్లు ప్రకటించబడ్డాయి. అతనికి ఒక్కొక్క పాఠ్యాంశము ఒక్కొక్క ఉపాధ్యాయుడు బోధించేవారు. వారు పరీక్ష ఫలితాలు ప్రకటించడానికై ఒకరి తర్వాత ఒకరు తరగతి గదిలోనికి వచ్చి మొదట ఖాంజుడే పేరు చెప్పి "మా సబ్జక్టులో మేము నిన్ను ఉత్తీర్ణుని చేసెదమని అందరూ చెప్పి వెళ్ళారు. చివరగా ప్రధానోపాధ్యాయుడు వచ్చి, "ఖాంజుడే! నీకు నేను పదవ తరగతి సర్టిఫికేటు యిస్తాను. దానితో నీకు ఉద్యోగము లభిస్తుందని హామీ యిచ్చాడు. అంతమంది ఆంగ్లేయ ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా తప్పిపోయినా ఖాంజుడేగారిని పాస్‌చేయడమంటే అది శ్రీ దాదాగారి ఆశీర్వాద బలంగాక మరేముంటుంది? వారి వాక్కు దివ్యమైన వేదవాక్కుగదా! అదెలా వ్యర్థ మవుతుంది?

షేగాంనివాసి "శ్రీ గజానన్ మహరాజ్‌గారు" దిగంబర యోగులు వీరు శ్రీ దాదాగారికి సమకాలికులు. శ్రీ గజానన మహరాజ్ గారు విఠల్ భక్తుడైన ఒక కీర్తనకారుని శ్రీ దాదాగారి దర్శనార్థము పంపారు! శ్రీ దాదాగారు కోపముగా వుండడం చూచి కీర్తనకారుడు దూరముగా నిలబడ్డాడు. అప్పుడు శ్రీ దాదాగారు ఒక ఐదు సంత్సరముల బిడ్డకు లడ్డు నిచ్చెదనని ఆశచెప్పి, దగ్గరకు పిలచి చెవిపట్టుకొని పదిగుంజిళ్ళు పెట్టించారు. ఆ సమయంలో కీర్తనకారునకు చిన్నపిల్లవానిలో సాక్షాత్ పండరివిఠలుని దర్శనమైంది. తర్వాతదాదాగారాపిల్లవానికొకలడ్డునిచ్చి పంపారు.

ఇదేవిధంగా భాస్కరానంద్ గారికి ఒకనాటి రాత్రి సమయంలో ఒక వళ్ళెములో సూర్య భగవానుని దివ్యదర్శన మిప్పించారు. సూర్యోపాసకుడైన భాస్కరానంద్‌గారు ఆనందపారవశ్యంలో శ్రీ దాదాగారి పాదపద్మాలకు సాష్టాంగ పడ్డారు.



హృషీకేశ్ నివాసి స్వామి అద్వైతా నందగారిని భాస్కరా నంద్ ఒకప్పుడు దర్శించాడు. శెలవు తీసుకొను నపుడు ఒక సంవత్సరము తర్వాత మరలా మిమ్ము కలుస్తానని స్వామి అభయ మిచ్చారు. సరిగ్గా ఒక సంవత్సరం తరువాత ఒకరోజు శ్రీ దాదాగారు భాస్కరానంద్ గారి ఒడిలో కూర్చొని వున్నారు. అప్పుడాయన "భాస్కర్ అటుచూడు! అద్వైతానంద్ దర్శనము చేసుకో" అన్నారు. కొద్ది దూరంలో నిజముగానే వారికా దర్శనమైంది. మరుక్షణంలో అద్వైతానంద్ గారి స్థానంలో శ్రీ దాదాగారు నవ్వుతూ నిలబడి యున్నారు. అదే సమయంలో భాస్కర్ గారి ఒడిలో కూడా కూర్చొని వున్నారు. ఈ విధంగా ఒకే సారి రెండు రూపాలలో దర్శన మిచ్చివారిని ధన్యమొనర్చిన మహనీయుడు. శ్రీ దాదాగారు ఈ లీలద్వారా మహాత్ముల శరీరాలు వేరైన వారంతా అంతరంగికంగా ఐక్యత కల్గి వుంటారనే సత్యం విదిత మౌతుంది. కనుకనే అద్వైతానంద్ గారిచ్చిన అభయాన్ని శ్రీ దాదాగారు నెరవేర్చారు.

## సకల సాధు స్వరూపి

సద్గురువెప్పుడూ తన శిష్యుడు తనకంటే గొప్పవాడు కావాలనే కోరుకుంటాడు. అలారూపొందేందుకు అవసరమైన సర్వస్వశరణాగతి - అనన్య ప్రేమ (గురువు యందు) విశ్వాసము శిష్యునిలో తగు స్థాయిలో వుండాలని కోరుకుంటారు. ఈ సద్గుణాలు సచ్ఛిష్యునిలో వృద్ధి చెందేందుకు అవసరమైన సహాయమంతా తన దివ్యలీలల ద్వారా నిరంతరం సమకూరుస్తూనే వుంటారు. ఆ ప్రేమమూర్తి యొక్క సహాయాన్ని ఉపయోగించుకొని పట్టుదలగా సాధన చేస్తూ, సద్గురుని బోధలనాచరిస్తుండేవారికి ఇక తన గమ్యాన్నిగూర్చి ఎలాంటి చింత, ఆందోళన అవసరంలేదు. కారణం, సర్వ సమర్థుడైన సద్గురువు అహర్నిశలు మనలను వెన్నంటి రక్షిస్తుంటారు గదా !

ఒకరోజు మదన్‌మోహన్‌గారు ఫాదర్‌నుండి చిచోలికి ఎద్దుబండిలో పోతున్నారు. మార్గమధ్యములోని మలాజ్‌పూర్‌లో రాత్రి మజిలీచేశారు. తన నౌకరు మరియు ఇతరబండ్లవాళ్ళు ఆగ్రామములోని మహనీయుడైన

గురుసాహెబ్‌గారి దర్శనార్థం వెళ్ళారు. కానీ మదనమోహన్‌గారు వెళ్ళకుండా బండిలో కూర్చొని, "నాకు గురుసాహెబ్‌తో పనియేమి ? నాసర్వస్వము సద్గురుడైన శ్రీ దాదాగారే"నని అనుకుంటున్నారు. అప్పుడాయనకు పరమ కారుణ్యమూర్తియైన శ్రీదాదాగారి స్పష్టమైన అశరీరవాణి "మేమే గురుసాహెబ్:" అని స్పష్టంగా వినిపించింది. వెంటనే మదన మోహన్‌గారు ఎంతో శ్రద్ధాభక్తులతో ఆనందపారవశ్యంతో గురుసాహెబ్‌గారిని దర్శించి ఆనందించారు. నిరంతరము తన మనోభావాలనుగూడా గుర్తిస్తూ తనకు సరైన సలహాయిచ్చి నడిపించే సద్గురు కృపకు హృదయ పూర్వకమైన ప్రేమతో మనసులోనే అంజలి ఘటించాడు.

అందుకే ఆధ్యాత్మిక మార్గంలో సద్గురువుకు సంపూర్ణ శరణాగతిచేసి వారిఆజ్ఞానుసారం ధర్మబద్ధంగా జీవించే సచ్ఛిష్యునకు ఇహపరాలగురించి యోచనే అవసరంలేదని, అవసరమైనదంతా సద్గురుడే సమకూర్చి మనలను గమ్యం చేరుస్తారని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. దాన్నే శిరిడీసాయి సద్గురువుకు పగ్గాలప్పగించిన తర్వాత చింతకు తావులేదంటారు. శరణాగతి చేసిన మాట సత్యమైతే సుఖదుఃఖాలను సమభావంతో గురుప్రసాదంగా స్వీకరించే పరిణతికూడా సద్గురుడే ప్రసాదిస్తారు. అలాంటి పరిణతి కల్గలేదంటే శరణాగతి సంపూర్ణంగా జరగలేదనే గుర్తించాలి.

కొందరు పండరిభక్తులు షేగాం నివాసియగు శ్రీ గజాననమహరాజ్‌గారి సన్నిదిలో సంకీర్తనచేయసాగారు. మహరాజ్‌గారు అభజన బృందనాయకుని చేతికి తాంబూలమిచ్చి, దానిని తన భక్తిపూర్వక కానుకగా శ్రీదాదాగారికి సమర్పించమని చెప్పారు. అబృంధము సాయిఖేడాచేరి, శ్రీదాదాగారి సన్నిధిలో భక్తిప్రపత్తులతో చాలా ప్రొద్దుపోయేదాకా భజనచేశారు. ఆభజనబృంధము పండరిపోవుచున్నదని తెలుసుకున్న శ్రీదాదాగారు వారిని వెనుకకు తిరిగి చూడమని చెప్పారు. కొంతసేపు వారికచ్చట పండరి విఠలుని విగ్రహముతో సహా విఠల్ మందిరదర్శనమైనది. ఆ భావపారవస్యంలో వారు శ్రీదాదాగారి పాదధూళి స్వీకరించి అరాత్రంతా నృత్యగానాలతో మైమరచి ఆనందించారు. ఆ



భక్త బృందమువారు శ్రీ గజాననమహరాజుగారు పంపిన తాంబూలము శ్రీదాదాగారికివ్వటం పూర్తిగా మరచిపోయారు. అప్పుడు శ్రీదాదాగారు నా వస్తువునుకూడా మీరు జీర్ణము చేసుకొనుచున్నారు" అనివారికి గుర్తుచేసి ఆ తాంబూలమును స్వీకరించారు. పైలీలద్వారా సద్గురు కృపవల్ల సకలదేవతలు ప్రసన్నులౌతారని అట్టి సద్గురుని శ్రద్ధాభక్తులతో సేవించి వారికృప పొందాలని శ్రీదాదాగారు బోధించారన్నమాట. ప్రేమతో సమర్పించబడిన శ్రీ గజాననమహరాజ్‌గారి తాంబూలమెంత స్వల్పమైనదైననూ, వాడిపోయినదైననూ శ్రీదాదాగారు దానినెంతో ప్రీతితో అడిగి పుచ్చుకోవడం మనం గమనింపవలసియున్నది. ధనగర్వంతో తెచ్చిన బొంబేవర్తకుని ఖరీదైన శాల్వను శ్రీదాదాగారు ధునికాహుతిచేసిన విషయం ఇచ్చట గుర్తించుకోవాలి.

నీలకంఠరావు, మునీర్ మొదలైన మిత్రులు శ్రీదాదాగారిని దర్శించి మాటల సందర్భములో "శ్రీ తాజుద్దీన్ బాబాగారు (నాగపూర్) మహాసమాది చెందారు. వారిప్పుడు పరదాచాటున్నారు" అనిపలికారు. అదివిని శ్రీదాదాగారు "వారు మరణించలేదు, మనమే మరణించాము. ఆరేగుచెట్టుక్రిందకు వెళ్ళిచూడండి మీకు శ్రీ తాజుద్దీన్‌బాబాగారు దర్శనమిస్తారు"అనిచెప్పారు. వారంతా ఆచెట్టుక్రిందకు వెళ్ళగానే కొద్దినిమిషాలసేపు నాగపూర్‌నివాసి శ్రీ తాజుద్దీన్‌బాబాగారు దర్శనమిచ్చారు. శ్రీదాదాగారికి, శ్రీతాజుద్దీన్‌బాబాగారికి భేదంలేదని భక్తులందరూ గుర్తించి మహదానందం పొందారు.

పై మాటలలో శ్రీదాదాగారు "వారుమరణించలేదు మనమే మరణించాము" అనిచెప్పిన మాటల అర్థం వివరించుకోవాలి. ఆత్మకు చావులేదు. నిత్యమైనది, ఆనందమైనది, శాశ్వతమైనది, అంతా తానేయైనది ఆత్మ ఈ సత్యాన్ని అనుభవించేవారే మహాత్ములు. మనలోకూడా అలాంటి ఆత్మే ఉన్నప్పటికి రాగము, ద్వేషము, అసూయ, అహంకారం, బలం, దర్పం మొదలైన ఎన్నో దుర్గుణాలతో తయారైన పేడ గంపను ఆ ఆత్మఅనే జ్యోతిపై బోర్లించి అజ్ఞానం అనే అంధకారంలో అనుక్షణమూ

మరణానికి దగ్గరౌతూ, అనుక్షణం మరణిస్తూనే ఉన్నాము, కానీ మహనీయులు కోరినప్పుడు కోరినచోట శరీరంతో కన్పించగలరు. గనుక వారికి మరణమెక్కడిది. వారు సాధించిన ఆదివ్యస్థితినే ఆచార్య శ్రీ భరద్వాజగారు "మృత్యువుపై సాధించిన ఘనవిజయం అంటారు. గనుక వారివలె మనంకూడా నిత్యజీవనం చేయాలంటే సద్గురుసేవ ద్వారా సాదనద్వారా ఆపేడగంపను ద్వంసమొనర్చడమే మార్గమని పై మాటలలో సూచిస్తున్నారు.

## ప్రాణదానం

సద్గురువులలో సర్వసమర్ధ సద్గురువుల స్థితి చాలా విలక్షణంగా ఉంటుంది. ఇలాంటి సద్గురువులనే దత్తావతారాలని పిలిచారు. ఈ మహనీయులు అనంతమైన దైవశక్తితో పాటు ఆదైవం యొక్క దివ్యప్రేమను భక్తులకు రుచిచూపించి దైవంఎడల వారివిశ్వాసాన్ని పతిష్టంచేస్తారు. పూర్వకర్మాను సారం ఏర్పడిన దైవ నిర్ణయాన్ని (బ్రహ్మవ్రాతను) కూడా మార్చగల సమర్ధులని నిరూపించడంలో ఆ మహనీయులు వారికివారే సాటి, "చచ్చి బూడిదైనా రమ్మంటే వచ్చేదే గదయ్యా అని సెలవిచ్చిన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారిమాటలు ఈ కలియుగంలోకూడ ఎలాఅక్షరాల నిజమయ్యాయో వారి చరిత్రలో చూడవచ్చు.

మృతజీవులను సజీవులుగా చేయడంలో శ్రీదాదాగారి దివ్యలీలలు నభూతో నభవిష్యతిగా కనిపిస్తున్నాయి. ఇంతమంది మృతిచెందినవారు వారి కృపతో పునర్జీవితులైన చరిత్ర మరే మహనీయుని చరిత్రలోను చూడబోము. అంతేగాక చనిపోయిన పక్షులు, పాములు ఎన్నోతెచ్చి. చిన్నపిల్లలు శ్రీదాదాగారిపైనవేయడం వారిదివ్యస్పర్శ తగలగానే అవి తిరిగి బ్రతికి వెళ్ళడం అనేది కన్నులారగాంచిన ఆనాటి భక్తుల జన్మలు ధన్యముకదా ! సృష్టిలో సద్గురువుల ఆజ్ఞకు తిరుగేలేదని వీరు తమ దివ్యలీలల ద్వారా నిరూపించి మానవులకు దైవశక్తి ఎడల భక్తివిశ్వాసాలు



కలిగించారు. సైన్సు, వైద్య శాస్త్రమేనమ్ముతామనే మూఢుల అంధత్వాన్ని పారద్రోలారు. ఈవిధంగా ప్రభావితులైన భక్తులు హృదయపూర్వకమైన ప్రీతితో ధర్మాచరణ చేస్తారు. అలా ఆచరించబడిన సద్ధర్మాచరణమే భక్తులకు దుఃఖరాహిత్యస్థితి ప్రసాదిస్తుందని సర్వశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. గనుక మనలను ధర్మాచరణకు ప్రేరేపించడమే ఈ మహత్తర లీలల ధ్యేయమని గుర్తించి మన ఆచరణను మలచుకొని తరింతుముగాక. పూజ్యపాదులు ఆచార్య శ్రీ భరద్వాజగారు చెపుతారు "శ్రీ సద్గురుడు మనకెన్ని సంకటములు తీర్చినా మనలో నైతిక మార్పు రానప్పుడు మనమెందుకిప్పుడు వానికి మరలా ఈ భాధతీర్చాలి. పారాయణ చేస్తుంటే శ్రీ సాయినాధులేవానిలో ఆపరివర్తన క్రమంగా తీసుకవస్తారు' ' అంటారు. గనుక మహాత్ములకు మన సంకటములు బాపడమొక్కటే ధ్యేయంకాదు. మనలో నైతిక పరివర్తన తేవడమే ఆ దివ్యలీలల ధ్యేయమని మనం గుర్తించాలి.

గొడ్డు బోతు ఆవుపాలు ఇచ్చేట్లు చేయడం, వంధ్యకు సంతాన మివ్వడం. ఉప్పునీటి బావులను మంచినీటి బావులుగా మార్చడం, బొత్తిగా జలంలేనందున ఎండిపోయిన బావులను నీటితో నింపడం, కఠినశిలామయమై త్రవ్వుటకు అలివిగాని బావులోని రాతిని మెత్తబరచి గడ్డపారతో తెగేటట్లు చేయడం వంటి దివ్యలీలలు సిద్ధపురుషుల చరిత్రలో చాలా స్వల్పమైనవి.

ఉజ్జయినిలోని హనుమాన్ తోటలోని ఒక బావిలో ఊటలేక ఎండిపోయింది. ఆప్రాంత ప్రజలు తమ బాధను శ్రీ దాదాగారికి విన్నవించారు. పరమ దయానిధియైన శ్రీ దాదాగారు ఒక రొట్టెముక్కను ఆ బావిలో వేయగానే ఆ బావి తిరుగులేని మంచినీటితో నిండిపోయింది. అచ్చటి ప్రజలందరూ ఆశ్చర్యానందాలతో శ్రీ దాదాజీ గారికి జే జేలు చెప్పారు.

హోషంగాబాద్ నివాసులైన పండిత రామక్రిష్ణ దంపతులు చాలాకాలంగా భక్తి శ్రద్ధలతో శ్రీ దాదాగారిని సేవించేవారు. ఒక రోజు రామకృష్ణ భార్య చనిపోయింది. ఆ దుఃఖాన్ని భరించలేక రామక్రిష్ణ ఆ

శవాన్ని వదలి శ్రీ దాదాగారి సన్నిధికి వచ్చి దుఃఖించసాగారు. శ్రీ దాదాగారు ఆ విషయం విని "చనిపోతే చనిపోయింది ఈ రొట్టె ముక్క ఆమెకు తినిపించు" అని అతనికి కొంచెం రొట్టె ఇచ్చారు. రామకృష్ణగారు అతికష్టం మీద ఆమె దంతములు తెరచి కొంచెం రొట్టెముక్కను ఆమె నోటిలో కుక్కాడు. మరుక్షణమే ఆమె గాఢనిద్రనుండి లేచినదానివలె పునర్ జీవితురాలైనది. ఆనందాశ్రువులతో ఆదంపతులు శ్రీ దాదాగారి పాదాలకు ప్రణమిల్లారు. ఆమె ఎనభైనాలుగు సంవత్సరముల వయస్సు వరకు జీవించింది. ఇటీవలే పరమపదించింది.

జి.యస్ శుక్లాగారి మిత్రునకు మతిస్థిమితం తప్పి భయంకరమైన పిచ్చివాడుగా తయారయ్యాడు. ఎన్నో రకాల మందులు వైద్యాలు విఫలమైనాయి. అనేక మంది సాధుసత్పురుషులను దర్శించినా నయంకాలేదు. శుక్లాగారు తన మిత్రుని చేతులకు బేడీలువేసి, ఇనుపగొలుసులతో బంధించి శ్రీ దాదాగారి వద్దకతనిని తీసుకవచ్చారు. శ్రీ దాదాగారు పిచ్చివానిని తనయోగదండంతో ఒకదెబ్బకొట్టారు. మరుక్షణంలో అతడు స్వస్థుడై జీవితాంతం శ్రీ దాదాగారి భక్తుడయ్యాడు.

జగన్నాథ పురం రథయాత్రకు వచ్చిన ఒకబర్మాదేశపు డాక్టరునకు ధ్యానములో ఒక మహాత్ముడు దర్శనమిచ్చి "నీవు సాయిభేడా వెళ్ళమని' ఆదేశించారు. అతడు సాయిభేడాకు వెళ్ళి శ్రీ దాదాగారిని దర్శించి తనకు జగన్నాథపురములో ధ్యానములో దర్శనమిచ్చిన మహాత్ముడు శ్రీ దాదాగారేనని గుర్తించాడు. వెంటనే శ్రీ దాదాగారు నవ్వి "నీవెచ్చటికి పోగలవు. నీ ఇల్లుఇదే'' అన్నారు. ఆమధుర వాక్కులకు బావోద్రేకముపొందిన డాక్టరుగారు శ్రీ దాదాగారి పాదములపై బడ్డాడు. చాలా రోజుల తర్వాత బర్మా వెళ్ళేందుకు అనుమతి కోరినపుడు శ్రీ దాదాగారు "అది ఎవరి రాజ్యమురా?" అని ప్రశ్నించారు. అది ఆంగ్లేయుల రాజ్యమని అతడు చెప్పాడు, కాని శ్రీ దాదా గారన్నారు "అదికూడా మనరాజ్యమేరాః దాదాగారి రాజ్యములో నీకు ఆరునెలలు శలవులభిస్తుంది" అని చెప్పారు. ఆరునెలల తర్వాత డాక్టరుగారు బర్మావెళ్ళి జీవితాంతము అప్పుడప్పుడు ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి శ్రీ దాదాగారి దర్శనార్థం వచ్చేవారు.



మురళీధర్ అనే వారు చాలాకాలం క్షయవ్యాధితో బాధపడి వైద్యాలన్నీ విఫలమై శ్రీ దాదాగారిని ఆశ్రయించాడు. కరుణామయుడైన శ్రీదాదాగారి కృపవలన త్వరలోనే ఆరోగ్యవంతుడయ్యాడు. అతని గురుభక్తి నిష్ఠ, సబూరీలు వర్ణించనలవికానివి. శ్రీ దాదాగారి నుండి భరించరాని దెబ్బలను గూడ ఆనందంతో ఆశీస్సులుగా స్వీకరించేవాడు. ఒకసారి అలా కొట్టినప్పుడు అతనితలపై పెద్దగాయమై చాలా రక్తంపోయింది. జిజీభాయి అను ఆమె వచ్చి శ్రీ దాదాగారిని ఆపి అడ్డంతీసింది. స్పృహ తప్పి పడియున్న మురళీధరుని శ్రీ దాదాగారు ఒకరూములో ఏడురోజులు అన్నపానీయాలుకూడా లేకుండా బంధించారు. అతనిగాయానికి చీము పురుగులు పట్టి దుర్వాసన వెడలసాగింది. ఎనిమిదవనాడు మురళీధరుని దేహాన్ని బయటకు పట్టించి అతని గాయములోని పురుగులను చిదిమివేశారు. చూస్తుండగనే మురళీధురుని గాయము మటుమాయమై మురళీధరుడు సజీవంగా సంతోషంగా తిరుగుతున్నారు. అందుకే వీరిని సర్వ సమర్థులని భక్తులు పిలుచుకున్నారు.

ఈ దివ్యానుభవాన్ని పొందాక మురళీధర్ ఎంతఘాఢమైన ప్రేమానురాగాలతో శ్రీ దాదాగారిని తన హృదయ సీమలో నిరంతరం బంధించి భజించారో వ్రాయలేము. ఆనందపారవశ్యంలో శ్రీ దాదాగారు ఒక్కొక్కప్పుడు తన స్వహస్తాలతో మురళీధరునకు అన్నం తినిపించేవారు. సద్గురుని పట్ల మన కట్టిప్రేమ వృద్ధి చెందాలనే సంకల్పంతోనే వారట్టి దివ్యలీలలను వర్షింపజేస్తారు. మామిడిపూత, పిందెలే అవుతామో పండ్లే అవుతామో అది మనకే వదిలేస్తారు.

భక్తి విశ్వాసాలను వృద్ధిచేయడానికి మహనీయులు తమ భక్తుల లలాట లిఖితమైన ప్రారబ్ధాన్ని మాత్రమేగాక వారి ఆయుర్దాయము కూడా మార్చడం, వారి జాతకంలో సంతానమే లేనివారికి సంతానమివ్వడంలాంటి లీలలు పూజ్యశ్రీ భరద్వాజ మాష్టరుగారు వ్రాసిన గురుచరిత్రలోను, సాయిలీలామృతం, అవధూత లీల మొదలైన గ్రంథాలలో చూస్తాము. అయితే అలాంటి అద్భుత కృపపొందాలంటే తగుస్థాయిలో సద్గురుని పట్ల ప్రేమ విశ్వాసమూ ఉండితీరాలి. అలాంటి

సద్గుణాలు సాధించడమే సాధన. నిత్యపూజ పారాయణ నామజపం, మహనీయుల సూక్తుల ఆచరణను మనం ఏమేరకు చేస్తే ఆమేరకు గురుకృపకు మనలను అర్హులను జేయు ఆసద్గుణాలుమనలో వృద్ధిచెందుతుంటాయి. గనుకనే శ్రీ భరద్వాజ మాష్టరు గారుగాని శ్రీ సాయిగాని, ఇతర మహాత్ములుగాని పైనిత్యకృత్యాలు నియమంగా హృదయపూర్వకంగా అర్ధవంతంగా చేయమని ప్రతివారిని ప్రోత్సహించేవారు. అంతేగాక సన్నిహిత భక్తులు తమ సహజమైన సోమరితనంవలన ఎప్పుడైనా ఆనిత్యకృత్యాలు ఏమారినట్లయితే వాచామందలించడం ద్వారానో, ఆప్యాయంగా పలకరించకుండా ఉండడం ద్వారానో మందలించేవారు. శ్రీ దాదాగారు విశ్వాసులగు అట్టి భక్తులను యముని బారినుండి రక్షించిన ఉదాహరణలు చూద్దాము.

ఒకప్పుడు శ్రీ వినోద మిశ్రాగారు దీక్షపూని శ్రీ దాదాగారి పాదుకలను తీసుకొని భక్తబృందముతో పాదచారియై ఖాండ్వా వెళుతున్నారు. హర్దా-హరసూద్‌ల మధ్య అరణ్యములో పోతుండగా మిశ్రాగారిని నాగుపాము కాటువేసింది. వారి మిత్రుడు జోషీగారు కాలుకు గుడ్డ చుట్టి ఒకగ్లాసు వేడి నెయ్యిత్రాగించి పడుకోబెట్టారు. భక్తులు జట్లుజట్లుగా శ్రీ దాదాగారి నామసంకీర్తన చేస్తూ రాత్రంతా జాగరణ చేస్తున్నారు. ఇరవైనిమిషాలపాటు ఆ భక్తబృందానికొక అలౌకిక కాంతి రూపంగా శ్రీ దాదాగారు దర్శన మిచ్చారు. అదే సమయంలో చెట్టు క్రింద ఆ నాగుపాము నామసంకీర్తనలోని లయకనుగుణంగా పడగవిప్పి ఆడుతూవుంది. శ్రీ దాదాగారి కృపవలన ఆవేళ జిల్లా కలెక్టరు మరియు ఒక డాక్టరు ఆ అరణ్యములోని వారి వద్దకు కారులోవచ్చారు. ఆ డాక్టరుగారు మిశ్రాగారిని మరల కారులో వైద్యశాలకు తీసుకవెళ్ళి ఇంజక్షను చేసి వారికి స్వస్థత చేకూరాక కారులో తీసుకవచ్చి అరణ్యములోని వారిమిత్రులవద్ద వదలివెళ్ళారు. ఆకారు ప్రయాణంలో ఒకపక్షి కారుకు తగిలి మరణించింది. మిశ్రాగారి ప్రాణం రక్షించేందుకు శ్రీ దాదాగారు ఆ ప్రాణం యమునికిచ్చారని తెలుస్తుంది. చిత్రమేమంటే నాగుపాము రాత్రంతా



వారితోటి జాగరణచేస్తూ అక్కడే వారితో ఉండి తెల్లవారి మిశ్రాగారు తిరిగి ప్రయాణమైనప్పుడు శ్రీ దాదాగారి చిత్రపటానికి పాదుకలకు ప్రదక్షిణంచేసి అడవిలోకి పారిపోయింది. శ్రీ బడేదాదాగారు శ్రీ చోటేదాదాగారు మారువేషంలో డాక్టరు, కలెక్టరుగా వచ్చారేగాని లేకుంటే అర్ధరాత్రి వాళ్ళు అరణ్యానికి రావడమేమిటి. శ్రీ షిరిడిసాయి చరిత్రలో మైనతాయి కొరకు వారి పిలుపుతో నిమిత్తం లేకుండానే శ్రీ సాయి బండి, ఎద్దు, బండివాని రూపంధరించి రావడం చూచాము. ఇక్కడ శ్రీదాదాగారు మనిషి రూపమే గాక కారు వేషం కూడా దాల్చడం చూస్తున్నాము. అందుకేవారు సర్వసమర్థులని భక్తులు పిలుస్తున్నారు.

ఆశలొదిలిన రోగగ్రస్తుల రోగాలను నిషిద్ధ పదార్థాలతో నయంచేయడం, చనిపోయిన వారిని బ్రతికించడం అవధూతలందరి సాంప్రదాయం.

జి.యస్. శుక్లాగారు హోషంగాబాద్‌లో డెప్యూటీ కలెక్టరుగా రిటైర్ అయ్యారు. వీరి మేనల్లుని భార్య సుఖరోగాలతో బాధపడుతూ అస్థిపంజరంగా తయారైంది. ఇంగ్లీషు వైద్యాలు నాటు వైద్యాలు అన్నీ విఫల మయ్యాయి. చివరిప్రయత్నంగా ఆమెను శ్రీ దాదాగారి సన్నిధికి తీసుకొచ్చారు. ఆమెను ధునిలో పడుకోబెట్టమని శ్రీదాదాగారాజ్ఞాపించారు. ధునిలోని విభూతిలో పడుకోబెట్టి ఆమె శరీరమంతా ఆపవిత్ర ఊధిపూశారు. కొద్దిరోజులలోనే ఆమెకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరింది.

ఖంజన్‌పూర్‌లో శ్రీ దాదాగారి కుటీరం వెనుక శివరతన్ అనే కమ్మరి నివసించేవాడు. గత పదిహేను సంవత్సరములనుండి అతనికి పిచ్చి పట్టి ఉంది. ఒకరోజతడు పిచ్చి చెలరేగి ఐదు సంవత్సరముల వయసుగల తన బిడ్డను బావిలో పడేశాడు. బావిదగ్గరున్న స్త్రీలందరూ నిస్సహాయంగా చూస్తూ హాహాకారాలు చేస్తున్నారే తప్పమరేమీ చేయలేకున్నారు. ఆశ్చర్యకరంగా ఆబిడ్డ నీటిమీద తేలేపుష్పం వలె నీటిలో మునిగిపోకుండా తేలుతుంది. కొద్ది క్షణాల తర్వాత ఆకమ్మరికి స్పృహ వచ్చి బావిలోకి దిగి

తన బిడ్డను బయటకు తెచ్చుకున్నాడు. ఈ వింత చూచిన జనులంతా అదికేవలం దాదాగారి కృపమాత్రమేనని శ్రీ దాదాగారిని కీర్తించి స్తుతించారు.

తన దర్బారులో కూర్చొనియున్న ఒక నాగపూరు భక్తుని అతనిచోటు మార్చి మరొకచోట కూర్చోమని శ్రీ దాదాగారు ఆజ్ఞాపించారు. అతడలా చేసిన తర్వాత కొద్ది నిమిషాలకు అతడు ఖాళీచేసిన స్థానంలో ఒక పెద్ద నాగుబాము వచ్చి చుట్టవేసుకొని కూర్చుంది. శ్రీ దాదాగారు సర్పమును ఆనాగపూరు భక్తునకు చూపుతూ "ఇదే నీపాలిటి మృత్యుదేవత" అని పలికారు. ఆభక్తుడు ముచ్చెమటలు పట్టి నిలువెల్ల కంపించిపోయాడు. ఆ దివ్యసన్నిధిలో మూడునిద్రలు చేసి చివరకు శ్రీ దాదాగారి అనుమతితో నూతన జీవితంతో శ్రీ దాదాగారి పట్ల హృదయపూర్వకమైన ప్రేమతో స్వగృహంచేరి నిత్యం శ్రీ దాదాగారిని పూజించి తరించారు. ఈ లీలనే శ్రీ దాదాగారు మరొకవిధంగా అనుగ్రహించినట్లయితే ఈ భక్తునిలో అంత గొప్పగా భక్తి విశ్వాసాలు వృద్ధిచెంది యుండేవి కావు. శ్రీ దాదాగారు తనయోగశక్తితో ఆ త్రాచుపామునే స్థలమునకు రాకుండానే చేశారనుకొందాము. అప్పుడతనికి శ్రీ దాదాగారు తనను ప్రాణగండము నుండి రక్షించిన విషయమే తెలియదుగదా. భక్తరక్షణలోని ముఖ్యమైన ఆంతర్యము భక్తుల ఆపదలు తీర్చడం కంటే వారిలో భక్తి ప్రేమ విశ్వాసాలు వృద్ధినొందించడమే సద్గురువుల తపన. అంతేగానీ పై సద్గుణములు పెంపొందింపజేసుకునే బదులు పూలమాలలు టెంకాయల సమర్పణ వరకే మన భక్తి పరిమితమైతే ఆమహనీయుల కృప అడవిన గాచిన వెన్నెలతో సమానమే అవుతుంది.

నూటికి తొంభైమందికి భక్తి అంటే ఏమని శాస్త్రాలు చెబుతున్నాయో తెలియక కాయ, కర్పూరం, పూలు సమర్పించడం కాషాయాంబరములు, రుద్రాక్షలే భక్తి అని భ్రమించి, ప్రవర్తనలో సత్యం, ధర్మం, సేవాభావం, అన్ని జీవులలో గలదేవుని నొప్పించకుండా జీవిత యాత్ర గడపడమనేది ముఖ్యమని తెలుసుకోలేకున్నారు. భగవద్గీత పన్నెండవ అధ్యాయంలో పదమూడవ శ్లోకం మొదలు పంతొమ్మిదవ శ్లోకం వరకు భక్తుని



లక్షణాలు వర్ణించారు. ఆ లక్షణాలు పొంది జీవితయాత్ర సాగించాలిగాని బాహ్య పూజమాత్రంచేసి ఆచరణ, మానసిక పరివర్తన లేకపోవడం మిథ్యాచారమే అవుతుంది. గనుక ఫలితం సూన్యం. సర్వభూతములను ద్వేషించకుండుట, మైత్రి, కరుణ, మమకార రాహిత్యము, అహంకారము లేకుండుట, సుఖదుఃఖములలో సమభావము, నిత్య సంతుష్టి, ఆత్మతత్త్వమందు నిశ్చితాభిప్రాయము, దేవుని యందు అనన్యప్రీతి, శత్రుమిత్రులయందు, మానావ మానములయందు, శీతోష్ణాది ద్వంద్వములందు సమభావము, నిందాస్తుతులయందు సమభావము కల్గియుండుట మొదలైన గుణాలను సాధన ద్వారా సత్‌సంగము, శ్రవణమననాల ద్వారా వృద్ధి పొందించు కొనడమే భక్తిగాని పర్వదినాలని అలంకరణలు, అన్నదానాలు, ఉత్సవాల వరకే మనభక్త్యాచరణ పరిమితమవడం సద్గురువులకు బాధనే కల్గిస్తుంది. గనుక అలాంటి భక్తి లక్షణాలు మనం పెంపొందించుకునేయత్నం మాని పోటీలు, వంతులు కీచులాటలకు సత్ సంగాలు నిలయాలవడం ఎంతహాస్యాస్పదమో యోచించాలి.

ఒకసారి దీర్ఘవ్యాధి పీడితుడైన డెబ్బయి సంవత్సరాల వయోవృద్ధుడొకడు శ్రీ దాదాగారి కృపకొరకు వేచియున్నాడు. శ్రీ దాదాగారు అకస్మాత్తుగా లేచి ఆవృద్ధుని ఉన్నపళంగా లేవనెత్తి దూరంగా విసిరి పారేశారు. "ఇకనీకే వ్యాధి లేదు. ఇంటికి వెళ్ళు పెరుగన్నం తిను" అని ఆజ్ఞాపించారు. గత ముప్పైఆరు సంవత్సరాలుగా బాధించిన ఆవ్యాధి నాటితో మాయమైంది. ఈలాంటి విచిత్ర వైఖరుల ద్వారా రోగనివారణ చేయడం దత్తావధూతలందరి సాంప్రదాయమైయున్నది. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు ఒక మలేరియా జ్వరపీడితునకు పచ్చివేరుశనగ కాయలు తినబెట్టి, కంఠంలోతు తడి ఇసుకలో బూడ్చి పెట్టి ఒకగంట ఉంచి తీసుకురాగానే అతనిజ్వరం మాయమైంది.

సాయిభేడా గ్రామ పటేలుగారితో "ఫలానాచోట నీకు రెండు లంకెబిందెలు దొరుకుతాయి వాటిలో ఒకటి నీది గనుక నీవు తీసికెళ్ళు' అని ఆజ్ఞాపించారు శ్రీ దాదాగారు. దురాశాపరుడైన ఆపటేలు ఆరెండు

లంకెబిందెలను తన ఇంటికితీసుకవెళ్ళాడు. ఆనాటి రాత్రికే అతని కొమారుడు మరణించాడు. తెలివిగల ఆపటేలు వెంటనే శ్రీ దాదాగారి పాదములపైబడి తన బిడ్డమరణవార్త చెప్పి విలపించాడు. వెంటనే ఒకలంకె బిందెను యథాస్థానములో పూడ్చిపెట్టు లేకుంటే ఆబిందెకు బదులు నీబిడ్డను పూడ్చిపెట్టవలసి ఉంటుంది" అని ఆజ్ఞాపించారు. పటేలు శ్రీ దాదాగారి ఆజ్ఞను పాటించగానే అతని కొమారుడు బ్రతికాడు.

శ్రీ దాదాగారి దివ్యలీలలు అతి విచిత్రాలు. వాటిలో తన విరాట్ రూపమును అనేక సార్లు భక్తులకు దర్శింపజేయడం. సాయిఖేడాలో రోడ్డున పోతున్న రెండెడ్లబండి పై శ్రీ దాదాగారు ఆకస్మికముగా సాక్షాత్కరించారు. వెంటనే వారి శరీరం అనంతంగా పెరిగి ఆకాశమంటసాగింది. ఈ అద్భుతమును గాంచిన బండివాడు తనబండి విరిగి పోవునని లబలబలాడాడు. ఆవిచిత్ర రూపమును అనేకమార్లు తాను గస్తీ తిరుగుచున్నప్పుడు చూచిన పోలీసు ఆబండి వానికి ధైర్యము చెప్పి ఓదార్చాడు. కొద్ది నిముషాలతర్వాత విరాట్ రూపమే కాదు శ్రీ దాదాగారుకూడా బండిలోనుండి అదృశ్యమయ్యారు.

ఆత్మజ్ఞానుల దివ్యలీలలు అనిర్వచనీయాలు. ఆయాదేశకాల పరిస్థితిని బట్టి ఆప్రాంతమందున్న జనుల పరిపాకాన్ననుసరించి వారిని ధర్మ మార్గంలో జీవించేటట్లు చేయడానికే మహనీయులు వారిదివ్యలీలలు ప్రకటిస్తారు. భక్త రక్షణేగాక, ఆభక్తులు ధర్మాన్ని ఆచరించేటట్లు చేయడం అనే సంకల్పం ఆ లీలలలో యిమిడి ఉంటుంది. ఇలాంటి లీలలలో చనిపోయిన పాములను పక్షులను శ్రీ దాదాగారు ఎన్నోసార్లు వినోదంగా బ్రతికించడమొక గొప్ప దివ్యలీల. 1924వ సంIIలో బుర్హద్‌ఖాన్ అను నతడు ఏడు రోజుల నాడుచనిపోయి దుర్గంధముతో నిండిన కుక్కకళేబరాన్ని శ్రీ దాదాగారి చెంతకు తెచ్చాడు. వెంటనే శ్రీ దాదాగారాకుక్క కళేబరాన్ని ఒక కంబళిలో చుట్టి కొంతసేపుతన తొడక్రింద ఉంచుకొని బయటకుతీసి దానిని తన చేతికర్రతో ఒకదెబ్బకొట్టారు. మహాద్భుతంగా ఆ కుక్క నిద్రనుండి మేల్కొన్నట్లు పరుగెత్తి వెళ్ళసాగింది.



అవి స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా జరిగే రోజులు. ఇండోర్‌లోని ప్రఖ్యాత దంతవైద్యులు డాక్టర్ పాండేగారికి బానీలా హత్యా కేసులో సంబంధమున్నదని పోలీసుకేసు జరుగుతుంది. పాండే గారొకముస్లిం సిద్ధపురుషుని దర్శించినపుడు వారు "నీకొక పెద్ద ప్రాణాపాయకరమైన ఆపదరాబోవుచున్నది. ఈ ప్రపంచములో మిమ్ములను ఒక్కదునీవాలా దాదాగారు తప్ప మరెవ్వరూ రక్షింపలేరు" అని చెప్పారు. పాండేగారు వెంటనే వెళ్ళి శ్రీ దాదాగారిని శరణు జొచ్చారు. శ్రీ దాదాగారు వారి మెడకొక సుత్తినిగ్రేలాడ దీసి తిరిగిత్రెంచి వేశారు. మరేమీ చెప్పకుండా ఆశీర్వదించి పంపారు.

కొద్దిరోజుల తర్వాత అందరితో పాటు పాండే గారికి కూడ ఉరిశిక్ష విధించిజైలులో పెట్టారు. పాండేగారు తాను నిర్దోషినని మనస్సులోనే ఆర్తితో శ్రీ దాదాగారికి మొరపెట్టుకున్నారు. నాటి రాత్రి శ్రీ దాదాగారు వారికి స్వప్నదర్శనమిచ్చి "బిడ్డా! భయపడవద్దు నీవు తప్పక రక్షించబడతావు. ప్రతిరోజు రాత్రి మూడు గంటలకు నీకు నీయింటిని గూర్చి సమాచారం తెలుస్తుంది. అని చెప్పి అదృశ్యమయ్యారు. మరునాటి నుండి అదే విధంగావారి ఇంటినుండి సమాచారాలన్నీ స్వప్నదర్శనమయ్యేవి. మరుసటి ఉదయం నుండి జైలు అధికారులకు మాత్రం పాండేగారు పిచ్చివానివలె కనిపించసాగారు. జైలు అధికారులు బర్మానుంచి స్పెషలిస్టు డాక్టర్లను పిలిపించి పాండేగారిని పరీక్ష చేయించారు. వారు పరీక్షలన్నీ క్షుణ్ణంగా చేసి ఆయన నిస్సందేహంగా పిచ్చివాడని ఏకగ్రీవంగా రిపోర్టు వ్రాశారు. పాండే గారు మాత్రం కుయ్యోమొర్రో నాకు పిచ్చిలేదు పాడూలేదు. సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నాను. నాకు పరీక్షలెందుకంటాడు. కానీ బర్మా డాక్టర్లు రిపోర్టు మేరకు పాండేగారు పిచ్చివారని నిర్ణయించి వారికి ఉరిసిక్ష రద్దు చేసి విడుదలచేశారు.

ప్రాణ బిక్షపెట్టిన శ్రీ దాదాగారికి కృతజ్ఞతతో బడ్‌బాహాలో మందిరం నిర్మించి శ్రీ దాదాగారి పాదుకలందు ప్రతిష్టించి ప్రతినిత్యం పూజించసాగాడు. తరచు శ్రీ దాదాగార్ని ప్రత్యక్షంగా దర్శించి సేవిస్తూ తనవైద్యవృత్తి కొనసాగించి ధన్యులయ్యారు.

జబల్‌పూర్ వాస్తవ్యులు పండిత్ రామరతన్ గారి మనవడు నాలుగు సంత్సరాల వయసుగల బిడ్డ. అతనికి క్షయ వ్యాధి సంక్రమించింది. పేరు మోసిన డాక్టర్లందరి ప్రయత్నాలు విఫలమై అందరూ ఆశవదిలేశారు. అలాంటి విషమ పరిస్థితిలో ఒక భక్తుని సలహామేరకు వారాబిడ్డను సాయిభేడాకు తీసుకవచ్చారు. ఆ బిడ్డ మార్గమద్యంలో చనిపోయాడు. తల్లి దుఃఖానికి అవధులులేవు. అంతదూరంనుండి వచ్చినవారు తిరిగి వెనక్కు పోలేక ఆ బిడ్డను సాయిభేడాకు తీసుకవచ్చారు.

వారు వచ్చేసరికి శ్రీ దాదాజీగారు అనేక వేలమంది భక్తులచే పరివేష్టితులై ఉన్నారు. వీరు దూరంగా నిలబడి చనిపోయిన బిడ్డను చేతులలో పెట్టుకొని "ఎందుకయ్యా" అనేపాటను ఎంతో హృదయ విధారకంగా పాడుతూవున్నారు.

శ్రీ దాదాగారు ఆ పాటపాడేవారిని తీసుకరమ్మని మనిషిని పంపారు. వారు రాగానే ఆచనిపోయిన బిడ్డను తీసుకొని శ్రీ దాదాజీగారు మండే అగ్నిగుండంలో పడేశారు. ఆబిడ్డ పైవున్న గుడ్డలు కాలిపోయాయి. బిడ్డ అరుస్తున్నాడు. ఆ బిడ్డతల్లి ఆత్రుతతో బిడ్డను అగ్నినుండి బయటకు తీసుకున్నది. ఆ అగ్ని అమిత చల్లగా ఉండడం ఆమెనెంతో ఆశ్యర్య పరచింది. ఆ బిడ్డ ఆరోగ్యంగా జీవించి నేటికీ గిరిజానంద్ అనేపేరుతో జబ్బల్ పూరులో ఉన్నాడు. అతని ఇంటిలో శ్రీ దాదాజీగారి పేరుతో నిత్యం అగ్నిహోత్రం నేటికీ నిర్వహించబడుతుంది. కృతజ్ఞతాభావం అంటే ఎలా ఉంటుందో వీరిదగ్గర మనం నేర్చుకోవాలి.

సాయిఖేడాలో పట్వారీ మూల్‌చంద్ అనేవారికి శ్రీదాదాజీగారి దివ్యలీలలమీద బొత్తిగా నమ్మకముండేదిలేదు. ఒకరోజతడు శ్రీదాదాజీని దర్శించగానే "నేను రేపు ఆవులను మేపేందుకు అడవికిపోతాను. అప్పుడు పిల్లలందరికి లడ్లు తినిపిస్తాను" అని శ్రీదాదాజీగారు చెపుతున్నారు. అదే సమయంలో లచ్చీరామ్ అనే దర్జీవచ్చి నగ్నముగాఉన్న శ్రీదాదాజీగారికొక కోటు సమర్పించాడు. ఎక్కువ శ్రద్ధాభక్తులుగల భక్తులు సమర్పించే గుడ్డలు తీసుకోవడం శ్రీదాదాజీగారికి అలవాటు.



శ్రీ దాదాజీగారు ఆకోటు ధరించి ఆవులను మేపేందుకు పోతుంటే జిజీభాయిగారు కోటుజేబీలో రెండులడ్డుముద్దలు వేసి పెందలకడనే ఇంటికిరమ్మని శ్రీదాదాజీగారిని సాగనంపెను. అడవిలో పిల్లలు మాకు లడ్డుపెట్టమని శ్రీదాదాజీగారిని మారాంచేశారు. శ్రీ దాదాజీగారు చెట్టుకొమ్మకు తగిలించిన తనకోటునుండి లెక్కలేనన్ని లడ్లుతీసి పిల్లలందరికీ పెట్టారు. పిల్లలు లడ్లు తినలేక సంతృప్తులయ్యారు. కానీ కోటుజేబులోని రెండులడ్లూ అలానే చెక్కుచెదరకుండా ఉన్నాయి.

అదేసమయంలో పట్వారీమూల్‌చంద్ తన ఆవు కనిపించలేదని, అడవంతా వెతకగా ఒకచోట చచ్చిపడిఉందనిచెప్పి బాదపడ్డాడు. శ్రీ దాదాజీగారాఆవును తనవద్దకు మోసుకురమ్మని ఒక చెంబుడు నర్మదానదీజలాన్ని ఆ ఆవునకు త్రాగించమన్నారు. చనిపోయిన ఆవు నీరుత్రాగదుగదా ? అందువలన వారానీరు ఆవుచెవులో పోశారు. వెంటనే ఆ ఆవు చెంగునలేచి పరుగెత్తుకొని ఆవులమందలో కలసిపోయింది. ఈ దివ్యలీలనుచూచిన పట్వారీమూల్‌చంద్ శ్రీ దాదాజీగారు పరమశివుని అవతారమని వారిని ఎంతగానో స్తుతించి తన అనుభవం అందరికీ తెలియజేశారు.

సాయిఖేడాలో ఒకనూనె వర్తకురాలి కుమార్తె పుట్టంధురాలు. ఒకరోజాపాపను శ్రీ దాదాజీగారియెద్దకు తీసుకువచ్చారు. వారేమీ చెప్పుకోక ముందే శ్రీ దాదాగారు పిడికెడు విభూది ఆబిడ్డమొఖాన కొట్టి ఆ బిడ్డను బయటకు తీసుకుపొమ్మని ఆజ్ఞాపించారు. ఇంటిబయటకువెళ్ళి చూడగనే బిడ్డకళ్ళు మిలమిలలాడుచూ బిడ్డకు చూపువచ్చింది. ఆతల్లి కృతజ్ఞతాపూర్వకమైన గుండెతో శ్రీ దాదాజీగారికి ప్రణమిల్లెను.

శ్రీ దాదాజీగారు ఒక్కొక్కప్పుడు తన చేతికి దొరికిన వస్తువునెల్లా భక్తులపై విసిరికొట్టేవారు. ఒకరోజు వారు విసిరిన కర్ర ఒకకుక్కకు తగిలి అది అక్కడికక్కడే మరణించింది. శ్రీ దాదాజీ ఆకుక్కకళేబరాన్ని ఒక చినిగిన కంబళిలో చుట్టి అక్కడేఉంచారు. ఒకనెలరోజులవరకు దాన్ని

తాకనివ్వలేదు. అంతేగాక "కుక్కశవం పవిత్రతను బొందుతుంది" అనిచెప్పేవారు. ఒకరోజు అనేకమంది భక్తులు కుక్కకళేబరాన్ని తొలగించాలని శ్రీ దాదాగారినర్థించారు. శ్రీ దాదాగారా కళేబరాన్ని కర్రతో ఒక్కదెబ్బకొట్టగనే ఆ చనిపోయిన కుక్క తిరిగి బ్రతికి టక్కునలేచి పరుగులఘించుకొనెను. దత్తావతారులైన మహనీయులకు అసాధ్యమేముంది ?

సిరిసిరి సింధూర్‌గ్రామ భూస్వామియొద్ద ఒక నడువలేనికుంటి పనిమనిషి ఉండేవాడు. ఒకరోజు శ్రీ దాదాగారు ఆకుంటివానిముందు పోవు కుక్కను కొట్టమని ఆకుంటివానిని ఉసిగొల్పెను. ఆతడు చాలా ప్రయాసపడి చిన్న కర్రతో ఆకుక్కను ఒక్కదెబ్బకొట్టగలిగెను. ఆశ్చర్యం - అతనికాళ్ళకెంతో శక్తివచ్చి నడవగలిగెను. అతనిని ఆకుక్క దగ్గరకు వెళ్ళి కొట్టమని శ్రీ దాదాగారాతనిని ఉత్సాహపరచెను. ఆ వ్యక్తి చక్కగా నడువగలిగి ఆకుక్కను వెంబడించి కొట్టగలిగెను. అదిమొదలు ఆకుంటిపిల్లవాడు చక్కగా నడువగలిగెను.

ఒకరైతుయొక్క ఆవుదూడ గ్రుడ్డిది. అది ఎల్లప్పుడు దాదాగారిదగ్గరే ఉండి వారెచ్చటికిపోతున్నా అదికూడా వెళ్ళేది. కొన్నాళ్ళ తర్వాత దాదాగారు జాలిచెంది ఆదూడకు దృష్టిని ప్రసాదించారు. అదిమొదలు అది పశువులతోగూడ మేతకు వెళ్ళసాగింది.

ఒకరోజొక తుంటరిపిల్లవాడు రాతితో ఒకపక్షిని కొట్టాడు. ఆరాయిదెబ్బకు ఆపక్షి విలవిలలాడుచూ నేలగూలెను. ఆదృశ్యము చూచిన శ్రీ దాదాగారు వెంటనే ముందుకు నడిచి ఆపక్షిని తన అమృత హస్తముతో నిమిరసాగెను. కొద్దిసేపటిలో ఆ పక్షిలో చలనమారంభమై పునర్జీవితముపొందెను. శ్రీ దాదాగారాపక్షిని స్వేచ్ఛగా ఆకాశంలోనికి ఎగురవేసెను. అదిచూచిన ప్రజలందరూ శ్రీ దాదాగారొక అవతారపురుషుడని కీర్తించి జేజేలు పలికిరి.



## శ్రీ మురళీధర్ దుప్పతీవార్ (పెద్దన్నయ్య)

వీరు 1921 సం॥లో మహాత్మాగాంధి పిలుపుననుసరించి ఫైనల్ ఇయిర్‌లో కోర్సు వదలుకొని స్వాతంత్రపోరాటంలో దిగారు. కొన్నాళ్ళకు అనారోగ్యం వలన ఎన్నో ఇంగ్లీషుమందులు, ఇంజెక్షన్లువాడి తగ్గక చివరి ఆశగా సాయిఖేడాలో శ్రీ దాదాగారినాశ్రయించగా ఆరోగ్యవంతులై వివాహంకూడా చేసుకొన్నారు.

ఒకరోజు శ్రీ దాదాగారు వీరిని కర్రతో తలపగలగొట్టగా ఎంతో రక్తంపోయి స్పృహలేనిస్థితిలో ఒకగదిలో బంధించారు. ఎనిమిదవరోజు దుర్వాసనతోవున్న వీరిశరీరాన్ని బయటకు తీయించి మరలా కొట్టసాగారు. అందరూ మురళీధర్ ఇక బ్రతకడనుకొన్నారు. కానీ చిత్రంగా అన్ని గాయాలు మాయమైనాయి. అందరూ శ్రీ దాదాజీకీ జై అని జైకొట్టారు. 1936లో వీరు శ్రీ దాదాగారి సేవలోనే సిద్ధిపొందారు.

ఇదే విధంగా పండితగంగాధర్‌జీ, శ్రీస్వామిచరణానంద్‌జీ, శ్రీస్వామి శంకరానందజీ మరియు ఇంకా ఎంతోమంది శ్రీ దాదాగారిద్వారా ఆత్మజ్ఞానులయ్యారు.

శ్రీ దాదాజీగారి కృపవుంటే ఎంతటివారైనా సర్వబంధాలు తెంచుకొని త్రీవంగా రూపొందవచ్చు అని తెలుస్తుంది. అందరు మహాత్ముల విషయంలోను ఇదే సూత్రం వర్తిస్తుంది. అయితే మనం చిత్తశుద్ధితో ఏకధ్యేయంతో సాధనచేయకుండా వారి కృప పొందలేము. గనుక త్రికరణశుద్ధిగల మన సాధనే (కృషి) మనకట్టి మహనీయుల కృప ప్రసాదిస్తుంది.

శ్రీ పోపట్ భాయి, ఉద్ధవభాయీ అను గుజరాతీయులు శ్రీ దాదాజీగారి ఆజ్ఞమేరకు నిత్యానందగారిని తమగ్రామం తీసుకవెళ్ళి వారిని శ్రద్ధాభక్తులతో పూజించారు. శ్రీ నిత్యానందగారు అచ్చట అగ్నిగుండం వెలిగించి తన గురువుగారిని స్మరిస్తున్నారు. ఆ సమయంలో ఆ ప్రాంతములో ఒకరైతు కుమారుడు మరణించాడు. శ్రీ నిత్యానందగారు శ్రీ దాదాజీగారిచ్చిన కర్రతో ఆ శవాన్ని తాకివచ్చేశారు. అంతే ఆబిడ్డ తిరిగి

బ్రతికి శ్రీనిత్యానందగారికి ప్రణామములాచరిస్తుంటే జనులంతా ఆశ్చర్యచకితులై శ్రీ దాదాజీగారికి, శ్రీ నిత్యానందగారికి నిజమైన శ్రద్ధాభక్తులతో జేజేలు పలికారు. అంతటిగొప్ప మహిమను కన్నులారా గాంచిన ఆ ప్రజలంతా ఎంతో గొప్ప పుణ్యమూర్తులని వేరే చెప్పనక్కరలేదు.

శ్రీ నిత్యానందగారు బందన్‌పూరులో సమాధిచెందారు. శ్రీ దాదాజీగారు వారికి ప్రసాదించిన కర్ర, కంబళి వారిసమాధిలో ఉంచబడ్డాయి. నేటికీ శ్రీ నిత్యానందగారి సమాధిని దర్శించి ఎన్నోవేలమంది నిత్యం తమ బాధలు బాపుకొంటున్నారు. చెట్టుకుకాచే పండ్లనుబట్టి ఆ చెట్టుయొక్క గొప్పతనం నిర్ణయించమనే ఆచార్య శ్రీ భరద్వాజ మాస్టర్‌గారివాక్యం నిత్యసత్యంగదా !

## సర్వజ్ఞులైన శ్రీ దాదాజీ

దేవుడెలా కనబడతాడుస్వామీ ? అని అడిగిన భక్తునితో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు "నీయాల్నేవస్తే నీవేమికనుకుంటావయ్యా ?" అని సెలవిచ్చారు. అజ్ఞానులమైన మనము సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే వచ్చినా, నీవు పగటి వేషగాడివిలే పోవయ్యా ? నీవేషాలు నీవుగాని అని అంటామేగాని వారినిగుర్తించి సేవించలేముగదా !! గనుకనే శ్రీ సాయినిగాని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారినిగాని భగవత్‌స్వరూపులుగా గుర్తించి, సేవించి, తరించినవారిని వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. మిగిలిన జనమంతా వారిమహిమయనే బెల్లంచూచి చేరిన చీమలు, ఈగలవంటివారేనని చెప్పవలసిఉంటుంది.

దైవానికి సర్వజ్ఞత్వం, సర్వసమర్థత్వం, సర్వవ్యాపకత్వం ఉండటాన్ని శాస్త్రాలన్నీ నిర్దేశిస్తున్నాయి. గనుక ఏమహనీయునిలోనైనా ఆమూడులక్షణాలు ఎంతవరకు ప్రకటమవుతూఉన్నాయి అన్నదాన్నిబట్టి వారెంతటి దైవజ్ఞులో భక్తులు నిర్ణయించుకోవచ్చు. ఈ లక్షణాలపై మనదృష్టి లేనప్పుడు వేషాలుచూచి మోసపోయి బాధ గురువులవలలోపడి బాధగురువులని తెలిశాకకూడా ఆ విషవలయంలోనుండి బయట పడలేని



అనేకమంది అమాయకులను మనంచూస్తూ ఉంటాము. శ్రీ దాదాగారిలో ఈ లక్షణాలు వారు ప్రయత్నంతో ప్రదర్శించడం కాకుండా సందర్భోచితంగా సహజసిద్ధంగా వెల్లడై అమాయకులైన భక్తులకుకూడా వారిదైవత్వం బోధపరచి భక్తివిశ్వాసాలను భిక్షను ప్రసాదించాయి.

పరిపూర్ణజ్ఞానులెలావుంటారో వారిని నకిలీగురువులనుండి గుర్తించడమెలాగో పూజ్యశ్రీ భరద్వాజగారు ఎన్నో గ్రంథాలలో వివరించారు. "(1) ఎవరి సన్నిధిలో మన ప్రయత్నంలేకుండా మన మనస్సు ధ్యానస్థమౌతుందో (ప్రశాంతత నొందుతుందో) అదే జ్ఞాని సన్నిధి. (2) ఎవరి సన్నిధిలో మన మడుగకనే మన మనస్సులోని ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయో అదే మహనీయుల సన్నిధి (3) మన ఇష్టమొచ్చిన నామం స్మరిస్తూ వారి సన్నిధిలో జరిగేందుకు వీలులేని విషయాలు పలానా జరుగవలెనని కోరుకొని నామస్మరణ చేస్తుంటే ఆ విషయాలు జరిగి తీరినట్లయితే అది మహనీయుని సన్నిధి అని గుర్తించుకో'సోదర భక్తులందరూ ఏమహనీయునికైనా తలతాకట్టుపెట్టేముందు ఈ లక్షణాలు పరిశీలించాలని మనవి.

భాస్కరానంద్‌గారికి శ్రీ దాదాగారిసన్నిధిలో కొన్ని ప్రశ్నలు మనసులో ఉదయించాయి. వాటిని వారు పైకి చెప్పకముందే శ్రీ దాదాగారు జవాబుచెప్పారు.

(1) సాధువులు దయాళువులుగా నుందురా ?

జ. వారు దయాళువులే కాదు, కఠోరముగాకూడా వ్యవహరింతురు.

(2) మేము ఈశ్వరుని అంశమునకు చెందినవారమా ?

జ. అంశమే కావలెనా ? ఈశ్వర అంశమే.

(3) సూర్యుని తేజస్సు ఎవ్వరిది ?

జ. సూర్యునిలోని తేజస్సుకూడా మేమే. అని పలికారు.

భాస్కరానంద్ ధ్యానలిమగ్నులైనారు. వెంటనే శ్రీ దాదాగారు "మేమెంతోమంది ఇలాంటి సాధువులకు మార్గము చూపుతున్నామని చెప్పారు.

నిజంగా లక్షలకొలది జనులకు శ్రీ దాదాగారు ఘోరమైన సంసారమును దాటించారు మరియు దాటించుచున్నారు. ఇకముందుకూడా నిత్య సత్యులై తనమాట తప్పక నిలబెట్టుకుంటారు.

అందాల రాశియగు ఒకవ్యాపారస్తునిభార్య సంతానార్ధమై శ్రీ దాదాగారికి పాదాభివందన మాచరించింది. శ్రీ దాదాగారు ఆమె చీరకొంగు పట్టుకొని నవ్వి "నిన్నరాత్రి నీవు ఆచెట్టుక్రింద నీ నౌకరుద్వారా ఒకబిడ్డను పొందావుగదా ? మరలా నాయొద్దకు రానేల ? అని మందలించారు. ఆమె తనరహస్యము బయటపడినందులకు సిగ్గుపడి పశ్చాత్తాపముతో వెళ్ళింది.

ఈ మందలింపుద్వారా శ్రీ దాదాగారు ఆమెకు సంతానము ప్రసాదించుటమేగాక ఆమెనడవడిగూడా సరిదిద్దారని మనం గుర్తించాలి. అట్లాకాని పక్షంలో దయానిధియైన శ్రీ దాదాగారు ఆమె భర్తఎదుటనే ఆమెరహస్యము బయటపెట్టి ఆమెను అవమానించడం జరుగదు. ఒక్కొక్కప్పుడు బాధకూడా అనుగ్రహానికి గుర్తు అని మహాత్ముల చరిత్రలు బుజువుచేస్తున్నాయిగదా !

శ్రీ దాదాగారి దర్శనార్ధంవచ్చేవారు అనేక కారణాలుగా వచ్చేవారు. కొందరికి భక్తిశ్రద్ధలు లేకున్నా వారిమహిమను చూడాలనికూడా వచ్చేవారు. అట్టివారికికూడా పరమదయాళువైన శ్రీ దాదాగారు తగిన నిదర్శనాల ననుగ్రహించి వారికి భక్తివిశ్వాసాలనేబిక్ష పెట్టేవారు. మానవజన్మ తరించేందుకు అంతకంటే కావలసిందేమీలేదుగదా !

శ్రీ దాదాదగారి దివ్యలీలలనుగూర్చి విని వారినిచూడాలని ఆంగ్లేయ దంపతులువచ్చారు. వారిని చూస్తూనే శ్రీ దాదాగారు ఆ ఆంగ్లేయుణ్ణి కోటు టోపీ తీయమని ఆజ్ఞాపించారు. అతడు వాటిని తీసి శ్రీ దాదాగారి పాదములచెంతనుంచాడు. శ్రీ దాదాగారు వాటినిధరించి "మీరు మీదేశమునకు వెళ్ళినచో అరటి పండ్లుఇస్తాము" అనిచెప్పారు. వెంటనే కొందరు భక్తులు అరటిపండ్లు తేవడానికి బజారుకువెళ్ళారు కాని అరటిపండ్లు ఎక్కడా దొరకలేదు. అదివిని శ్రీ దాదాగారు "కొంచెంసేపటిలో



రైలుబండి అరటిపండ్లు తెస్తుంది ఆగండి అనిచెప్పారు. వారుచెప్పినట్లే కొద్దిసేపటిలో కొందరు పార్శీలు అరటిపండ్ల గెలలు తీసుకొని రైలుదిగి శ్రీ దాదాగారి దర్శనార్ధం వచ్చారు. శ్రీ దాదాగారు ఆ ఆంగ్లేయ దంపతులకు అరటిపండ్లిచ్చి ఆశీర్వదించారు. శ్రీ దాదాగారు చెప్పినట్లే కొద్దిరోజులలో ఆ ఆంగ్లేయుడు స్వదేశానికి పిలిపించబడ్డాడు. నాడు కోటు టోపీతో శ్రీ దాదాగారికి తీసిన ఫొటో ఖాండ్వాదర్బారులో నేటికీ భద్రపరచబడి వుంది.

ఒకప్పుడు సాయిఖేడా భక్తులతోనిండి అదొక జనసముద్రంగా కనిపించసాగింది. ఒక గుజరాతి మహాశయుడు అతని మిత్రులు ఆరద్దీలో శ్రీ దాదాగారిని రెండు రోజుల వరకు దర్శించలేకపోయారు. వారు విసుగుచెంది మూడవ నాడు ఇంటికి వెళ్లాలని బండి కోసం ఎదురు చూస్తున్నారు. సర్వజ్ఞులైన శ్రీ దాదాగారినుండి ఒక మనిషి వచ్చి శ్రీ దాదాగారు వారిని తీసుకరమ్మన్నారని చెప్పి దర్శనము చేయించారు. అప్పుడు శ్రీ దాదాగారు "మీకిచ్చటి నియమము తెలియదు. మా ఆజ్ఞ లేక ఇచ్చటి నుండి ఎవ్వరూ పోలేరు. ఒకవేళ పోయినా బండి దొరకదు అని చెప్పి వారికి ప్రసాద మిచ్చి ఆశీర్వదించి పంపారు. శ్రీ దాదాగారి పర్వజ్ఞత్వానికి, అవ్యాజనీయమైన ప్రేమకు ఆ పృచ్ఛకులు ముగ్ధులై శ్రీ దాదాగారికి ప్రణమిల్లారు. ఈ అనుభవము తర్వాత వారి భక్తి శ్రద్ధలు ఎంత తీవ్రస్థాయినొందాయో ఎవరూహించగలరు. ఆచార్య భరద్వాజగారు చెప్పినట్లు కష్టములు గూడ ఒక్కొక్కప్పుడు అనుగ్రహానికి చిహ్నాలే! అందరిలాగ వారికీ సులభంగా దర్శనం లభించిఉంటే వారికి శ్రీ దాదాగారి ప్రత్యేక ఆహ్వానము, దర్శనము లభించియుండవు గదా! వారి సర్వజ్ఞత్వము, ప్రేమ వీరికి ఆ రెండు రోజులుపడ్డ శ్రమవలననే లభించాయని గుర్తింతుము గాక.

జనసమూహమునకు అత్యంత సంభ్రమాశ్చర్యములను గొలుపు దివ్యలీలలు ప్రదర్శించడంలో శ్రీ దాదాగారికి దాదాగారే సాటి. అనాడు ఆ ప్రాంతమందున్న భక్తుల పరిపాకాన్ననుసరించి వారికలాంటి లీలలు ప్రదర్శించకున్న వారి భక్తి విశ్వాసాలు దృఢతరం కావు కాబోలు.

1904వ సం॥లో హోషంగాబాద్ రైలు స్టేషనులో ఇటార్సీ వెళ్ళే రైలు నెమ్మదిగా కదులుతూ కూత వేస్తున్నది. ఇంతలో శ్రీ దాదాగారు అకస్మాత్తుగా రైలుపెట్టిలో ఎక్కి రెండు పిడికెళ్ళు బిగించి టప్, టప్ మని శబ్దము చేయసాగారు. బండి సూ, సూ అను శబ్దముతో నిలచిపోయింది. అకారణముగా రైలు ఆగిపోవడానికి కారణము డ్రైవరుకు బోదపడక తికమక పడసాగాడు. శ్రీ దాదాగారు మాత్రము పెద్దగా నవ్వుతున్నారు. శ్రీ దాదాగారి మహిమ తెలిసిన కొందరు శ్రీ దాదాగారికి క్షమాపణ చెప్పిన రైలు కదులుతుందని డ్రైవరుకు సలహా ఇచ్చారు. ఆ తెలివిగల డ్రైవరు వెంటనే శ్రీ దాదాగారికి సాష్టాంగ పడి క్షమాబిక్షకోరి రైలు వదలమని శ్రీ దాదాగారిని ప్రార్ధించాడు. శ్రీదాదాగారు తన పిడికిళ్ళు వదలి బక్, బక్‌మని అరచి నవ్వారు. వెంటనే రైలు కదలిపో సాగింది. కదలిపోయే రైలునుండి శ్రీ దాదాగారు దభాలున రైలుదూకి అందరినీ ఆశ్చర్యానందాలలో ముంచి వేశారు. మహనీయుల శక్తి సామర్థ్యాలను మరొకసారి లోకానికి చాటారు శ్రీ దాదాగారు.

హరి హర బోలే భగవాన్ గారినే చిన్న దాదాజీ అని పిలిచే వారు. వీరు మొట్టమొదట శ్రీ పెద్ద దాదాజీ గారి యొద్దకు చేరిన వివరం: -

శ్రీ దాదాజీ గారు వేలమంది భక్తులచే పరివేష్టితులై ఉండగా ఒక బ్రహ్మచారి వారి దర్శనార్ధం వచ్చారు. వెంటనే శ్రీ దాదాజీ గారు తన చేతికి చిక్కిన కర్రలను భక్తులపైకి విసిరి నందున భక్తులంతా చెల్లాచెదరుగా పరుగెత్తి వెళ్ళారు. బ్రహ్మచారిగారు శ్రీ దాదాజీ చెంతకు వెళ్ళగానే ఒక రొట్టెను మడిచి తన స్వహస్తాలతో బ్రహ్మచారి నోటి కందించి తినమన్నారు. వారది తినగానే వారిని అక్కడున్న ఝుండాల క్రింద కూర్చోనమని ఆజ్ఞాపించారు. రెండు రోజులు అన్న పానీయాలు లేకుండా అట్లాగే కూర్చున్నారు. మూడవనాడు ఒక భక్తుడు తనకు సమర్పించిన పుచ్చకాయను శ్రీ దాదాగారు విసిరి కొట్టారు. అది పగిలి ముక్కలై ఒకముక్క బ్రహ్మచారిగారి ఒడిలో పడింది. అప్పుడు శ్రీ దాదాజీ గారు



"ఈపుచ్చకాయ తిని ఏమచ్చాలేకుండా వర్ధిల్లు" మని బ్రహ్మచారిని ఆశీర్వదించారు. అదిమొదలు ఆ బ్రహ్మచారి గారే చిన్న దాదాజీగా వారిసేవలో తరించారు.

ఒకసారి కాశి నుండి కొందరు పండితులు శ్రీ దాదాజీ గారిని పరీక్షించాలని వస్తున్నారు. వారు నర్మదా నది తీరాన మలవిసర్జనకు వెళ్లినప్పుడు పోలీసులు వారిని అరెస్టు చేసి జైలుకు పంపారు. వారొచ్చిన పనేమిటో చెప్పమని పోలీసులు నిర్బందించారు. నిజంచెపితే వదిలేస్తారని వారువచ్చిన పనిచెప్పేశారు. అంతేగాక పోలీసు డిపార్టుమెంటులో పైఅధికారి తమకు తెలుసునని గూడా చెప్పారు. పోలీసులు నవ్వి "మీరీ దుర్బుద్ధితో రాబట్టే శ్రీ దాదాగారే మిమ్ములను అరెస్టుచేయించి ఉంటారు. మీరుచెప్పే ఆ అధికారి నాలుగు రోజుల నుండి డ్యూటీలో లేరని" చెప్పారు. చివరకు వారు విడుదలై శ్రీ దాదాగారిని దర్శించారు. వారు వచ్చే సరికి శ్రీ దాదాగారు అతి బిగ్గరగా వేదాలు వల్లిస్తున్నారు. ఆ పండితులు భయంతో వణకిపోతూ శ్రీ దాదాగారి పాదాల పైబడి క్షమాపణ కోరారు.

మానవుని లోని ఈర్ష్య, ద్వేషము, అసూయ వారి కెంతగా నష్టం కలిగిస్తాయో ఈ క్రింది సన్నివేశం చక్కగా వివరిస్తుంది.

ఖాండ్వాలో శ్రీ దాదాగారి ఆశ్రమం ప్రక్కన ఒక సన్యాసుల ఆశ్రమం వుండేది. శ్రీ దాదాగారి ఆశ్రమ ఔన్నత్యం చూచి ఓర్వలేక అసూయతో ఈ సన్యాసులు పోలీసులతో చేతులుకలిపారు. ఒకరోజు కొందరు పోలీసులు ఆశ్రమం లోకివచ్చి ఆశ్రమవ్యాన్‌ల లైసన్సులు చెక్‌చేయాలన్నారు. లైసన్సు పుస్తకాలు చిన్న దాదాగారి దగ్గరున్నవని చెప్పారు. పోలీసులు వెళ్ళి డి.యస్.పి. గార్కి ఆశ్రమ వాసులు మమ్ములను కొట్టారని పిర్యాదు చేశారు. అజ్ఞాని యైన ఆ డి.యస్.పి రెండు లారీలనిండా పోలీసులతో వచ్చి ఆశ్రమంలో కాల్పులు జరిపి రు.3200 దోచుకున్నారు. చిన్నదాదాగార్కి స్వల్పగాయాలు కూడా తగిలాయి. చిన్నదాదాగార్ని అరెస్టు

చేసి జామీను పై విడిపించారు. నాలుగు రోజులు ఆశ్రమ మంతా పోలీసు బందోబస్తుతో పూజలు నిలిచిపోయాయి. నాలుగవనాటినుండి శాంతివాతావరణం ఏర్పడింది.

కోర్టులో కేసు నడిచింది. చివరకు ఆశ్రమ వాసులు నిర్దోషులని కొందరు పోలీసు అధికారులను, పోలీసులను ఉద్యోగం నుంచి తొలగించారు. మరికొందరికి సస్పెన్షన్ ఆర్డర్లు వచ్చినవి. మరికొందరికి జుల్మానా విధించారు. ఆ విధంగా మానవులు ఈర్ష్య, ద్వేషము, లసూయలకు తగుఫలితాలు పొందారు.

ఒకరోజు మకడాయీ ప్రాంతం లోని వర్తకుడు శ్రీ దాదాజీ గారిని నగ్న శరీరంతో చూచి జాలి చెంది వారిపై ఒక శాలువ కప్పారు. వెంటనే శ్రీ దాదాగారు ఆ శాలువను ఆ వర్తకుని ముందే ఒక గాడిద పైకప్పారు. అది చూచిన వర్తకుడు చాలా బాధ పడి శ్రీ దాదాగారు ఒక పిచ్చివాడని మనసులోనే తలచారు. అతని మనసులోని భావన ఎరిగిన శ్రీ దాదాగారు వెంటనే ఆ వర్తకుని జీవితంలోని అతిముఖ్యమైన, రహస్యమైన విషయాలు అతనితో చెప్పసాగెను. శ్రీ దాదాగారి సర్వజ్ఞత్వం రుచిచూచిన ఆవర్తకుడు వెంటనే శ్రీ దాదాగారి పాదాలపైబడి క్షమాపణ వేడాడు. మహనీయులు కరుణిస్తే మన అజ్ఞానం ఎంత తేలికగా నిర్మూలన మౌతుందో చూడండి.

సాయీ ఖేడా లో శ్రీరామనాథ్ అను వ్యాపారి ఉండేవాడు. అతనికెంతో సంపద ఉన్ననూ తన అరవై సంవత్సరాల వయసు వరకు సంతానము లేదు. అదే అతనిగొప్ప దిగులు. ఒకప్పుడు వంశీధర్‌సేట్ శ్రీ దాదాజీ గారి దయవలన తన వ్యాధి నయమైన కారణంగా మేళతాళాలతో పూజసామగ్రితోశ్రీ దాదాజీగారి దర్శనార్థం అనేక మంది ముత్తైదువలతో వెళ్ళారు. ఆసందర్భములో శ్రీరామనాద్ గారు కూడా భార్యా సమేతంగా శ్రీ దాదాగారిని దర్శించారు. శ్రీరామనాద్ గారి భార్య శ్రీ దాదాజీ గారికి నమస్కరించగనే ఆమె ఏమీ చెప్పకొనకుండానే శ్రీదాదాగారు ఆమెకొక



మామిడిపండిచ్చారు."ఈ పండుతిను, నీకు పుత్రుడు కల్గుతాడని దీవించిరి. అదేవిధముగా ఆమె అంతటి వృద్ధాప్యములో బహిష్టు ఉడిగిన తరువాత ఒక మగశిశువును ప్రసవించెను.

ఆ సంతోషములో రామనాద్‌గారు గొప్ప వేడుకచేసి అందరికీ మిఠాయీ పంచాడు. కానీ శ్రీ దాదాజీ గారికి ఒక టెంకాయి కూడా సమర్పించడాయెను. ఆ తరువాత కొన్నాళ్ళకు ఆబిడ్డ జ్వరపీడితుడై మరణించాడు. ఆ బిడ్డను పోగొట్టుకొన్న తల్లిదండ్రులు దుఃఖమునకు అవధులు లేవు. ఆ బిడ్డను ఏటి వడ్డున పూడ్చిపెట్టే సమయంలో హటత్తుగా శ్రీమురళీ ఉస్తాద్ గారు వచ్చి "శ్రీ దాదాజీ మహరాజ్ గారికి జై " అనే నినాదములు చేయగానే ఈ బిడ్డ ఏడుస్తూ లేచాడు. ఆ బిడ్డ తిరిగి బ్రతికినందుకు అందురూ ఆశ్చర్యచకితులై శ్రీ దాదాజీ గారి మహిమయని కొనియాడిరి. అందరూ శ్రీ దాదాజీగారి దర్శనార్థము పోగానే వారు రామనాద్ గారి జుట్టుపట్టుకొని "అందరికీ మిఠాయి పెట్టావుగానీ నాకేమి ఇవ్వలేదే" అని అడిగారు. రామనాద్ గారు అప్పటికప్పుడే మిఠాయి పంచి శ్రీ దాదాగారికి కృతజ్ఞతలు తెల్పుకున్నారు.

శ్రీ దాదాజీ గారికి పిపీలికాది బ్రహ్మపర్యంతం అందరి హృదయాలు తెరచిన పుటలవలె సర్వం తెలిసే ఉండేవి. అందుకే వారిని సర్వజ్ఞులని అనేవారు. తనను ఆశ్రయించిన భక్తులు తమను అడుగకపోయినా వారి సమస్యలకు సమాధానాలు చెప్పేవారు. ఒకరోజు శ్రీ చంద్రశేఖర్ అనే వారు సాంసారిక జీవితంతో విసిగిపోయి సన్యాసము తీసుకోవాలని శ్రీ దాదాజీగారిని దర్శించి పూలు, పండ్లు సమర్పించి నమస్కరించాడు. వెంటనే దాదాజీగారు "నీవు వెళ్ళి సంసార జీవితాన్నే గడుపు. ఇప్పుడే సన్యాసం పుచ్చుకొవద్దు" అని ఆజ్ఞాపించారు. తను నోరు విప్పక ముందే శ్రీ దాదాజీగారు తన సమస్యను గూర్చి చెప్పడంతో శ్రీ చంద్రశేఖర్‌గారు ఆశ్చర్యంతో వారి ఆజ్ఞను సిరసావహించారు.

# సర్వవ్యాపకుడు

విశ్వచైతన్యంతో తాదాత్మ్యం చెందిన మహనీయులు ఈ విశ్వమంతా తామే అయిఉంటారు. భక్తరక్షణ కొరకు కోరినప్పుడు కోరినచోట సంకల్ప మాత్రాన శరీరంతో కన్పించగలరు. అదృశ్యం కాగలరు. ఈ మహనీయుల చైతన్యం అనుక్షణ సగుణసాకారంగాను, నిర్గుణ నిరాకారస్థితిలోను పనిచేస్తుంటుంది. పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజగారు వీరిస్థితికి ఒక చక్కని పోలికచెప్పారు. "ఈ మహనీయులు ఇంటిగడపలో నిలుచున్న వ్యక్తి వంటివారు. ఆ వ్యక్తి ఇంటి బయట, లోపలకూడా ఏమిజరుగుతుందో ఒకే కాలంలో చూడగలుగుతాడు ? అని చెప్పేవారు. ఒక్క అడుగు ఎటుకదిల్చినా ఏదో ఒకచోట మాత్రమే చూడగల్గుతారు. రెండు తావులను ఒకేసమయంలో చూడాలంటే గడపలోనే ఉండాలి.

శ్రీ దాదాగారు ఆశ్రమంవదలి ఎక్కడకూ వెళ్ళరు. కానీ అనేక ప్రాంతాలలో శరీరంతో కన్పించి భక్తులనాదుకున్నట్లు తర్వాత వచ్చిన భక్తులు వివరించేవారు. ఇట్టి దివ్యలీలలద్వారా తమ భక్తుల భక్తి విశ్వాసాలను ఎంత గొప్పగా అభివృద్ధి పరచేవారో వర్ణింపసాధ్యముగాదు. "అందుకే అన్నపానీయాలైనా మానవచ్చుగాని సద్గురు సన్నిధి వీడరాదని పెద్దలు చెప్పారు.

భక్తుల సంస్కారాన్ననుసరించి వారిభక్తి, విశ్వాసాలు పరిష్టముచేయు సంకల్పంతో శ్రీ దాదాగారు రకరకాల లీలలు ప్రదర్శించారు. సాయిఖేడాలో శ్రీ దాదాగారిని సందర్శించాలని ఒకశేట్ మధురలో తన మిత్రునింటికి టాంగాలో పోతుంటే శ్రీ దాదాగారు ఒకచెట్టుక్రింద నిలుచొని కనిపించారు. టాంగా వేగంగా పోవుచున్నందున శ్రీ దాదాగారిద్దగ్గర ఆపలేకపోయారు. కొంతదూరంపోయాక టాంగా ఆపి తిరిగివెనక్కువచ్చి చూస్తే అక్కడ శ్రీ దాదాగారులేరు. ఆశేట్ సాయిఖేడాలో శ్రీ దాదాగారిని దర్శించి నమస్కరించగానే "మేమిప్పుడే మధురలోని బృందావనం షికారు వెళ్ళివస్తున్నాము" అనిచెప్పారు. బృందావనంలో తాను శ్రీ దాదాగారిని



చెట్టుక్రింద చూచిన విషయం నిజమేనని రూఢిచేశారు. శ్రీదాదాగారు దైవస్వరూపులని ప్రపంచంలో ఎన్నిచోట్లయిననూ ఒకేకాలంలో తనభక్తులకు దర్శనమీయగలరని విశ్వాసం గలిగిన శేట్‌గారి భక్తి శ్రద్ధలెంతో వృద్ధిచెందాయి.

ఇదేవిధంగా పూర్వజన్మ అనుబంధాన్నిబట్టి తనభక్తులీప్రపంచంలో ఎక్కడున్నాసరే సప్తసముద్రాలకావలవైపునున్నాసరే శ్రీ దాదాగారు తన సన్నిధిలోకి వారినిలాగి ఉద్ధరిస్తారు. భోపాల్‌నివాసి గంగాప్రసాద్‌వ్యాస్‌గారు లౌకిక జీవితంమీద విరక్తిచెంది కాశీవెళ్ళి సాధన చేయసాగారు. కానీవారికచ్చటగూడ మనశ్శాంతి కలుగలేదు. ఒకనాటిరాత్రి శ్రీ దాదాగారు ప్రసాద్‌గారికి స్వప్నదర్శనమిచ్చి "మేమిప్పుడు సాయిఖేడాలో ఉన్నాము. నీవు కాశీలో కాలము వృధా చేయడమెందుకు ? అనిపల్కి అదృశ్యమైనారు. ప్రసాద్‌గారు ఆదివ్యోపదేశము ప్రకారము సాయిఖేడావచ్చి తనకు స్వప్నసందేశమిచ్చిన మహనీయుడు శ్రీ దాదాగారేనని గుర్తించి వారిభక్త వాత్సల్యమునకు ముగ్ధుడై శ్రీ దాదాగారిని శరణువేడాడు. ఆ పవిత్ర సన్నిధిలో శ్రీ దాదాగారి పర్యవేక్షణలో ఉత్తమ సన్యాసజీవనము సాగించి చివరకు శ్రీ దాదాగారిలో ఐక్యమయ్యారు.

వామనరావుచౌబేగారి మామగారైన ఆనందరావు తనమిత్రులతో కలసి శ్రీ దాదాగారిని దర్శించారు. శ్రీ దాదాగారు స్నానంచేయడంగాని, మలమూత్రవిసర్జనచేయడంగాని లేదనివారు గమనించారు. అయినప్పటికీ శ్రీ దాదాగారి శరీరము మనోరంజకమైన సుగంధ పరిమళాలతో నిండియుండడం భక్తులందరికీ విదితమే. వారు వంతులప్రకారము శ్రీ దాదాగారేమిచేస్తున్నారో గమనిస్తున్నారు. శ్రీ దాదాగారు మూత్రవిసర్జనకు తనస్థానమునుండి లేచి ఎక్కడకువెళ్ళలేదు. మరుసటి ఉదయం దదీనదీ తీరమునుండి వచ్చిన భక్తులు నేటి ఉదయం శ్రీ దాదాగారు దదీనదిలో స్నానంచేస్తుండగా చూచామని చెప్పారు. ఆసమయంలో శ్రీ దాదాగారు ఆశ్రమంలోనే ఉండడం శ్రీ ఆనందరావుగారు చూచారు. శ్రీ దాదాగారు సర్వవ్యాపకులని వారు సంకల్పమాత్రమున ఒకే కాలంలో ఎన్ని చోట్లనయినా ఉండగలరనీ గ్రహించిన ఆనందరావుగారి ఆనందానికి మేరలేదు.

బ్రహ్మ భావన మాత్రమేగాక బ్రహ్మానందాన్ని నిరంతరం అనుభవించే మహనీయులను జీవన్ముక్తులంటారు. వారికీ జగత్తులో సర్వం బ్రహ్మమయంగానే అనుభవమవుతుండడంవలన వారి ప్రవర్తనే విలక్షణంగా ఉంటుంది. శ్రీ దాదాగారు తన ఆశ్రమంలో రాత్రిపూట ధ్యానస్తులై ఉన్నప్పుడు రెండు సింహాలు వారికిరువైపులా కావలికూర్చొని ప్రాతఃకాలముననే బాహడ్ అడవులలోనికి వెళ్ళిపోయేవి. ఒకనాడు కొందరు సాధువులీ సింహాలను చూచి భయకంపితులయ్యారు. శ్రీ దాదాగారు వారితో "పరమేశ్వర రూపియైన ఆత్మ జగమంతా ఒక్కటిగనే యున్నది. గనుక సింహములను చూచి భయపడనవసరంలేదు" అని బోధించిరి.

ఏ విషయములో కూడా మహనీయుల ఆచరణే మనకు మార్గదర్శకము. అజ్ఞానులమైన మనకు వారిచర్యలు అర్ధరహితాలుగా ఉండడం సహజము. అట్టివింత చర్యల అర్ధాన్ని వారు ప్రేమతో వివరించినప్పటికి లోపభూఇష్టమైన మన మనస్సులు ఆ మాటల నిజార్ధమును గ్రహించలేవు.

ఒకరోజు శ్రీ దాదాగారు పదిహేను డబ్బాలనెయ్యిని శ్రీ ధునీమాత కర్పించారు. అంతకంతకూ విజృంభించి పైకిలేచిన మంటలు పైనున్న పందిరిని తగులబెడతాయని భయకంపితులయ్యారు. కానీ అలాంటి ప్రమాదమేమీ జరుగలేదు. శ్రీ దాదాగారు బంగారు, వెండి, ఎండుద్రాక్ష, మృష్టాన్నము, విలువైన జరీవస్త్రములు మణుగుల కొలది నెయ్యి శ్రీ ధునీమాతకర్పించేవారు. ఈ విధంగా ఎంతో విలువైన వస్తువులను అగ్ని కర్పించడంలోని భావం, చనిపోయిన వారిని సంకల్ప మాత్రముతో బ్రతికించ సమర్ధుడైన శ్రీ దాదాగారికే తెలుస్తుందిగాని మనకెలా తెలుస్తుంది. శ్రద్ధాభక్తులతో ఆ పవిత్రమైన అగ్నిహోత్రాన్ని పూజించడమే మన కర్తవ్యము.

ఒకరోజు కాంజుడే అనుభక్తుడు శ్రీ దాదాగారి దర్శనార్ధమై సాయిఖేడా వెళ్ళాలని రైల్వేష్టేషనుకు వెళ్ళాడు. అప్పుడే రైలుదిగిన కొందరు భక్తులు "మేము శ్రీ దాదాగారిని హోషంగాబాద్‌లో దర్శించుకొనివస్తున్నాము మీరుకూడా సాయిఖేడా పోకుండా హోషంగాబాద్‌వెళ్ళి శ్రీ దాదాగారిని దర్శించుకోండి అని సలహాఇచ్చారు. శ్రీ దాదాగారి నిజతత్వమెరిగిన



కాంజుడేగారు "శ్రీ దాదాగారు సర్వవ్యాప్తి. భక్తుల భక్తిశ్రద్ధలననుసరించివారు ఎక్కడకోరితే అక్కడే దర్శనమీయగలరు" అని చెప్పి తాను సాయిఖేడాకే వెళ్ళాడు. దీనార్తుల బాధలు బాపుచూ శ్రీ దాదాగారు సాయి ఖేడాలో కాంజుడేగారికి దర్శనమిచ్చారు.

భక్తవత్సలుడగు శ్రీ దాదాగారు తన భక్తులు ఎప్పుడు ఎక్కడ ఇబ్బందులలోనున్నా వారి బాధలు తన బాధలుగాభావించి తగురీతిన తక్షణ సహాయం అందించేవారు. తన దర్శనార్ధం ఎద్దుబండిలో ప్రయాణం సాగించివస్తున్న ఒక భక్తుడు అనేక ఇబ్బందులుపడుతూ వస్తున్నాడు. శ్రీ దాదాగారు గాడరువాడ కొక సేకవకునిపంపి ఆ భక్తునకెలాంటి ఇబ్బందిలేకుండా తీసుకొనిరమ్మని ఆజ్ఞాపించారు.

ఇదే విధముగా కాంజుడేగారు సాసర్‌లో నున్నప్పుడు తన పద్నాలుగవ ఏట తీవ్రవ్యాదితో మంచం పట్టాడు. అప్పటికి వారు శ్రీ దాదాగారి పేరుకూడా వినియుండలేదు. కానీ శ్రీ దాదాగారొక సేవకునిద్వారా విభూతినిపంపి రోజుకు మూడుసార్లు సేవించమనిచెప్పారు. శ్రీ దాదాగారి దయవలన అనతికాలముననే శ్రీ కాంజుడేగారు స్వస్తుడయ్యాడు. డెబ్బయి అయిదు సంవత్సరాల వయసులోకూడ శ్రీ కాంజుడేగారు నిండైన ఆరోగ్యంతో ఉన్నారంటే అదంతా కేవలం శ్రీ దాదాగారి అనుగ్రహం మాత్రమేనని చెపుతున్నారు.

## భక్తపాలన

మహాద్భుతము, అపారము అయిన ఈ మహనీయుని భక్తపాలన వర్ణించేందుకు ఆదిశేషునికే తరముగానప్పుడు ఇంద్రియలోలుడనైన నేనేమి వ్రాయగలను. గ్రంధవిస్తారభీతిచే స్వల్పంగానే ముచ్చటిస్తున్నాను. ఇంతటి పరమాద్భుత లీలలు చవిచూచిన ఆ భక్తవరేణ్యుల పాదధూళి శిరస్సునదాల్చి వారికి శతాదిక వందనములాచరింతుముగాక ! ఈ లీలలు చదివాక మన హృదయాలుకూడా తగుస్థాయిలో పరవసించి ఆ విశ్వగురుతత్వమునుండి మనకుగూడ అట్టిదివ్యానుభూతులుకల్గు విధంగా మన నిత్యజీవితాలను సంస్కరించమని నిత్యసత్యుడైన శ్రీ దాదాజీని

హృదయపూర్వకంగా ప్రార్ధిద్దాం. పూజ్యపాదులు శ్రీ దాదాగారి లీలలన్నీ ఇతర దత్తావతారాలైన మహనీయుల లీలలతో ఇంచుమించు సరిపోలియున్నవి. కానీ శ్రీ దాదాగారిచరిత్రలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయము వీరనేకమార్లు బంగారు సృష్టించి భక్తులకివ్వడం. వీరు భక్తులకు ప్రసాదించే సర్వం శ్రీ నర్మదామాతగారి ప్రసాదమని చెప్పేవారు.

సాయిఖేడా గ్రామాధికారి భార్య శ్రీ దాదాగారికి అత్యంత ప్రీతిపాత్రమైన భక్తురాలు. ఆ గ్రామాధికారి కుమార్తె వివాహమైన తరువాత అత్తవారింటికి వెళ్ళుచుండెను. ఆ సందర్భములో గ్రామాధికారి భార్య తన కుమార్తెను ఆశీర్వదించమని కోరి శ్రీ దాదాగారికి పాదాభివందనంచేసింది. "బిడ్డా నీ వీడ్కోలు కానుకగా నేనేమివ్వను" అంటూ శ్రీ దాదాగారు మండుచున్న అగ్నిగుండములో చెయ్యిపెట్టి ఒక బంగారు ఇటుక తీసి పెండ్లికుమార్తెకు ప్రసాదించి "దీనితో నగలుచేయించుకొని ఇప్పుడు నీవు ధరించియున్న నగలు తీసివేయుమని అజ్ఞాపించిరి. వారావిధముగాచేసి సుఖసౌఖ్యాలతో జీవించారు.

ఒకరోజు బొంబాయినుండి ఒకసేట్ శ్రీ దాదాగారి దర్శనార్థమై వచ్చాడు. షుమారు పదిహేను వందలరూపాయల విలువగల శాలువను శ్రీ దాదాగారికి కప్పాడు. శ్రీదాదాగారు వెంటనే ఆశాలువను తన అగ్నిగుండములో పడవేసి బూడిదచేశారు. తాను సమర్పించిన విలువైన శాలువ ఆవిధంగా అగ్నిపాలవడంతో ఆశేఠ్ చాలాబాధపడి నిష్టూరంగా మాట్లాడాడు. వెంటనే శ్రీ దాదాగారు మండుచున్న అగ్నిగుండంలో చెయ్యిపెట్టి యధాతధంగా ఆ శాలువను చెక్కుచెదరకుండా తీసి ఆ శేఠ్‌కిచ్చి "భక్తిశ్రద్ధలతో సమర్పించిన రెండుపైసల వస్తువైననూ మాకు అమూల్యమైనదే. భక్తిలేక సమర్పించిన వస్తువుమాకక్కరలేదు" అని బోధించారు. మన భక్తివిశ్వాసాలకు జీవము పోయుటకే శ్రీ దాదాగారిలీలలు ప్రదర్శిస్తున్నారని జనులందరూ శ్రీ దాదాగారికి ప్రణమిల్లారు.



గనగనమండే మంటలో చేయిపెట్టి బంగారు ఇటుకను సృష్టించిన మహనీయునకు సాధ్యముగాని దేమున్నది. నిస్సహాయురాలైన ఒక పేదరాలు తన కుమార్తె వివాహానికి బంధువులెవ్వరూ ధన సహాయం చేయలేదని శ్రీ దాదాగారుతప్ప తనకు వేరుదిక్కులేదని మొరపెట్టుకున్నది. "దయామయియైన శ్రీ నర్మదామాత నీకు ధన సహాయముచేయగలదు. నీవామెయొద్దకువెళ్ళు" అని శ్రీ దాదాగారు అజ్ఞాపించారు. ఆమాటయందు విశ్వాసముంచి ఆపేదరాలు నర్మదానదియొద్దకు వెళ్ళింది. ఆనదినీటినుండి ఒకదివ్యస్త్రీమూర్తి హస్తమొకటి పైకివచ్చి ఆ పేదరాలికి ఐదువందలరూపాయల నోట్లకట్టను ప్రసాదించింది. అవధులులేని ఆనందంతో ఆ పేదరాలు తనకుమార్తె వివాహాన్ని ఎంతో వైభవంగా జరుపుకొన్నది.

తప్పిపోయిన తనబిడ్డలను అనేక నిదర్శనాలద్వారా దివ్యానుభవాలు ప్రసాదించడంద్వారా తమ సన్నిధికి తెచ్చుకోవడం మహాత్ములందరికీ అలవాటే. శ్రీ దాదాగారి ఆశ్రమంలో నిత్యం భారీఎత్తున జరిగే షడ్రసోపేతమైన అన్నసంతర్పణ అజ్ఞానులకొక గొప్ప అద్భుతమైన దివ్యలీలే. కారణం వారి ఆశ్రమానికి మాన్యాలులేవు, భక్తులనుండి భారీఎత్తున ఆహారధాన్యాలుకూడా రావడంలేదు. మరి ఈ అన్నదాన మెలా జరుగుతుంది ? ఇది బ్రిటిష్ అధికార్లకు కొరకరాని సమస్యగా తయారైంది. ఒక బ్రిటిష్ అధికారి శ్రీ దాదాగారిని సమీపించి "మీరంతా గదర్ నుంచి పారిపోయి వచ్చిన దొంగలు. లేకుంటే మీరీ అన్న సంతర్పణ ఎలాచేయగల్గుచున్నారు." అని నిలదీశాడు. వారి ఆరోపణలన్నియు నిరాధారములనియు, తామంతా నర్మదామాత అనుగ్రహం వలననే ఆకార్యక్రమాలన్నీ చేయగల్గుచున్నామనియు శ్రీ దాదాగారు తెలిపారు. నర్మదామాత అనుగ్రహాన్ని మాటలతో గాక ప్రత్యక్షముగ నిరూపించమని ఆబ్రిటిషు అధికారి వెుుండికేశాడు. పరమదయానిధియైన శ్రీ దాదాగారతనిని నదిలోకి తీసుకపోయి తనరెండు చేతులను నదిలోని నీటిలోనికి మణికట్టువరకు పోనిచ్చి రెండు బంగారు నాణెముల సంచులు

తీసి ఆ అధికారి కిచ్చారు. కానీ ఆఅధికారి నమ్మక "ఆసంచులు నీ విది వరకే నీటిలో ఉంచి ఇప్పుడు తీశావు" అని అన్నాడు. శ్రీ దాదాగారు ఆ అధికారి కోరిన చోటికి అతనిని పడవలో తీసుకవెళ్ళి ముందుగా నదిలో పరీక్షించుకోమని చెప్పి - అంతకుముందు వలెనే మరలా రెండు బంగారు నాణెముల సంచులు నీటి నుండి తీశారు. అంతటితో ఆ అధికారి శ్రీదాదాగారి భక్తుడై ఆశ్రమ నిర్వహణకు గాను ప్రతినెలా కొంత పైకమును తన ఖజానానుండి పంపుటకు శాశ్వతంగా ఉత్తరువులు జారీచేసి శ్రీ దాదాగారి ఎడల గౌరవచిహ్నముగా తామ్రపత్రము సమర్పించి శాశ్వతంగా శ్రీ దాదాగారి భక్తుడయ్యాడు.

సద్గురుని ఆజ్ఞలను ప్రేమతోను విశ్వాసముతోను పాటించిన వారికి మోక్షము కరతలామలకమని శాస్త్రవాక్యం. శ్రీగురుని మాటలను ఆజ్ఞలుగా భావించి ఆచరించి తరించిన వారిలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రులవారి శిష్యులు శ్రీ శిద్దయ్య సుప్రశిద్ధులు. గుర్వాజ్ఞమేరకు కుళ్ళిన కుక్క డొక్కలోని నీరు త్రాగిన ఘనత వారికే దక్కింది.

ఒకరోజు చచ్చిన ఈగలు పడియున్న పానకము త్రాగమని శ్రీ దాదాగారు పానకపు పళ్ళెమును భాస్కరానంద్ గారి నోటికందించెను. ఈగలను చూచి అనుమానించుచున్న భాస్కరానందునితో "ఇది యాలక్కాయ పానకము త్రాగుము" అని శ్రీ దాదాగారాజ్ఞాపించారు. గుర్వాజ్ఞలయందు అచంచల విశ్వాసముగల భాస్కరానంద్ ఆపానకము త్రాగునప్పుడతని నోటిలోనికి వచ్చిన ఈగలను చేతిలోనికితీసుకొని చూడగా అవన్నీ యాలక్కాయలుగా ఉండడంచూచి భక్తులందరూ ఆనందాశ్చర్యములను ప్రకటించుచూ శ్రీ దాదాగారిని స్తుతించారు.

ఒకరోజు తప్పిపోయిన తనబిడ్డకోసం మూడు రోజులుగా వెతికి వేసారిన దంపతులు శ్రీ దాదాగారిని తమ బిడ్డ ఆచూకి చెప్పమని ప్రార్థించారు. "నీయక్కా మూఢు లారా! బిడ్లను కనుట మీవంతు వెతుకుట మావంతా?" అని శ్రీ దాదాగారు తరిమికొట్టినా వినిపించుకొనక వారామహనీయుని పాదములపైబడి విలపించసాగారు. కరుణా మయుడైన శ్రీ దాదాగారు వారికన్నీటికి జాలిచెంది "నీ బిడ్డ వంతెన మీద



ఉన్నాడు పొమ్మని" పలికారు. వారావంతెన మీదుగా అప్పుడే వచ్చారు. కాని వారిమాట ప్రకారం పోయి చూడగా నిజంగానే వారిబిడ్డ అక్కడున్నాడు. బిడ్డను తీసుకవచ్చి శ్రీ దాదాగారికి కృతజ్ఞతతో ప్రణమిల్లారు.

శ్రీ దాదాగారితో చనువుగల మదన్‌మోహన్‌గారు "ప్రభూ! బిడ్డవంతెనమీద ఉన్నదని మీకెలా తెలిసింది?" అని ప్రశ్నించాడు. అందుకు శ్రీ దాదాగారు "ఓరీ! నీవుకూడా మూర్ఖుడవే. వాణీసిద్ధి మాకు గలదని నీకు తెలియదా? ఇరవైనాల్గుగంటలూ సరస్వతి మా నాలుకపైననే ఉంటుంది. మా ఆజ్ఞప్రకారమే సర్వమూ జరుగుతుంది. ప్రకృతికూడా మా ఆజ్ఞలననుసరించ వలసిందే" అని చెప్పారు. సృష్టేతామైన సద్గురువుల కసాధ్యమేముంటుంది?.

శ్రీ కల్పనాథ్, గారికి అరవైసంవత్సరముల వయసులో ఐదుగురు ఆడ పిల్లలు. తర్వాత మగసంతానం శ్రీ దాదాజీగారి అనుగ్రహముతో కలిగి పెద్దవాడైనాడు కొన్నాళ్ళ తరువాత శ్రీ కల్పనాథ్ గారికి పిచ్చిపట్టింది. శ్రీ దాదాజీగారి కృపవలన వారి పిచ్చినయమైంది. ఆ సద్గురు భక్తుడు వెంటనే వాలంటరీ రిటైర్‌మెంటు తీసుకొని ఉద్యోగమిరమణ చేసి ఆజన్మాంతము శ్రీ దాదాజీ సేవలో ఉంటూ భాండ్వాలోని శ్రీ చాముండేశ్వరీ దేవాలయ పూజారిగా గడిపి శ్రీ దాదాజీగారి దివ్యచైతన్యములో ఐక్యమయిన ధన్యజీవుడు. ఉద్యోగ విరమణ, శ్రీ దాదాగారిసేవ ఆజన్మాంతం చేయడం ఎంత ఉత్తమమైనవో పాఠకులే ఊహించుకోవలసినదే.

కృతజ్ఞతా భావమెలా ఉండాలో నేర్పేదే ఈ నిత్యానందస్వామి గారి అనుభవం వీరొక కేసు విషయంలో కోర్టుకు వెళ్ళారు. ఆకేసులో అతను నిర్దోషిగా నిరూపించబడడం అసంభవమని లాయర్లందరూ ముక్తకంఠంగా పలికారు. కానీ నిర్దోషియైన నిత్యానందస్వామిగారు శ్రీ దాదాగారి పాదాలపైబడి తనను రక్షింపమని కన్నీరుగార్చారు. నిత్యానందగారిని జడ్జిమెంటురోజు కోర్టుకు పోకుండా తనదర్బారులో ఉంచుకున్నారు. విచిత్రంగా కేసు నిత్యానందగెలిచి నిర్దోషి అని జడ్జిమెంట్ చెప్పారు. మరునాడు నిత్యానంతగారు వెళ్ళి తన లాయరుకు జడ్జిగారికి తాను జడ్జిమెంటుకు కోర్టుకు హాజరుకాలేనందుకు క్షమాపణచెప్పారు.

వారిలాయరు, జడ్జిగారు కూడా "నీవు నిన్నవచ్చి రికార్డులో సంతకం చేశావుగదా! మరిరాలేకపోయానంటావేమిటి" అన్నారు. తనరూపంలో శ్రీ దాదాగారే కోర్టుకు వచ్చారని గుర్తించిన నిత్యానంద జీవితాంతం లోకం వదలి శ్రీ దాదాజీగారి సేవలో ఉన్నారు.

గర్వం ఎన్ని రకాలుగా ఉంటుందో చెప్పలేము. శ్రీ సాయిచరిత్రలో బీమాజీ బలగర్వము, మేఘాగారి కులగర్వము, చందోర్కర్ గారి విద్యాగర్వము, కర్టిన్‌గారి అధికార గర్వము, కుశాభావు ఆచారగర్వము, హరికనోబా ధన గర్వము, హాజీ యాత్రా గర్వము, రోహిల్లా శక్తి గర్వము దాసగణు భక్తి గర్వము, సోమదేవ స్వామి సదాచారగర్వము చూస్తాము. అక్కల్‌కోటస్వామి వారి చరిత్రలో రాజుగారి పదవీ గర్వము, ఐశ్వర్యగర్వమూ చూస్తాము. శ్రీ వేంకయ్యస్వామి వారిచరిత్రలో ఒకరాజకీయ నాయకునకు గలకీర్తిగర్వము వలన శ్రీ స్వామివారిని తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తే - వచ్చేందుకు వీలులేదయ్యా, దోవలో ముండ్ల మండలు నాటి ఉన్నాయి. అని అనేకసార్లు తిరస్కరించారు. కానీ నిరుపేద అయిన కలిచేడు ఈశ్వరమ్మ సమర్పించే చక్కెర నీళ్ళే వారు అమృత సమానంగా స్వీకరించారు. గనుక ఈ గర్వం ఎంత బలవత్తరంగా ఎన్నివిధాలుగా మహనీయుల కృప మనకందకుండా చేస్తుందో చూడండి.

ఒకసారి మైహర్ ప్రాంతరాజు ప్రభుత్వ లాంఛనాలతో శ్రీ దాదాజీగారి దర్శనానికి వచ్చారు. వారిని చూస్తూనే శ్రీ దాదాజీగారు తన చేతిలోని కర్రను రాజుపైకి కోపంతో విసరికొట్టారు. వారిని తనముందు ఉండవద్దని తిడుతున్నారు. వెంటనే మంత్రివర్యులు తన పిస్టలుతో శ్రీదాదాజీగారిని కాల్చారు. ఆశ్చర్యం - పిస్టలులో ఒక్కగుండుకూడా లేదు. శ్రీ దాదాజీగారి మనుషులు ఆరాజును వారి అనుచరులను శ్రీ దాదాజీగారి దర్బారు నుండి తరిమి వేశాక శ్రీ దాదాజీగారు శాంతించారు. శ్రీ దాదాజీగారు ప్రత్యక్షదైవమే అయినా రాజుగారి అధికార గర్వంవారిని శ్రీ దాదాజీగారికి దూరంచేసింది. ఎలాంటి గర్వమూ మనకు సోకుండా చేయమని శ్రీ దాదాజీగారిని హృదయపూర్వకంగా ప్రార్థిద్దాం.



శ్రీ షామాగారికి పాముకరిచి మసీదుకు వస్తే బాబాగారు వారిని మసీదు మెట్లుదిగి పొమ్మని కసిరికొట్టారు. షామా మెట్లు దిగగానే అతని విషందిగింది. సివానీ నివాసి సురేంద్రనాథ్ బెనర్జీ అనుభవం ఇలాగే ఉంది. వీరి ఐదుసంవత్సరాల కుమారునికి జబ్బు ఏమిటో డాక్టర్లకు అంతుబట్టలేదు. వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. శ్రీ దాదాజీగారిని గూర్చి విని తన బిడ్డను శ్రీ దాదాజీగారి సన్నిధికి తీసుకపోయాడు. శ్రీ దాదాజీగారు వారిని తిరిగి సివానీ వెళ్ళమని ఆజ్ఞాపించారు. బిడ్డ ఆరోగ్యవిషయం ఏమీ చెప్పలేదు. బెనర్జీగారు మారుమాట్లాడకుండా తిరిగి స్వగ్రామం వెళ్ళిపోయాడు. డాక్టరుగారు వచ్చి ఆబిడ్డ ఆరోగ్యం బాగుచేస్తారని శ్రీ చిన్నదాదాజీగారు చెప్పిపంపారు.

రెండు రోజుల తర్వాత చిన్నదాదాజీగారి వద్ద ఉన్న డాక్టరుగారిని హిందీ మూలంరచయిత సుల్కర్ గారిని శ్రీ బెనర్జీగారింటికి పంపారు. డాక్టరుగారా బిడ్డకు శ్రీ దాదాజీ గారిని స్మరించి మట్టి మాత్రమే స్వల్పంగా తినిపించారు. చిత్రాతి చిత్రంగా ఆ బిడ్డ ఆరోగ్యం క్రమంగా బాగైంది. శ్రీ బెనర్జీగారు ఎంతో కృతజ్ఞతతో ఆ డాక్టరుగారిని సుల్కర్ గారిని ఒకనెల రోజులు తన ఇంటిలోనే ఉంచుకొని శ్రీ దాదాజీ గారికి పూజలు చేయించి వేలాదిమంది భక్తులకు తీర్థప్రసాదాలిప్పించెను. శ్రీ బెనర్జీ గారి బిడ్డకు ఆరోగ్యం చేకూరుటకు కారణం మట్టికాదని అదికేవలం శ్రీ దాదాగారిపై వారికిగల విశ్వాసమేనని వేరేచెప్పనక్కరలేదుగదా. విశ్వాసం కొండలను కదలిస్తుందంటే ఇదే కాబోలు!.

కలకత్తా నివాసి బసుబాబు డాక్టర్లకు అంతుబట్టని వ్యాధితో చాలాకాలం బాధపడ్డాడు. వైద్యుల ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. స్నేహితుల సలహాలపై శ్రీ దాదాజీగారి సన్నిధిచేరాడు. శ్రీ దాదాజీగారతనిని తసకృపా దృష్టితో అనుగ్రహించి అతనికి రొట్టె, అన్నం, తీర్థము ఇచ్చి పంపుతున్నారు. ఆ విధంగా అతడు బాబా సన్నిధిలో కొన్నాళ్ళు ఉండగానే అతని వ్యాధి మటుమాయమవడమేగాక అతడు గొప్ప వస్తాదువలె బలిష్టుడయ్యాడు. ప్రేమ, కృతజ్ఞతాభావాలకు చిహ్నాముగా అతడు శ్రీ దాదాజీగారి సన్నిధిలో 18 మణుముల బరువుగల గంటను ఏర్పాటు

చేశాడు. ఇతని కొమారుడు భారతరైల్వేలో పనిచేసేవాడు. బసుబాబు తన జీవితమంతా శ్రీ దాదాజీగారి సేవలో గడిపి వారి పాదాలలో ఐక్యమైనారు. వారి గౌరవార్థం శ్రీ చినదాదాజీగారు రెండువేల లడ్లు పంచిపెట్టారు. శ్రీ దాదాజీగారి కృపకు పాత్రుడైన బసుబాబు ధన్యులు "కష్టాలు గూడా అనుగ్రహానికి గుర్తు" అని ఆచార్య భరద్వాజగారు చెప్పిన మాట శ్రీ బసుబాబుగారి ఎడలసత్యమైంది.

శ్రీ దాదాజీగారి దివ్యలీలలు అనంతములు. వారలా ఎందుకు చేస్తున్నారో తెలుసుకొనడం మానవులకు వీలు కానేకాదు. ఒకరోజు టెంకాయ పగులగొట్టి కొబ్బరి తింటున్నారు. ఒక కొబ్బరి ముక్క శ్రీ దాదాజీగారి కంఠనాళములో ఇరుక్కున్నది. గొంతు మూసుకపోయింది. మూడురోజులు మాటలాడడం, అన్నపానీయాలు స్వీకరించడం వంటివి చేయలేక పోయారు. ప్రతిదీ సైగలతోనే చేయిస్తున్నారు. నాలుగవరోజు భక్తులు శ్రీ దాదాజీగారి పరిస్థితిచూచి భరించలేక డాక్టరుగారిని తీసుకవచ్చారు. శ్రీ దాదాజీగారు డాక్టరుగారిని దూరముగా ఉండమని సైగలుచేశారు. డాక్టరుగారు దూరముగా జరుగగానే శ్రీ దాదాజీగారు పెద్దగా దగ్గారు. వెంటనే కొబ్బరిముక్క గొంతులో నుండి నోటిద్వారా బయటపడింది. భక్తులందరి బాధ నివారణైంది. అరలీటరు పాదరసం త్రాగి కొంతకాలం తర్వాత తన తొడగుండా తెప్పించిన శ్రీ దాదాజీగారు కొబ్బరిముక్క గొంతులో ఇరుక్కొని బాధపడడమేమిటో ఎవ్వరికీ అర్థంకాలేదు. ఏ భక్తుని బాధ నివారించేందుకు అలాచేశారో ఎవరూహించగలరు?.

సాయిభేడాలో టుండేలాల్ అనే వారికి రెండు సంవత్సరాల పాపఉండేది. ఆ పాప మెదడులో భయంకరమైన పుండులేచి బయటకుకూడా వ్యాపించింది. బిడ్డ భరించరాని బాధ అనుభవిస్తుంది. పేరుమోసిన డాక్టర్లంతా విఫలమయ్యారు. చివరకు వారు ఆపరేషన్ తప్ప వేరే మార్గమే లేదని తీర్మానించారు. ఆ బిడ్డను అమ్మగారింటికి తీసుకపోయి ఆపరేషనుకు ఏర్పాటు చేశారు.



టుండేలాల్ గారు ఆపరేషన్‌కు అంగీకరించలేదు. ఆ బిడ్డను తెచ్చి శ్రీ దాదాజీగారి పాదాల వద్ద ఉంచి తన బిడ్డను రక్షించమని కన్నీటితో ప్రార్థించాడు. పరమదయాళువైన శ్రీదాదాజీగారు "ఒక పిడికెడు ఉధీ అగ్ని హోత్రమునుండి తీసి ఆ బిడ్డతలకు కట్టమని" ఆజ్ఞాపించారు. వారలాచేయగానే ఆ బిడ్డ ప్రాణం బాధనుండి వెంటనే విముక్తిపొంది ఆరోగ్యం పొందింది. ఈ విచిత్రం చూచిన భక్తులంతా ఆశ్చర్యానందాలతో తేలియాడారు.

ఇదే విధంగా టుండేలాల్ మరదలు బహిష్టుకు సంబంధించిన మైల జబ్బుతో బాధపడుతుండేది. పై లీల చూచిన అబంధువులు శ్రీ దాదాజీ గారిని అశ్రయించి శ్రీ దాదాజీగారికి పూజచేసి ఆమెబాధ విన్నవించుకున్నారు. శ్రీ దాదాజీగారి కృపతో ఆమె బాధ నివారణై శ్రీ దాదాజీగారి భక్తులైనారు.

ఒకరోజు బెంగాల్ నుండి ఒకగొప్ప పండితుడు శ్రీ దాదాజీగారి పాదముల నాశ్రయించి "చాలాకాలమునుండి అజీర్ణ వ్యాధి సంక్రమించినది. ఏమి తినినా అరగదు. వైద్యాలన్నీ విఫలమయ్యాయి ప్రభూ" అని మొరపెట్టుకున్నాడు. వెంటనే శ్రీ దాదాజీగారు అతనికి ఒకరొట్టె తినిపించి అతని బట్టలన్నీ తీయించి నగ్నశరీరంతో శ్రీ చిన్నదాదాగారి దగ్గర ఉండమని పంపించారు. అక్కడతడు కొన్నాళ్ళు ఉన్నాడు. శ్రీ చిన్నదాదాగారి దగ్గర నిత్యం అతడు ఒకటింకాలుకిలో గులాబ్‌జాం తినేవాడు. గులాబ్‌జాం అంతా శ్రీ దాదాజీగారికి నైవేద్యం పెట్టినదే. గనుక అనతికాలంలో ఆపండితుని అజీర్ణరోగం అదృశ్యమై అతడు చాలా బలిష్టముగా తయారయ్యాడు.

ఒకరోజు శ్రీ దాదాగారు రోడ్డుకడ్డంగా నేలపై పడుకొనియున్నారు. ఆ మార్గాన పోవుచున్న ధాన్యపుబండ్లవారు ఎంతచెప్పినా శ్రీ దాదాగారు లేవలేదు. వారిని ప్రక్కకు లాగాలని ఎంతమంది కలసి ప్రయత్నించినా వారిని ఒక్క అంగుళముకూడా కదిలించలేకపోయారు. అప్పుడు మిగిలిన బండ్లవాళ్ళు కూడా కలసికోపముతో శ్రీ దాదాగారిని కొట్టేందుకు వచ్చారు. "మీబండ్లు ఎలాకదులుతాయో నేనూ చూస్తాను" అంటూ శ్రీ దాదాగారు

దూరముగా వెళ్ళి పోయారు. కానీ ఆబండ్లలో ఒక్కటికూడా ఒక్క అంగుళమైనా ఎంత ప్రయత్నించినా కదలలేదు. ఆ బండ్ల వాళ్ళంతా వెళ్ళి ఆగ్రామ భూస్వామికి పరిస్థితి విన్నవించారు. అతడుకూడా మరికొందరు మనుషులను తీసుకవచ్చిబండ్లు లాగే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. అప్పుడా భూస్వామి శ్రీ దాదాగారికి బండ్లవారికి జరిగిన సంవాదమంతా విని శ్రీ దాదాగారిని ప్రార్థించి వారినివెతుకుతూ వెళ్ళాడు. శ్రీ దాదాగారు తన ఇంటి కప్పుపై కూర్చొని ఉండుటచూచి భూస్వామి అనేక విధముల వినయముతో శ్రీ దాదాగారిని ప్రార్థించాడు. అతని వినయానికి సంతసించిన శ్రీ దాదాగారు "మీ బండ్లు మీరు లాక్కుపొండయ్యా" అని ప్రేమగా పలికారు. అప్పుడు బండ్లు కదిలిస్తే అవి ఎంతో సులభంగా కదిలిపోసాగాయి. అందరూ భక్తితో వినమ్రులై శ్రీ దాదాగారికి హృదయపూర్వకముగా నమస్కరించారు.

భోపాల్ నివాసియైన చింతామన్ శేట్‌గారి భార్య యొక్క ప్రేత బాధను బాపుట. శేట్‌గారి భార్యకు భూత మావహించినందున ఎన్నో వైద్యాలు చేయించారు. కానీ ఆభూతం మాత్రం ఆమెను విడిచిపోలేదు. చివరకు మిత్రుల సలహాపై వారు సాయిఖేడా వెళ్ళాలని తలచినా అదికుదరలేదు. ఒకరోజు శ్రీ చిన్నదాదాగారు వాళ్ళ ఇంటిలోని ఉయ్యాలపై కూర్చొని దర్శనమిచ్చి తనపేరు హరిహర భోలే భగవాన్ ఉరఫ్ చిన్నదాదాగారని చెప్పి ఆమెను సాయిఖేడా తీసుకవచ్చినట్లయిన ఆమె ఆరోగ్యం బాగుకాగలదని చెప్పి అంతర్ధానమయ్యారు. వారి ఆజ్ఞానుసారం ఆమెను సాయిఖేడాకు తీసుకవచ్చారు. అక్కడకు రాగానే "ఇన్నాళ్ళ ఈమెను బాధించావు. ఇక ఈమెను వదలి వెళ్ళిపో అని అరుస్తూ శ్రీ పెద్దదాదాగారు ఆమెను తనకర్రతో కొట్టసాగారు. ఆమె క్రిందపడి "నాకు మోక్షమిప్పించండి. వెళ్ళిపోతున్నానని" ఏడవసాగెను. ఒకబిందెడు నర్మదా జలంఆమెపై పోయించారు. వెంటనే ఆమె శ్రీ దాదాజీగారి కాళ్ళపైబడి మోక్షమిమ్మని ఏడ్వసాగింది. శ్రీ దాదాగారు ఆమెకొక మామిడి పండు



ప్రసాదించి తినిపించారు. అదిమొదలు ఆమెకా గ్రహబాధ శాశ్వతంగా నివారణైంది. ఆతర్వాత చింతామన్ శేట్ గారికి ఒక మగ బిడ్డను కూడా ప్రసాదించారు.

జబ్బల్‌పూర్‌లోని గుల్వారియాసేట్ శ్రీ దాదాగారి సన్నిధిలో కొన్నాళ్ళుండి తాను ఏవ్యాపారము చేస్తే బాగా డబ్బు సంపాదించగలనో తెల్పమని ప్రార్థించాడు. శ్రీ దాదాజీగారు బుక్కాపొడి వ్యాపారం చేసుకోమని సెలవిచ్చారు. ఆ వ్యాపారి జబల్‌పూర్ వెళ్ళి బుక్కాపొడికొని నిల్వచేశాడు. కొద్దిరోజులకు బుక్కాపొడి ధర విపరీతంగా పెరిగింది. గనుక అతనికి ఆవ్యాపారంలో నాలుగులక్షల రూపాయలు లాభమొచ్చింది. అతడు కృతజ్ఞతాభావంతో శ్రీ దాదాజీగారిని దర్శించి తన లాభాలను గూర్చి తెల్పివారికేదైనా సేవ చేసుకునే భాగ్యం కల్గించమని వేడుకున్నాడు. శ్రీ దాదాజీగారి ఆజ్ఞమేరకు అతడు ఆరోజులలోనే ఒక లక్షరూపాయలు వ్యయంచేసి ధర్మశాల కట్టించాడు. ఈ ధర్మశాల నేటికీ సాయిఖేడాలో యాత్రికులకు ఉపయోగపడుతుంది.

రాయ్‌పూర్‌లో గోపీకిషన్ అనే వారు గొప్ప బియ్యపువ్యాపారి. వారొకసారి నలభైవేల రూపాయల బియ్యం విదేశాలకు నౌకలో ఎగుమతి చేస్తుండగా అనౌకలు నీటిలో మునిగి పోయాయి. ఆయన ప్రభుత్వం నుండి తీసుకున్న ఋణం తీర్చలేక చాలా బాధలకు గురి అయ్యారు. వీరు శ్రీ దాదాజీగారిని శరణు వేడారు. "నీవు ఇంటికి వెళ్ళి చెక్ తీసుకోపో' ' అని కరుణామయులైన శ్రీ దాదాజీగారు అభయమిచ్చారు. అతడు ఇంటికి చేరేసరికి తన నలభైవేల రూపాయలు చెక్కు రూపంలో వచ్చివుంది. బియ్యం సముద్రం పాలైతే తనకు డబ్బెలా వచ్చిందో అతనికి తెలియలేదు. గోపీకిషన్ గారు మాత్రం ప్రభుత్వం నుండి ఋణవిముక్తులయ్యారు. మిఠాయి బిల్లుపైకం బండక్రిందనుంచి తీసి ఇచ్చిన శ్రీ దాదాజీగారి కిలాంటి చెక్కులొకలెక్కా?. నర్మదా నదిలో నుండి బంగారు నాణాలు తీసి బ్రిటిషు అధికారి కిచ్చి వారిని దాసోహంచేసుకున్న మహనీయులు చేయరానిదేముంటుంది.

## యోగనాధుడు

అయస్కాంత సంపర్కము వలన ఇనుము తాత్కాలికంగాను, ఉక్కుముక్క శాశ్వతంగాను అయస్కాంత తత్త్వం పొందుతాయి. ఉక్కుముక్క కూడా అదిఎంత పరిశుద్ధంగా వుటే అంతచక్కగా అయస్కాంత తత్త్వం పొందుతుంది. అలాగే మహనీయుల సన్నిధిలో సాధకులు వారివారి పరిపాకాన్ననుసరించి పరిణతి చెందడం చూస్తాము. సద్గురువులు సర్వజ్ఞులుకనుక, మన అభ్యర్ధనతో నిమిత్తం లేకుండానే చేయూత నిచ్చి మనలను సాధనలో సాధ్యమైనంత పైస్థితికి తీసుకుపోతారు. గనుకనే శ్రీ వెంకయ్యస్వామి వారు, "మైసూరు మహారాజావారు కనిపిస్తే మాత్రం లాభం ఏముందయ్యా? మనం చేసుకొన్నదే గదామనకు" అని సెలవిచ్చారు. గనుక మనం కష్టించి సాధనచేసి అర్హత సంపాదిస్తే శ్రీ దాదాజీలాంటి మహనీయులెలా మనలననుగ్రహించి ఉన్నత స్థితి ప్రసాదిస్తారో మనమిప్పుడుచూస్తాము. మనజాతకం! వ్రాత, విధిలో వుంటేనే సాధన జరుగుతుందని భ్రమించేవారంతా బుద్ధిహీనులు, సోమరులని వశిష్ఠ గీతలో వశిష్ఠులవారు చెబుతారు.

ఒకరోజు శ్రీ దాదాగారు విశ్రాంతి తీసుకొనుచుండగా టుకడో అను సాధువు కంజరివాయించుచు, "దయానిధీ మీకు పేద, ధనికులను బేధము లేదు. నాపై కరుణించి, లేచి ఈ దీనునికి దర్శన భాగ్యము ప్రసాదించండి." అనుభావము గల పాటపాడాడు. వెంటనే దాదాగారు ఆ భక్తునికి 'పపీతా" అను పండు ముక్కను ప్రసాదముగా నిచ్చి ఆశీర్వదించారు. టుకడోగారు ఆ ముక్కను హరిహర భగవానులకు కొంత పెట్టి తాను కొంత తిన్నాడు. హరిహర భగవానులు అతడిచ్చిన పపీతా ముక్కకు బదులు కిరిణీ ముక్క కొంత ఆసాధువుకు ప్రసాదించారు. ఆ ప్రసాదం తిన్న తరువాత అతడు గొప్ప సత్ పురుషుడుగా రూపొంది ప్రఖ్యాతి గాంచాడు.



సిద్ధహస్తుడైన ఒకయోగి శ్రీ దాదాగారిని సాయిఖేడాలో దర్శించారు. ఈ యోగి పుంగవునకు ఒకానొక యోగ ప్రక్రియ సిద్ధికాలేదు. అందుకే వారనేక మంది పేరు గాంచిన యోగులను సిద్ధపురుషులను దర్శించారు. కాని అందరి దగ్గరా నిరాశ మాత్రమే మిగిలింది. తనకోరిక శ్రీ దాదాగారికి విన్నవించడానికాతనికి ధైర్యము చాలలేదు. నిస్సహాయంగా శ్రీ దాదాగారి సన్నిధిలో కూర్చొని యున్నాడు. రాత్రి పదకొండు గంటలప్పుడు శ్రీ దాదాగారు యోగికాలిపై గట్టిగా చరిచాడు. వెంటనే ఆయోగి తన్మయత్వంతో, "సిద్ధికల్గింది, సిద్ధికల్గింది" అని బిగ్గరగా అరచి గంతులు వేయసాగాడు. కొద్ది సేపటికి స్థిమిత పడి హృదయ పూర్వకమైన భక్తి విశ్వాసాలతో శ్రీ దాదాగారికి ప్రణమిల్లి సెలవుగైకొని వెళ్ళాడు.

చెట్టు యొక్క గొప్పతనం అదిచ్చే పండ్ల యొక్క మాధుర్యాన్ని బట్టి నిర్ణయిస్తాము. అలాగే మహనీయుల యొక్క గొప్పతనం వారిద్వారా రూపొందించబడ్డ సిద్ధపురుషుల మూలంగా గణించబడుతుంది. శ్రీ దాదాగారి ద్వారా తీర్చిదిద్దబడ్డ మహనీయులలో నిత్యానంద్ మహరాజ్ ఒకరు. వీరెంతటి గొప్పవారో ఈ క్రింది లీలద్వారా తెలుస్తుంది.

పొట్ట ఉబ్బి, పాలుత్రాగలేక కొద్ది క్షణాలలో చనిపోతుందని ఆశ లొదిలేసిన ఒక పసిబిడ్డను ఒక బుట్టలో పెట్టుకొని దుఃఖిస్తూ నిత్యానంద్ మహరాజ్ గారి యొద్దకు తెచ్చారు. నిత్యానంద్ మహరాజ్‌గారు ఆ బిడ్డచెంత కూర్చొని, "మహరాజ్! పాలుత్రాగండి" అని లాలనగా చెప్పారు. కాని బిడ్డ పాలు త్రాగలేదు. ఇదే విధంగా నిత్యానందులవారు మరిరెండు సార్లు చెప్పిచూచినాగాని ప్రయోజనంలేక పోయింది. వెంటనే వారాబాలుని ఒక లెంపకాయకొట్టారు. బాలుడు ఉలిక్కిపడి తల్లిదగ్గర పాలు త్రాగమొదలుపెట్టాడు. తర్వాత నాలుగు గంటలలో బిడ్డ సంపూర్ణంగా ఆరోగ్యవంతుడయ్యాడని గుర్తించి ఆ బిడ్డడితల్లి నిత్యానంద్ మహరాజ్‌గారి పాదములపైబడి నమస్కరించి తనకృతజ్ఞతను తెలుపుకొన్నది.

ఇట్టి సిద్ధపురుషులను అనేక మందిని తయారుజేసి నేటికి వీరు తన సమాధి నుండి ముముక్షువులకు అనేక విధములుగ వెలుగుబాటను చూపి అనుగ్రహిస్తున్నారు.

అష్టసిద్ధులు సద్గురువులకు దాస్యము చేస్తాయి. ఆ సిద్ధులలో దూరశ్రవణ మొకటి. సిద్ధ పురుషులు సుదూర వార్తలు ఏయంత్ర సహాయము లేకుండానే వినగల్గుటయే గాక, కోరిన వారందరూ కూడా ఆ మాటలు వినగలిగేటట్లు చేయడం గొప్ప చమత్కారము గాదా! 1929వ సం॥లో శ్రీ దాదాగారు సాయిభేడాలోని భక్తులతో, "ఎవడో పిచ్చివాడు సముద్రపుఒడ్డున ఎమో వాగుచున్నాడు. ఆ పందిరి స్తంభమునకు చెవి ఆనించి విన"మనిరి. గజరాజ్ సింహుడను భక్తుడే గాక అక్కడ వున్నవారందరూ అచ్చటికి 500 మైళ్ళ దూరములోగల బొంబాయిలో గాంధీ మహాత్ముడు చేయుచున్న ఉపన్యాసమును ఆవందిరి స్థంబములో విని శ్రీ దాదాగారి దివ్యమహిమకు ఆశ్చర్యచకితులయ్యారు.

ఒకరోజు తనను పూజించుచున్న ఒక భద్రమహిళను "మీ ముక్కు పుడక కొంచము మాకివ్వండి" అని అడిగారు. వారడిగి నదే మహాభాగ్యమని ఎంతో ప్రేమతో ఆమె తన ముక్కు పుడకను శ్రీ దాదాగారికి సమర్పించింది. శ్రీ దాదాగారు ఆ ముక్కు పుడకను తీసుకొని తన అగ్నిగుండములో పారేశారు. ఆమె ఇంటికి వెళ్ళునప్పుడు శ్రీ దాదాగారామెకొక టెంకాయ ప్రసాదించి ఇంటికి వెళ్ళి తినమని చెప్పారు. ఆమె ఇంటికి వెళ్ళి టెంకాయ కొట్టినప్పుడు దాని నుండి విలువైన ముక్కుపుడక క్రిందపడింది. ఆ అద్భుతమును గాంచిన మహిళలందరూ శ్రీ దాదాగారి కృపకు అబ్బురు పడ్డారు.

ఇది చూచి మరునాడొక వనిత శ్రీ దాదాగారి సమీపమున నిలుచొని వారిదృష్టిని తన ముక్కుపుడక వైపు ఆకర్షించు సైగలు చేయుచుండెను. ఆమె దురాశ నెరిగిన శ్రీ దాదాగారు ఆమె ముక్కుపుడకనుగూడ తీసుకొని టెంకాయప్రసాద మిచ్చిరి. ఆమె టెంకాయ కొట్టగా కొబ్బరి తప్పమరేమీలేదు. పేరాశ ఫలితంగా ఆమె పతిదేవుడామె నేవిధంగా సత్కరించియుండునో పాఠకులూహించుకొనగలరు.

శ్రీ దాదాగారికి పిల్లలతో సరదాగా కాలం గడపడమంటే ఎంతో యిష్టం. అప్పుడప్పుడు పిల్లల గుంపుతో వెళ్ళి మిఠాయి దుకాణాలపైబడి కొల్లగొట్టి పిల్లలకు పంచేవారు. కొందరు ధూర్తులా మహనీయుని దివ్యత్వాన్ని అర్థము చేసుకోలేక కొట్టేవారు. మరికొందరు దుకాణాదారులు వినయపూర్వకంగా, "దాదాజీ మేము పేదవారము, చాలా నష్టమైంది స్వామీ" అని మొరపెట్టేవారు. పరమకారుణ్య మూర్తియైన శ్రీ దాదాగారు ఎంతో మధురంగా నవ్వి, "ఏమీ అనుకోవద్దు! మీ మిఠాయి బిల్లు పంపండి దాని ఖరీదు చెల్లిస్తాము". అని ప్రేమగా పలికి వెళ్ళేవారు. ఒకనాడు హూసన్ మార్గు వంతెన దగ్గర వున్న దుకాణాదారుడు అలాగే తన మిఠాయి బల్లతో, శ్రీ దాదాగారి మకామునకు రాగా, "ఒరేయ్ బిల్లెంత? ఆబండక్రింద పైకముంది తీసుక వెళ్ళు" అని ఆజ్ఞాపించారు. ఆ బండ క్రింద చూస్తే పైసలతో సహా సరిగ్గా మిఠాయి బిల్లుకు సరిపోయేటంత పైకమే ఉండటం ఆశ్చర్యంగదా!

నరసింగపూర్‌లో ప్రేమదాసను నిజమైన భక్తుడొకడుండేవాడు. దైవకార్యాలకు, దానధర్మాలకు తన శక్తికి మించి వ్యయం చేసి అప్పుల పాలయ్యాడు. ఒకరోజు ప్రేమదాసు చేత చాటెడు ఇసుక తెప్పించి శ్రీ దాదాగారు తన యొద్దనుంచుకొని ఆ ఇసుక నటూనిటూ కలియబెట్టుతున్నారు. మధ్యలో ఏమోగొణుగుతున్నారు. భక్తులందరూ చూస్తుండగానే కొద్దిక్షణాల్లో ఆ ఇసుకరేణువులన్నీ బంగారు నాణాలుగా మారిపోయాయి. ఆ బంగారునాణాలన్నీ ప్రేమదాసునకిచ్చి, "మూర్ఖుడా! ఇక మీదట ఎప్పుడూ అప్పు చేయవద్దని బుద్ధి చెప్పారు." ప్రేమదాసు కన్నులు ప్రేమాశ్రువులతో చెమ్మగిల్లగా శ్రీ దాదాగారి పాదములపై శిరస్సునుంచి ప్రణమిల్లాడు.

ఒకనాడు స్వామి శంకరానంద్, దివాకర్ మరికొందరు కారులో ప్రయాణం చేస్తూ జామ్ నదిని సమీపించారు. నది నిండు వరదలో యున్నందున మోటారు వాహనాలన్నీ ఇరువైపులా నిలిచివున్నాయి

స్వామి శంకరానంద్‌గారు, "మనకు దాదాగారి నుండి అనుమతి లభించింది. కారును నదిలో దింపు" అని డ్రైవరుతో చెప్పారు. కారులోని వారందరు, "నర్మదామాతకు జై! శ్రీ దాదాజీకి జై! అని ముక్తకంఠంతో అరుస్తున్నారు. కారు నది మధ్యలో మునిగి పోయింది. కారులోని వారు మాత్రం ప్రాణభీతిచే బిగ్గరగా జైకొట్ట సాగారు. ఇంతలో వారికి ఎవరో వెనుకనుండి కారును నెట్టుచు ఒడ్డుకు చేర్చి నట్లనిపించింది. సురక్షితంగా అందరూ ఆశ్రమముచేరి శ్రీ దాదాగారి అదృశ్యహస్తమును కొనియాడి, స్తుతులు చెల్లించారు.

ఒకనాడు హోషంగాబాద్ స్టేషను సమీపములో శ్రీ దాదాగారు ఒక వంతెన పై కూర్చొని, ఆ మార్గంలో పోతున్న గోపికలను పాలు, పెరుగు అడిగి తీసుకొంటున్నారు. శ్రీ దాదాగారిని పిచ్చివాడని తలచి, ఒక గోపిక స్వామివారి కేమీయివ్వకుండా చులకనభావంతో వెళ్ళిపోయింది. శ్రీ దాదాగారు కూర్చొన్నచోటు నుండి కదలకుండా తనచేతిని పన్నెండు అడుగుల పొడవుపెంచి ఆమె బుట్టలోని ముంతను తీసుకొన్నారు. ఆ కబంధ హస్తము చూచి గోపికలు భయభ్రాంతులైనారు.

కొందరు నాస్తికులు శ్రీ దాదాగారు దిగంబరులైనందున అసహ్యించుకొని కలెక్టరుగారికి రిపోర్టు చేశారు. కలెక్టరు శ్రీ దాదాగారిని జైలులో పెట్టించాడు. శ్రీ దాదాగారు, "ప్రొద్దుటి వరకూ ఎవరూ ఉండరులే'
'. అని పలికి ఊరకున్నారు. కలెక్టరుతో సహా ప్రముఖ అధికారులందరికీ బదలీ ఉత్తర్వులు తెల్లవారేసరికి టెలిగ్రాం ద్వారా అందాయి. శ్రీ దాదాగారి మహిమ విని పోలీసువారు శ్రీ దాదాగారిని, వారి శిష్యబృందమంతటిని విడుదల చేశారు.

సాయిభేడాకు పదిహేను మైళ్ళదూరంలోని సాలగ్రామ్ అను గ్రామము నుండి వచ్చిన పటేలును, ఇంటికి వెళ్ళడానికి శ్రీ దాదాగారు అనుమతి యివ్వలేదు. ఇదే విధముగా రెండు వారాలకు పైన గడిచాయి. ఒకనాటి రాత్రి పటేలును, శ్రీ ధునీమాత జలముతెమ్మని, శ్రీ దాదాగారు తొందర చేశారు. శ్రీ దాదాగారు పటేలు తెచ్చిన నీటిని అతని చేతనే తన



పవిత్ర అగ్నిగుండమందు పోయించారు. కొన్ని క్షణాలాగి రౌద్రాకారుడైన శ్రీ దాదా, పటేలు నొక్క చరుపు చరిచి తీవ్రకంఠముతో, "ఒరేయ్! పదిహేను రోజుల నుండి ఇక్కడ పడితింటున్నావు, నీయింటి పనులు నీయబ్బచూస్తాడా! వెంటనే యింటికి వెళ్ళు" అని తరిమివేశారు. ఇల్లుచేరిన పటేలు ఆనందాశ్చర్యములతో దిగ్భ్రమ చెందాడు. కారణం తన గ్రామము అగ్ని ప్రమాదమునకు గురియై అందరియిళ్ళు బూడిదరాశులైయున్నవి. కానీ తనయిల్లు, పశువుల కొట్టము మాత్రం చెక్కుచెదరలేదు. విచారించగా తన చేత శ్రీ దాదాగారు అగ్నిగుండములో నీరు పోయించిన సమయంలోనే అక్కడ అగ్ని ప్రమాదం జరుగుతున్నదని తెలుసుకొని, కృతజ్ఞతాభివందనములు చెల్లించి శ్రీ దాదాగారి దివ్యమహిమను కొనియాడారు.

సద్గురువులు దుష్టులను, దుర్మార్గులను, పాపులను జాలితో కరుణించి శిక్షించేబదులు, శిక్షణ నిచ్చి సన్మార్గులను చేస్తారు. క్రీస్తు, బుద్ధుడు, సాయి నాథుడు, శ్రీ వెంకయ్యస్వామి వారి జీవిత చరిత్రలలో ఇలాంటి లీలలెన్నయినా చూడగలము. పాపులు ధర్మమార్గాన్ని అవలంభించేటట్లు చేయడమే గదావారి అవతార కార్యముఖ్యోద్దేస్యము.

సాయిభేడాలో బుడ్డేఖాన్ అను కసాయి వాడు ఒకబుట్టలో మాంసము తీసుకొనిపోతున్నాడు. శ్రీ దాదాగారా బుట్టనొక కర్రతో కొట్టారు. ఆబుట్టలోని మాంసమంతా భూమిపై పడిన వెంటనే ఎర్రని అందమైన పూలుగా మారింది. అక్కడున్న జనులందరూ ఆశ్చర్య చకితులయ్యారు. శ్రీ దాదాగారు బుడ్డేఖాన్‌ను అదే కర్రతో బాగా కొట్టి మంగలిని పిలిచి వాని తల గొరిగించి వానికి జటాశంకరులు అను మారుపేరు పెట్టారు. నాటి నుండి ఆకసాయివాడు తన వృత్తిని మాని శ్రీ దాదాగారి భక్తుడై వారిసన్నిధిలో పవిత్ర జీవనము చేయసాగాడు.

అన్నింటికంటే గొప్పది విద్యాగర్వము. ఎంతగొప్ప భక్తునకైనా ఈగర్వము అతనిపతన హేతువౌతుంది. ఆధ్యాత్మికంగా వారధోగతి పాలవడం తథ్యం. అలాంటి వారిగర్వం రూపుమాపాలంటే ఒక్క సద్గురువులకే సాధ్యము.

కాశీ నుండి వచ్చిన విద్వాంసుడొకడు శ్రీ దాదాగారిని పరీక్షించ దలచాడు. వేలకొలది భక్తుల మధ్యనున్న ఆగర్విష్టుడైన విద్వాంసుని శ్రీ దాదాగారు తన యొద్దకు పిలిపించి అతనిని తన ఎడమచేతితో పట్టుకొని తమకుడిచేతిని తన ముడ్డి దగ్గర ఉంచి ముక్కి కొంత మలముతీసిదాన్ని ఆ శాస్త్రిగారి మూతికి, చేతికి పూశారు. దుర్గంధానికి బదులు ఆమలమెంతో అద్భుతమైన సువాసనలతో ఆనందదాయకముగా యున్నది. నాటినుండి ఆ శాస్త్రిగారి విద్యాగర్వమంతరించి సద్భక్తుడుగా మారాడు.

సాదుసజ్జనులను కష్టపెట్టడం, దూషించడం, నిందారోపణ చేయడం ఎంతటి దుష్ఫలితాలకు కారణమో అవధూతలీలయను శ్రీ వెంకయ్య స్వామివారి జీవిత చరిత్రలో చూస్తాము. గుడ్లగూబ సూర్యుని వెలుగుచూడలేదు. ఎన్నో జన్మల పాపభారం వలన మ్రగ్గే మూఢులకు మహనీయుల నీడకూడా భరింపరానిదిగా ఉండడం సహజమే. అట్టి పాపాత్ముల దుశ్చర్యలను మహాత్ములు పట్టించుకోరు. కానీ ప్రకృతి మాత్రం తగువిధంగా శిక్షించక వదలదు.

సాయిఖేడాలో కొందరు దుష్టులు శ్రీ చిన్నదాదాగారిపై అసత్యపు కేసులు పెట్టి కోర్టుకు లాగారు. కానీ కోర్టులో కేసువీగిపోయి శ్రీ చిన్నదాదాగారు నిర్దోషులుగా నిరూపించబడ్డారు. తత్ ఫలితంగా సాయిఖేడాలో కలరా వ్యాధి విజృంభించింది. జనులు చీమలపుట్టల వలె చనిపోయారు. శ్రీ దాదాగారు సాయిఖేడా వదలి శాశ్వతంగా నరసింగ్‌పూర్ వెళ్ళి పోయారు. మహనీయులు వరదయానిధులైనప్పటికి ప్రజల సామూహిక పాపఫలం దానిని వారికి దక్కకుండా చేస్తుంది. అందుకే ఈ సామూహిక పాపఫలాన్ని సామూహిక జపయజ్ఞాలు, భజన, సత్ సంగాలు చేసి సామూహిక పాపఫలం తగ్గించుకోవాలని మహనీయులు చెపుతారు. అధర్మ సూక్ష్మం తెలియని అధునికులు దైవం మన హృదయంలోనే ఉన్నాడు. సత్‌సంగాలు, మందిరాలు నామయజ్ఞాలు అవసరంలేదనే వాదన ఎంత అర్థరహితమో తెలుస్తుంది.



కుందన్‌లాల్, జబ్బల్‌పూరులోని బ్రాహ్మణకులస్తుడు. టీచర్ వృత్తిచేసేవాడు. కర్మవశాత్తు అతనికి పిచ్చిపట్టింది. నాటువైద్యాలు, భూతవైద్యాలు అన్నీ విఫలమైనాయి. ఎప్పుడూ ఇనుపగొలుసులతో బందించేవారు. స్నేహితుల సలహాపై అతని తల్లివారిని సాయిఖేడాలోని శ్రీ దాదాగారి సన్నిధికి తీసుకవచ్చింది. శ్రీ దాదాగారు అనేకమంది భక్తులచే పరివేష్టితుండై కోటలోపల ఉన్నారు. ఇనుపగొలుసులతో బంధింపబడిన కుందన్‌లాల్‌గారిని శ్రీ దాదాగారిసమక్షమునకు తీసుకువెళ్ళారు. శ్రీ దాదాగారు అతనిని తనకర్రతో కొట్టసాగారు. కుందన్‌లాల్ తప్పించుకొనివెళ్ళారు. తిరిగి భక్తులతనిని తీసుకవచ్చి శ్రీ దాదాగారి ఎదురుగా ఒకస్థంభానికి భందించారు. రెండు మూడు రోజులక్కడే పడిఉన్నాడు. అతడు తనపిచ్చిచేష్టలను మానలేదు. నాల్గవరోజు శ్రీ దాదాగారు తన కర్రతో అతనిని కొట్టుతూ "ఓ బ్రహ్మారాక్షసీ ఈ బ్రాహ్మణబాలుణ్ణి వదలిపెట్టు" అంటున్నారు. వెంటనే కుందన్‌లాల్ "స్వామీ ! నేను ఇతనిని వదిలేస్తాను. నన్ను క్షమించు"అని అరవసాగాడు. శ్రీ దాదాగారతనికి రొట్టెతినిపించారు. అదిమొదలు అతడు ఆరోగ్యవంతుడై కొంతకాలం శ్రీ దాదాగారి సన్నిధిలోనే ఉండిపోయాడు. కొన్ని మాసాలతర్వాత తనతల్లితోటి అతడు జబ్బల్‌పూర్ వెళ్ళిపోయాడు.

సాయిఖేడా గ్రామమద్యమున ఒకచెరువుగలదు. ఆ చెరువు నిర్మాణమును గురించి ఒక విచిత్రమైన కథ నేటికీ చెపుతున్నారు. ఈ చెరువు త్రవ్వించి అక్కడజీవులకష్టాలు బాపవలెననెడి సంకల్పము నరహరానంద్ అను సిద్ధపురుషులకు కలిగింది. వారు ఆ పవిత్రకార్యము చేయుటలో రోజుకు నూటయాభైమంది కూలీలను నియమించారు. ఒక క్రొత్తకుండలోకొరధాన్యము పోసి మూతవేసి ఆకుండ అడుగున అమర్చిన రంధ్రముద్వారా నిత్యము కూలీలకు ఆ కొరధాన్యము కూలీగా ఇచ్చేవారు. వారు పవిత్ర జలాలు తెచ్చేనిమిత్తము తీర్ధయాత్రలకు పోతూ చెరువు పనిని తన శిష్యునకు ఒప్పగించినారు. కుండమూతతీయకుండా నిత్యం కూలీలకు కొర్రధాన్యాన్ని ఆకుండ అడుగునున్న రంధ్రమునుండి తీసి

ఇమ్మని ఆజ్ఞాపించి పోయెను. ఆ శిష్యుడు కొన్నాళ్ళవరకు అలాగే ధాన్యము ఇస్తూ పనిచేయిస్తున్నాడు. తర్వాత ఒకరోజు కుండలో ఎంత ధాన్యమున్నదో చూడవలెననే కుతూహలము ఆపుకోలేక మూతతీసి చూచాడు. అందులో ఒక్కకూలివానికి సరిపడు ధాన్యముమాత్రమే ఉండెను. ఆ ధాన్యము తీసినాక ఇక మరలా ధాన్యమురాలేదు. ఇంకా చెరువుపనిచాలా ఉందిగనుక ఆ శిష్యుడు తన నేరానికి దారుణముగా దుఃఖించసాగెను.

ఇంతలో నరహరానంద్‌గారు తీర్థముతో తిరిగివచ్చి జరిగిపోయిన దానికి దుఃఖించవద్దని శిష్యుని ఓదార్చి తానుతెచ్చిన తీర్థమును చెరువులో పోసి ఆచెరువులో వివిధరంగుల తామరచెట్లు నాటిరి. నేటికి ఆచెరువులోనినీరు తరుగులేకుండా తెల్లని, ఎర్రని, పచ్చనిరంగు తామరపూలతో యాత్రికులకు నేత్రపర్వముగా అలరారుచు గ్రామమధ్యములోనున్నది.

## శ్రీస్వామి శివానంద బ్రహ్మాచారి

1918వ సం॥లో శ్రీ దాదాగారి దర్శనార్థం సాయిఖేడావచ్చారు. వీరు మాళ్వాప్రాంతపు బ్రాహ్మణ విద్వాంసులు. దర్శనానంతరం శ్రీ దాదాగారిని వదలి వెళ్ళలేకపోయారు. రాత్రింబవళ్ళు శ్రీ దాదాగారిఎదుట కూర్చొని వారిదెబ్బలు తింటూ వారిదివ్యమహిమలను కన్నులారా గాంచుచుండిన ధన్యజీవి. ఒకరోజు వీరికి శిరోమండనం చేయించి నర్మదా స్నానానంతరం ఒక శివాలయమున ఉండమని ఆజ్ఞాపించారు. అందువలన వీరికి శివానంద అనుపేరువచ్చింది. వీరు చీపానేర్‌లో వుండేవారు. వీరు సిద్ధిపొందే సమయానికి వీరివయస్సు తొంభై సంవత్సరాలు. నేటికి మధ్యప్రదేశ్ ప్రభుత్వ బందోబస్తుతో ప్రతి సంవత్సరము పదిహేను రోజులు ఉత్సవాలు జరుగుతాయి.



## శ్రీస్వామి భాస్కరానందజీ

వీరు జబల్‌పూర్ ప్రాంతంవారు. 1920సం॥లో శ్రీ దాదాగారిని దర్శించారు. వస్తూనే శ్రీ దాదాగారు "అరే బాబు ఇక్కడకు రా" అని స్వాగతం పల్కి శిరోమండనంచేయించి తన కర్రను భాస్కరునివైపుకు విసిరారు. అది భాస్కరుని వీపుకు తగిలింది. వారికి భాస్కరానంద అని నామకరణం చేసారు. జబల్‌పూర్‌లో దర్బారు స్థాపించారు. వీరు సంస్కృతం, ఇంగ్లీషులోను మంచి జ్ఞానులు. శ్రీ చోర్లగారనే ఆంగ్లేయ ప్రభువుకూడా వీరి మహిమను చవిచూచి ఆశ్రమం నిర్మించారు.

1860వ సం॥ ప్రాంతంలో శ్రీ దాదాగారు హిమాలయయాత్రకు పోతున్నారు. వారు పరివారసమేతంగా నేపాల్‌చేరారు. మూత్రవిసర్జన చేయవలసిన అవసరము కొద్దీ వీధిలోనే ఒకచోట చేస్తున్నారు. అదిచూచిన గూర్ఖా శ్రీ దాదాగారిని దూషించసాగాడు. శ్రీ దాదాగారు నవ్వి నీవువెళ్ళి ఈ విషయం మీరాజుగారికి చెప్పమన్నారు. ఆవార్త వినగానే రాజుగారు ఎంతో సంతోషముతో సపరివారంగావచ్చి శ్రీ దాదాగారిని పూజించారు. అప్పుడు శ్రీ దాదాగారు "మీరాజ్యంలో మాకు మూత్రవిసర్జనకు కూడా తావులేదే' ' అని అడిగారు. అందుకు రాజు "ఈ రాజ్యమంతే తమదే ప్రభూ" అన్నాడు. అలాకాదు మాకు మూత్రవిసర్జనకుమాత్రం తగిన స్థలంచాలు. నీవు ఒక కంచరగాడిదమీద 7, 8 రోజులకు సరిపడు సామాగ్రితో నాతోరావలెను. మేము తగిన తావును వెదుకుదుము. అనిచెప్పారు. అదేవిధంగా రాజు బయలుదేరారు. శ్రీ దాదాగారు మార్గమంతా నిలపకుండా మూత్రవిసర్జన చేస్తూ మూడుమైళ్ళు నడిచారు. అయినా మూత్రవిసర్జన ఆపలేదు. రాజు విక్రమ సింహుడు దాదాగారికాళ్ళపైబడి ఇదంతా మీరాజ్యమే. తమరు ఇక్కడే ఆగండి. అనిప్రార్థించారు. శ్రీ దాదాగారు అక్కడే ధునిస్థాపించి ఉండసాగారు. రాజుగారు నిత్యం శ్రీ దాదాగారిని అక్కడే పూజించేవారు. ఒకరోజు రాజుగారు విలువైన

దుశ్శాలువను శ్రీ దాదాగారికి సమర్పించారు. శ్రీ దాదాగారు దానిని వెంటనే ధునికి సమర్పించి భస్మంచేశారు. మూడురోజులతర్వాత మంత్రిగారు వచ్చి రాజుగారు దుశ్శాలువను తెమ్మని చెప్పుచున్నారని శ్రీ దాదాగారికి విన్నవించెను. అందుకు శ్రీ దాదాగారు "అరే నీవు నన్ను పరీక్షించవచ్చావా ? సరే ఇదిగో నీదుశ్శాలువ అని అగ్నినుండి దుశ్శాలువతీసి మంత్రికి ఇచ్చేశారు. ఈ అద్భుతానికి మంత్రిగారు ఆశ్చర్యచకితులై దాదాగారి పాదములపైబడి నన్ను క్షమించమని కన్నీటితో ప్రార్థించాడు.

గాడర్‌వాడానుండి ఒక వైద్యుడు సాయిఖేడా వచ్చి శ్రీ దాదాగారిని దర్శించెను. శ్రీ దాదాగారతనిని దగ్గరకు పిలచి అతని జేబులోని పాదరసం సీసాను తీసుకొనెను. ఆ సీసాలోని పద్నాలుగు తులాల పాదరసాన్ని శ్రీ దాదాగారు త్రాగేశారు. నాలుగు నెలల తర్వాత ఆ పాదరసం శ్రీ దాదాగారి ఎడమ మోకాలునుండి బయటికి వచ్చేసింది.

పాదరసాన్ని పుటంవేసి భస్మంచేసి వైద్యులు మందులలో కలుపుతారు. కానీ పచ్చి పాదరసం కడుపులోకి తీసుకోరాదు. అలా తీసుకుంటే వారికి మరణం తథ్యం. కానీ శ్రీ దాదాగారు పాదరసాన్ని త్రాగడమేగాక తిరిగి తన శరీరంనుండి బయటికి తీశారు. యోగనాదుడైన శ్రీ దాదాగారికి సాధ్యముకానిదేముంది.

బడ్ బాహాలో నర్మదా నదికి పెద్ద వరదవచ్చి హద్దులు మీరి ప్రవహిస్తుంది. ప్రజలందరు భయభ్రాంతులయ్యారు. సాధువులు, శ్రీ చిన్నదాదాగారు అంతా కలసి ఈ విషయం శ్రీ పెద్దదాదాగారికి విన్నవించారు. పెద్దదాదాగారు వెంటనే తనకాలు యొక్కపాడవును పెంచి తన పాదాన్ని నీటి సమీపానికి తెచ్చి కాలిబొటనవ్రేలితో నీటిని తాకారు. అంతే నదీప్రవాహము పన్నెండు అడుగులు లోతుతగ్గి ప్రవహించ సాగింది. అందరూ శ్రీ దాదాజీగారికి జైజైధ్వానాలతో తమ కృతజ్ఞతలు తెలియజేశారు.



ఒకరోజు శ్రీ పెద్దదాదాజీగారు తమకు గోధుమరొట్టె కావాలని అడిగారు. వెంటనే శ్రీ చిన్నదాదాగారు గోధుమ పిండిలో నెయ్యికలిపి అతిపెద్దగోధుమ రొట్టె తయారుచేసి శ్రీ పెద్దదాదాజీ గారికి నివేదించారు. వారు అందులోనుండి చాలా స్వల్పంగ తుంచుకొని ఆరగించి మిగిలిన దానిని భక్తులందరికీ ప్రసాదంగా ఇచ్చారు. ఆ రొట్టెను అందరు భక్తులూ ప్రసాధంగాతిని అంతరుచిగల రొట్టెను వారు తమ జీవితంలో ఎప్పుడూ తినలేదని శ్రీ దాదాజీగారి దివ్యమహిమను కొనియాడారు.

ఒకరోజు శ్రీ దాదాజీగారు ఒక భక్తుని బంగ్లాలో ఉన్నారు. హిందీ రచయిత తండ్రిగారైన మాన్‌దాసుగారే గాక అనేకమంది భక్తులు శ్రీ దాదాజీగారికి పాదాలు వత్తుచున్నారు. అక్కడికి ఒక మంగలివచ్చి తానుకూడా శ్రీ దాదాజీగారి పాదాలు వత్తుతానని గనుక దయచేసి వారు తన పాదాలుచాపి పొడవుచేయమని ప్రార్థించాడు. శ్రీ దాదాజీగారు అందులకు అయిష్టతచూపినా ఆ మంగలి మరలా మరలా అలాగే ప్రార్థించసాగాడు. కరుణామయులైన శ్రీ దాదాగారు తనకాళ్ళను ఒకేసారి పదిహేను అడుగుల పొడవుపెంచి బంగ్లావరండాలోనికికూడా చాపినారు. అందరూ ఆదివ్యలీలకు ఆశ్చర్యానందాలతో వారిపాదాలు వత్తుచుండిరి. కొంతసేపటికి ఆ మంగలి అలసిపోయి, చెమటలుక్రక్కుచూ వణికిపోతూ "స్వామీ ఈ మంగలి తమ శక్తిసామర్థ్యాలు తెలియని అజ్ఞాని. ఇతనిని క్షమించి తమరు తమ పాదాలను యధాపూర్వం చేయండని ప్రార్థించారు. కరుణామయులైన శ్రీ దాదాజీగారు తన కాళ్ళను మామూలుగా చేసుకొనగానే భక్తులంతా సంభ్రమాశ్చర్యాలతో జేజేలు పలికారు.

ఎన్నో ఉపన్యాసాలు విన్నా, మరెన్నో గ్రంధాలు చదివినా స్వానుభవముతో ఏర్పడినంతటి గాఢమైన విశ్వాసం మధురమైన ప్రేమ, భక్తికి సాటిరావు. అలాంటి అనుభవం పుణ్యంవల్లగాని కలుగదు.

జబల్పూర్ నివాసి నర్మదా ప్రసాద్గారు కలెక్టరు ఆఫీసులో హెడ్గుమాస్తాగా పనిచేసేవారు. వీరిభార్య ప్రేతబాధకు గురియై పిచ్చిగా ఉండేవారు. ఎన్నెన్నోవైద్యాలు విఫలమై చివరకు శ్రీ దాదాజీగారి సన్నిధికి తీసుకవచ్చారు. చాలారోజులు శ్రీ దాదాజీగారి సన్నిధిలో ఉన్నారు. ఒకరోజు శ్రీ దాదాజీగారు ఆమెను వారి కర్రతో కొట్టూ "ఓ భూతమా ఈ బిడ్డను వదలివెళ్ళిపో. ఈ బిడ్డ అమాయకురాలు" అని గద్దించారు. అంతే ఆక్షణంనుండి ఆమె ఆరోగ్యం చక్కబడి ఇన్నూభాయి, హుక్కీబాయి అనే ఇద్దరు సంతానం కూడాకలిగారు.

జీవితంమీద రోతగల్గిన ఈ తల్లి అదిమొదలు శ్రీ దాదాజీగారి సేవకు అంకితమై సాయిఖేడావదలి ఖాండ్వాకు వచ్చారు. శ్రీ దాదాజీ సేవలో ధన్యతనొందిన భాగ్యశాలి. "కష్టాలుగూడా అనుగ్రహానికి గుర్తు' ' అని పూజ్యపాదులు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు చెప్పిన మాట ఈమె ఎడల సత్యమైంది. ప్రేత బాధతో అన్నేళ్ళుగా బాధపడినందువల్లనే ఆమె శ్రీ దాదాజీ గారి సేవకంకితమైందని తెలుస్తుంది.

ఇదేవిధంగా బారా బంకీ రాజుగారగు ప్రధిపాకొసింగ్గారు అనేక వ్యాధులతో బాధపడి చివరి ఆశగా శ్రీ దాదాజీగారి సన్నిధికి వచ్చారు. వారి ఆరోగ్యం చక్కబడ్డక్షణంనుండి సకుటుంభ సమేతంగా శ్రీ దాదాజీగారి సేవలోనే తన జీవితం గడిపి వారిలో ఐక్యమైన ధన్యజీవులయ్యారు.

1928వ సంవత్సరంలో శ్రీ దాదాగారు సాయిఖేడా నుండి ఝుకోలీ ఘూట్మీదుగా ప్రయాణము సాగించి నర్మదానది దాటి భోరాసఘాట్ దగ్గర మకాంచేశారు. శ్రీ దాదాగారికి వారి పరివారమునకు కావలసిన ఏర్పాట్లన్నీ భోపాల్ మహారాణిగారు సమకూర్చారు. ఒకరోజు శ్రీ దాదాగారు నర్మదానదియొడ్డుననుండగా ఒక బండివాడు తనబండిని నదీతీరమున విడిచి ఎద్దులను నదిలో నీరుత్రాగుటకు తీసుకపోయెను. అంతలో



శ్రీ దాదాగారు బండివానికిచెప్పకుండానే ఆ బండిలో కూర్చొని బండిని పొమ్మని ఆజ్ఞాపించారు. అక్కడి భక్తులందరికీ ఆశ్చర్యముగొలుపు విధంగా ఎద్దులులేకుండానే ఆబండి కదిలిపోసాగింది. వెంటనే ఆబండివాడు పరుగున పోయి అది తన బండియని శ్రీ దాదాగారికి విన్నవించెను. అందుకు శ్రీ దాదాజీ "వెళ్ళు ఎద్దులునీవి, బండినాది" అని చెప్పగానే ఆబండివాడు ఆశ్చర్యానందములతో ఆ దృశ్యముగాంచుచూ నిలబడిపోయాడు. మిగిలిన భక్తులంతా జయజయధ్వానాలు చేస్తూ భక్తిపారవస్యముతో బండి లాగికొని పోసాగారు, ఆరోజంతా ఆ ఊరేగింపు కనులపండుగగా జరిగి బరేల్ అనేగ్రామమువద్దగల మామిడివనంలో ఆగింది.

ఆ విధంగా ఎద్దులులేని బండి ఉత్సవం బరేల్లోని మామిడి వనంలో ఆగింది. శ్రీ దాదాగారు తనకొక రకం మిఠాయికావాలని కోరారు. వెంటనే ఆ మిఠాయి తయారుచేసి శ్రీ దాదాగారికి సమర్పించారు. శ్రీ దాదాగారి ప్రసాదాన్ని భక్తులందరూ తృప్తిగా ఆరగించారు.

ఆ ప్రక్కనే ఒకపెద్దచెరువుఉంది. ఆచెరువును ఒక పిశాచం తన నివాసంచేసుకొనియున్నందున ఆ చెరువులో స్నానంచేయడం నిషేదించియున్నారు. కానీ శ్రీ దాదాగారు అందరినీ వెళ్ళి చెరువులో స్నానంచేసి రమ్మని ఆజ్ఞాపించారు. ఆ చెరువు విషయము, నిషేదాజ్ఞలనుగురించి ఆ గ్రామస్తులు శ్రీ దాదాగారి భక్తులకు తెలియజేశారు. కాని చిన్నదాదాగారు తమ గురువుగారి ఆజ్ఞలు పాటించి తీరాలని పట్టుబట్టడంతో అందరూ ఆ చెరువులో స్నానంచేసివచ్చారు. చిత్రాతిచిత్రంగా ఆనాటినుండి నేటివరకు ఆ చెరువుకు ఆపిశాచం బెడద వదిలింది. నేటికీ ఆ గ్రామస్తులందరికీ ఆ చెరువు ఉపయోగపడుతుంది. శ్రీ దాదాగారు బరేల్నుండి హోశంగాబాద్ మీదుగా ఇండోర్ కేతెంచారు.

## శ్రీ దాదాగారి వచనామృతము

1. ఎవరికి ఈశ్వరుడు కావాలో వారు భజనచేయవలెను. చిరుతిండ్లు తినరాదు.

2. నిజమైన ధునికి కట్టెలు అవసరంలేదు.

3. ఈ దాదా తన బిడ్డలనెప్పుడూ మోసగించలేదు. ఇకముందుకూడా మోసగించడు.

4. ప్రపంచములో ఎచ్చట చెడిపోయిన వాడైనా మావద్దకు వచ్చిన బాగుపడును. కాని మావద్దచెడిపోయినవారు ప్రపంచములో ఎచ్చటనూ బాగుపడరు.

5. హరేరామ భజనచేయుచుండుడు. దీనివలన భక్తికి బలముచేకూరును.

6. వాద వివాదములనుండి వీలైనంతవరకు దూరంగా ఉండండి.

7. మేము చిత్రపటాలు విగ్రహాలరూపాలలో మాత్రమే ఉన్నామని తలచడం పొరపాటు. మరియు ఎవరి తలలపైన అలంకరించము.

8. మోసములతో కపటములతో ప్రపంచమును మోసగించవద్దు ఒకరొట్టెముక్కతో జీవించండి.

10. ఎవరైతే భజన చేయుదురో వారిని రక్షింతును. ఎవరు భజన చేయరో వారిని హరింతును.

11. అగ్ని, స్త్రీ, ధనము మనము ఎదుట ఉన్నప్పుడు మాత్రమే సరిగా పనిచేస్తాయి. మనము ఎదురుగాలేనందున సరిగా పనిచేయనందున ప్రమాధము సంభవించును.

12. సాధకులకు మహాత్ముల సాన్నిద్యములాభము చేకూర్చును.

13. యీ ప్రపంచములో యతి సతి (పతివ్రత) ఈ ఇద్దరేయశస్సులు,. నేడు వీరికి హాని జరుగుచున్నది.



14. నేను దెబ్బలు కొట్టేవాడితోటికూడ ఉంటాను. దెబ్బలు తినేవాడితో మాత్రమేకాదు. (సోమనాథ మందిరంపై మహమ్మద్ గజనీ దండెత్తినపుడు అక్కడి ప్రజలు నపుంసకులై సైన్యమంతయు గ్రుడ్డిదగుననియు వారిచేతులు పడిపోవునని చెప్పసాగిరి. ఇదే దృష్టాంతము)

15. ఈ దాదా తన బిడ్డలనెన్నటికీ మద్యలో వదలిపెట్టడు.

16. రాముని వెనుక అయోధ్య ఉన్నది. అయోధ్య వెనుక రాముడులేడు.

17. అభ్యాగతుడు రావణుడే కావచ్చు కానీ వారెక్కడనుండి వచ్చారు (అంతా బ్రహ్మమే)

18. గొడవలకు వీలైనంత దూరంగా ఉండు.

19. హరేరామ మంత్రాన్ని ప్రతిరోజు జపించు.

20. మనసులో ప్రార్దించి, భజించి, పూజించు.

21. సద్గురువులు చెప్పిందే చేయాలి కాని చేసినట్లు చేయరాదు..

22. సేవకుడు సేవలోను, ప్రార్దనలోను తత్పరుడు కావాలి.

23. ఎదుటి వారిని దోచుకునే బదులు శ్రీ దాదాజీ గారి దయను దోచుకొని సుఖాన్ని అనుభవించు.

24. మహాత్ముడు సిద్దుడిగా కాదు, సేవకుడుగా ఉంటే చాలు.

25. భూమ్యాకాశాల మద్య అందరూ సోదర సోదరీమణులే.

26. గురుదేవునికై నిరీక్షించు, ఆశను వదులుకో.

27. చెప్పడం అందరూ నేర్చుకున్నారు, చేయడం ఎవ్వరు నేర్వలేదు.

28. ఎక్కువ నిద్రపోకుండా, తక్కువ నిద్రపోవాలి. లేకుంటే ఆయుష్షు క్షీణిస్తుంది.

29. ఎల్లప్పుడూ నామస్మరణ ఏమారవద్దు.

30. ఏదైనా తినాలంటే ముందు నైవేద్యం పెట్టి తిను, దైవకృప పొందుతావు.

31. నీవు నా నామం జపిస్తుంటే నేను నీ కార్యంపై కన్నేసి ఉంచుతాను. నీవు నీ పనులలో ఉంటే, నేను నాలోకంలో ఉంటా. నోటిలో నామం ఉంటే చేతిలో సదాకార్య సిద్ధి ఉంటుంది.

32. ప్రార్ధనలో చైతన్యం, సేవలో తత్పరత ఉండాలి.

33. ఒక సద్గురువును నమ్మి ఇంకో సద్గురువును ఆశ్రయిస్తే వారెట్టి మంచి పనులు చేసినా సద్గతి కలుగదు.

## శ్రీ దాదాగారు నాటిన కల్పవృక్షాలు.

శ్రీ చిన్నదాదాగారు : జైపూరు దగ్గర దిండివనం అనే గ్రామము లో ఒక శ్రీమంతుని ఏకైక బిడ్డగా పెరిగారు. వీరు తన ముప్పై సంవత్సరాల వయసు వరకు డాక్టర్లకు అలవిగాని అనారోగ్యంతో వుండేవారు. శ్రీధునీ వాలా దాదాగారు సాయి ఖేడాలో వుండగా వీరి తండ్రిగారు వీరిని చివరి ఆశగా శ్రీ దాదాగారి ఆశీస్సుల కొఱకు తీసుకవచ్చారు. వీరిని చూడగానే శ్రీ దాదాగారు నవ్వుతూ "వీడే నాబిడ్డ, వీణ్ణి ఇక్కడే వదలి వేయండని" ఆజ్ఞాపించారు. వారి ఆరోగ్యం చక్కబడటమేచాలని తల్లి దండ్రులు వారిని అచటనే వదలివేశారు. వీరి ఆరోగ్యం చక్కబడగానే ముండనం చేయించి హరిహరానంద అని పేరు పెట్టారు. వీరు శ్రీ దాదాగారి తర్వాత చిన్న దాదాగా ప్రసిద్ధి చెంది ఆశ్రమానికి వారసుడయ్యారు.

ఒక రోజు శ్రీ దాదాజీగారు బ్రహ్మచారి ఆభరణాలు వస్త్రాలు సర్వంతీయించి గుండు చేయించి నిరాహారిగా ఒక గదిలో బందించారు. ఆవిధంగా 32 రోజుల వరకు వారికి ఎలాంటి ఆహారమూ ఇవ్వలేదు. భక్తులు ఆహారమిస్తే బ్రహ్మచారిగారు తినేవారు కాదు.



ఒకనాడొక భూస్వామి శ్రీ దాదాజీగారి దగ్గరకు వెళ్ళి "రెండు నెలల నుండి బ్రహ్మచారి గారికి ఆహారం లేదు. చనిపోతాడేమో" నని ప్రార్ధించాడు. "అరే బాలకా! వాడికి నేను కాయ కల్ప చికిత్స చేస్తున్నాను". అని చెప్పారు. చివరకు ఒకరోజు బ్రహ్మచారి గారిని గది నుండి బయటకు రప్పించి ఒక రకమైన వంటకాన్ని తినిపించి వారి దీక్ష విరమింప జేశారు. అప్పుడే వారికి "హరిహరానంద" అనే దీక్షానామం ఇచ్చారు. వీరే కాలాంతరంలో చిన్న దాదాజీగా విఖ్యాతులయ్యారు.

1920వ సంవత్సరములో శ్రీచిన్నదాదాగారు శ్రీ పెద్ద దాదాగారి ఆదేశం మేరకు కుంభమేళా వెళ్ళారు. ఆ సమయములో శ్రీ చిన్న దాదాగారిని పండిట్ హరిశంకర్ శుక్లా గారు బురహాన్ పూరులోని తన గృహమునకు తీసుక వెళ్ళారు. ఒక నాటి రాత్రి హారతి సమయంలో అచ్చటికి ముగ్గురు వ్యక్తులు శ్రీ దాదాగారి నగ్న స్థితిని అవహేళన చేయుమిషతో వచ్చారు. వారు తమ పాదరక్షలు తీయకనే లోనికి పోవ ప్రయత్నించారు. మా శరీరాలు కూడా చర్మముతో ఉన్నాయి. అలాంటప్పుడు చెప్పులుతో లోపలికి పోతే ఏమని అడిగారు.

కాని బహుకష్టంమీద అక్కడున్నవారు ఆ ముగ్గురి పాదరక్షలు తీయించిలోనికి పంపారు. శ్రీ దాదాగారు అందరికీ ప్రసాదం పెడుతూ ఈ వ్యక్తులకు ప్రసాద మివ్వకుండా చేయి వెనక్కు తీసుకొని, "మీరు ప్రసాదం చెప్పులతోనే తీసుకోండి" అని అన్నారు. ఆ వచ్చిన ముగ్గురి నోర్లు తెరుచుకొని అలాగే ఉండిపోయారు. అక్కడి భక్తులు ఆ ముగ్గురిని శ్రీ దాదాజీ గారికి క్షమాపణ చెప్పుకొని పాదా క్రాంతులైతే వారి నోర్లు యధా ప్రకారం కాగలవని చెప్పారు. వారు ఆవిధంగా క్షమాపణ చెప్పగానే వారినోరు యధాప్రకారం పనిచేయనారంభించింది. భక్తి అంటే ఏమిటో శ్రీ దాదాగారు ఆ అజ్ఞానులకు బోధించారు.

మహనీయులెంతటి అద్భుత లీలలు చూపి తన బిడ్డల కన్నులు తెరిపించాలని ప్రయత్నించినా, ఇంద్రియలోలురు, దుష్ట స్వభావులైన నీచులు ఆలీలలన్నీ అసత్యములని అపహాస్యము చేశారే గాని విశ్వసించలేదు. పోగా వారి ప్రేమ నర్దం చేసుకొని కృతజ్ఞతాభావంతో ఉండే బదులు వారికి కీడుచేయ తలపెట్టి ఆపాప భారం వలన బాధలకు లోనౌతారు.

సాయి ఖేడాలోని కొందరు దుష్టులు శ్రీ పెద్దదాదాగారి శిష్యులు పరమ పూజనీయులైన శ్రీ చోటే దాదా గారిపై కుతంత్రములు పన్ని దుష్ప్రచారము చేయసాగారు. వారు నగ్నముగానుందురని, సేవించ వచ్చిన స్త్రీలతో సుఖింతురని కోర్టులో కేసు పెట్టారు. శ్రీ పెద్ద దాదాగారెందరో ప్రభుత్వోద్యోగులకు, భక్తులకు పూజనీయులుకనుక కోర్టు మేజిస్ట్రేటు స్వయముగా శ్రీ పెద్ద దాదాగారి యొద్దకు విచారణ నిమిత్తము వచ్చారు. కాని, సాక్ష్యమునకు బదులు తిట్లు, కర్రదెబ్బలు పొంది మేజిస్ట్రేటు వెళ్ళాడు. కేసు త్రోసివేయబడింది.

ఈ దుశ్చర్యల ఫలితంగా ఎందరో కలరావల్ల సాయి ఖేడాలో చీమల వలె మరణించ సాగారు. ఆప్రాణాపాయ పరిస్థితులలో తమను రక్షించమని ఎందరు ప్రార్థించినా వినకుండా శ్రీ దాదాగారు సాయి ఖేడా వదలి వెళ్ళిపోయారు.

మహనీయుల చర్యలు ప్రస్తుతానికి మన కర్థం కానందున చేదుగాయున్నప్పటికీ కాలాంతరములో ఆ చర్యలే మన ఉన్నతికొరకు అనుగ్రహించబడిన వరాలని తెలియవస్తాయి.

## స్వామి నిత్యానందాజీ

1914వ సం॥లో దామేష్ నుండి అరవై సం॥ వృద్ధుడు తన భార్య చనిపోయాక శ్రీ దాదాగారి దర్శనార్థమై వచ్చాడు. రాగానే అతనిని బాగా కొట్టి అతనికి శిరోముండనం చేయించి నిత్యానంద్ అని పేరు పెటారు. వీరు చాందర్ పూర్ లో సిద్ధి నోందారు. నేటికి వీరు తన సమాధి నుండి వేల మందిని రక్షిస్తున్నారు.



## మహా సమాధి

హీనులు, దీనుల బాధలుతీర్చి వారికి భక్తి విశ్వాసాలు అనుగ్రహించడానికి భక్తులకు ఇహపరాలు ప్రసాదించడానికి ముముక్షువుల చేత సాధన చేయించి ముక్తి ప్రసాదించడానికి అదృశ్యమగు దైవ శక్తే ఈ జగత్తంతా నడుపుచున్నదని తెలిపేందుకు, ఆ విశ్వచైతన్యమే(పరమాత్మ) సద్గురువుల రూపంలో భూమిపై అవతరిస్తుంది. ఇట్టి మహనీయుల జన్మ రహస్యము ఎంతటి దివ్యలీలో మహా సమాధి విషయం కూడా అట్టిదే. ఇట్టి మహనీయులు పాంచ భౌతిక శరీరం చాలించిన తరువాత కూడా నిత్య సత్యులై సూర్యచంద్రులున్నంత వరకు అవసరమైనప్పుడంతా తిరిగి భౌతిక శరీరంతో భక్తులకు దర్శన మివ్వగలరు. గనుకనే వీరు మనలాగ మరణించరని, వీరు శరీర త్యాగం చేయడం మహా సమాధి చెందడమని పెద్దలు చెపుతారు. ఇట్టి వీరి దివ్య స్థితినే ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరు గారు మృత్యువు పై సాధించిన ఘన విజయమని, శాశ్వత దైవరాజ్యమని పేర్కొన్నారు. పూజ్య శ్రీ దాదాజీ గారు మహా సమాధి చెందడమే ఒక అద్భుత లీల, కారణం వీరు 30-40 సం॥ల మధ్య వయస్సులో మూడు నాలుగు సార్లు శరీర త్యాగం చేయడం ప్రతిసారి భక్తులు పోలీసుల సమక్షములో వీరి భౌతిక కాయాన్ని సమాధి చేయడం, వీరు తిరిగి ప్రక్క గ్రామాలలో యధాప్రకారం తమ దివ్య లీలలు ప్రదర్శిస్తూ అందరితో ఉండడం అలనాటి పోలీసు శాఖనే దిగ్భ్రమ చెందించింది. మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వాలో 1930 వ సంవత్సరములో మహా సమాధి చెందిన శ్రీ దాదాజీ నేటికీ నిత్య సత్యులై యున్నారని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నాయి.

పూజ్య శ్రీ దాదాగారు పరమ పవిత్రమైన పుణ్య భూమి యగు సాయి ఖేడా యందు 1907 నుండి 1924 వ సం॥ జనవరి వరకు నివసించారు. సుమారు 22 సం॥ల పాటు సాయిఖేడా ను తన కేంద్రంగా

జేసుకొని శ్రీ దాదాగారు యావత్ భారతావనినే గాక ప్రపంచమునే ఉర్రూతలూగించి సంభ్రమాశ్చర్యములలోముంచారు. మొండి రోగములను మాన్పుట మొదలుకొని, పుట్టందులకు దృష్టినిచ్చుట, చనిపోయిన వారిని బ్రతికించుట వరకు వారు చేయని దివ్య లీలలే లేవు. వారి దివ్య చరిత్రంతా వ్రాయాలంటే మన జీవితమే చాలదు అంటుంది హింధీ రచయిత్రి శ్రీమతి ఆశాదుబే.

శ్రీ దాదాగారు 1929వ సం॥ జనవరి నెలలో ఒక రాత్రి భక్తులను తొందరచేసి బండి పిలిపించుకొని అందులో ఎక్కి రాత్రికి రాత్రి సాయిఖేడా వదలి వచ్చేశారు. బుదనీ, చింతలీ, యునేమేవార్ మీదుగా పయనించి ఏప్రియల్ నెలలో ఉజ్జయినీ చేరారు. మార్గ మధ్యములో దేవాస్ ప్రాంతపురాజు పాదరక్షలు లేకుండా శ్రీ దాదాగారి రథమును మూడు మైళ్ళ దూరము లాగి ధన్యులయ్యారు. శ్రీ దాదాగారు ఉజ్జయినీ లోని హనుమాన్ బాగ్‌లో మకాము వేశారు. అక్కడ నీరు లేక ఎండి పోవుచున్న భావిలో ఒకరొట్టె ముక్క వేసినంత మాత్రాన ఆభావిలోని నీరు తరుగులేని జలపూర్ణమై భక్తులలో ఇక్కట్లు బాపింది. మూడు నాలుగు నెలల పాటు వారి దివ్య పాద ధూళితోపాటు ఉజ్జయినిలోని వేల కొలది భక్తులకు దివ్యలీల లనుగ్రహించారు. వారక్కడ నుండి బడ్‌బాహా వెళ్ళారు. జులై 1930లో అక్కడి భక్తులు గురుపూర్ణిమ వేడుకను శ్రీ దాదాగారి సమక్షములోఎంతో శ్రద్ధా భక్తులతో వైభవోపేతంగా జరుపుకొన్నారు. 1930 నవంబరు నెలలో శ్రీ దాదాగారు భక్తుల వినతిమన్నించి ఖాండ్వా దయచేశారు.

1930వ సం॥ నవంబరు 29వ తేదీన భక్తులు వారిని పరుపుపై శయనింపజేసి పెసలపప్పుతో చేసిన పొంగలి సమర్పించారు. వారి అతీంద్రియా వస్తను బట్టి అనతి కాలములోభౌతిక దేహము త్యజించనున్నారని అంతిమ దర్శనమునకు ఏర్పాట్లుగావించారు.



మహాసముద్రము ఫలె వచ్చు జనుల నరి కట్టుటకు మంచము చుట్టు కర్రలతో బోనునమర్చి ప్రజలందరికీ దర్శనము ప్రసాదించారు. హరిహర భగవాన్ (శ్రీ చిన్న దాదాగారు) గంగాధర బ్రహ్మచారి, మురళీధర్ సోదరుడు, గిరిజానంద్ గుప్తా గారలు రాత్రింబవళ్ళు శ్రీ దాదాగారిని కాచుకొనియున్నారు. శ్రీ దాదాగారు సమాది చెందారన్న వార్తవిని ఖాండ్వా శోకసాగరమున మునిగిపోయింది. వారనుకున్నట్లె శ్రీదాదాగారు కొద్ది రోజులకు మహాసమాధి చెందారు. (అ తేది ఖచ్చితంగా తెలియ రాలేదు)

1930 సం॥ డిసెంబరు 3 తే॥న శ్రీ దాదాగారి దేహాన్ని వేలకొలది భక్తుల కన్నీటి వీడ్కోలుతో సమాది చేశారు. సమాదిలో చందనముక్కలు పేర్చి మణుగుల కొలది కర్పూరం పరచి దానిపై పట్టు వస్త్రముల పాన్పునమర్చి వెండి బంగారు నగలతోను పుష్ప మాలికలతోను అలంకరించి పూజ హారతులు చేసి వేలకొలది భక్తుల ఆర్తనాధాల మధ్య వారిని సమాది యందు శాశ్వత యోగనిద్ర కొరకు వదలి వేసి సమాధిని బండలతో కప్పి వేశారు.

ఆ మహా మహితాత్ముడైన అవతారపురుషుడు నేటికీ స్మరించిన వెంటనే తన సమాధి నుండి పలుకుచు ఆర్తత్రాణ పరాయణుడై తన దత్తావతార కార్యమును నిత్య సత్యులై నెర వేర్చుచున్నారు. వేలమంది ఆర్తులు వారి సమాది నుండి ఏ వారి రక్షణ పొందుచున్నారు.

మహనీయులయెడల నిర్లక్ష్యభావమును శ్రీ దాదాగారు గోరంత కూడా సహించే వారుకాదు. కారణము అట్టి నిర్లక్ష్యభావము నుండి భక్తులను విముక్తి చేయనిదే ఆ భావము వలన భక్తులకు ఎనలేని కష్టనష్టములే గాక పాప ఫలము సంభవించునని శ్రీ దాదాగారి అభిమతము. భక్తుల అజ్ఞాన వైఖరిని తగువిధంగా సవరించి సన్మార్గమున పెట్టుటే వారి అభీష్టము. మహా సమాది చెందాక గూడ వారు నిత్య సత్యులే.

కారులో వచ్చి శ్రీ దాదాగారి దర్శనము చేసుకున్న ఒకయువతి "ఇచ్చట అరుగు తప్ప మరేమీ లేదే! ఇది చాలా ప్రసిద్ధి గాంచిన క్షేత్రమని విన్నాము కదా?" అని నిర్లక్ష్యముగా మాట్లాడి దర్శనానంతరము కారులో బయలుదేరింది. పదిబారలు వెళ్ళాక కారు నిష్కారణంగా భూమిలో దిగబడి రెండుమూడు గంటలసేపు విశ్వప్రయత్నము చేసినా కదలలేదు. వారు తన తప్పును గుర్తించి తిరిగి సమాది దగ్గరకు వెళ్ళి తన నిర్లక్ష్య వైఖరి క్షమించి ప్రయాణము సుఖముగా జరుగునట్లు చేయమని సాష్టాంగపడి శ్రీ దాదాగారిని ప్రార్ధించారు. తిరిగి వెళ్ళి కారును కదిలించీ కదిలించక ముందే ఎంతో తేలికగా కారు వేగంగా పోసాగింది.

"మహాసమాది అనంతరం కూడా నేను నిత్య జాగరూకుడనే" అని శ్రీ దాదాగారు అసంఖ్యాకమైన లీలల ద్వారా మనకు అభయమిస్తున్నారు.

## మహాసమాధి అనంతరం

*పూజ్య శ్రీ ఆచార్య భరద్వాజ గారు చెప్పినట్లు : -*

మహనీయులు శరీర త్యాగం చేయడమంటే "మృత్యువు పై సాధించిన ఘనవిజయము" అన్నమాట. వారు భౌతికంగా మన భౌతిక నేత్రానికి కనపడక పోవచ్చు. కానీ వారు సర్వత్రా సర్వదా అప్రమత్తులై వారిని స్మరించని వేళలలో కూడా తన భక్తులను రక్షించడం మనం చూస్తున్నాము. సర్వత్రా వారు అదృశ్యంగా ఉన్నా వారి సమాదులలో వారి ప్రత్యేక ప్రభావం మనకు ప్రత్యేకంగా కనబడుతుంది. "వాళ్ళుండేదాన్ని బట్టయ్యా మనముండేది" అని భగవాన్‌శ్రీ వెంకయ్య స్వామి వారు చెప్పిన మాట అక్షరసత్యమని ఋజువౌతుంది. వారి దివ్య సమాదుల దగ్గర అందరికీ ఒకే ఫలితంరానందుకు శ్రీవెంకయ్య స్వామి వారి మాటే కారణమని తెలుస్తుంది. శ్రీ దాదాజీ గారి సమాది నుండి తక్షణం మేలు పొందిన దివ్యగాథ చూద్దాం.



ముల్తాయీ నివాసియైన ఇరవై నాలుగు సంవత్సరాల అందమైన అమ్మాయికి పిచ్చి పట్టింది. ఆ ధారుణమైన పిచ్చిలో ఆమె తన శరీర కండరాలు తానే కొరుక్కు తినేది. అంతే గాక ఆమెను బంధించి ఉంచిన ఇనుప గొలుసులు కొరికేది. ఏమాత్రం వీలైన శరీరం పైనున్న గుడ్డలు తీసిపారేసేది. ఈ ధారుణమైన పరిస్థితిలో ఆమెకు చేసిన సర్వ వైద్యాలు విఫలమైనాయి. చివరి ఆశగా శ్రీ దాదాజీ గారి సమాది యొద్దకు తీసుక వచ్చారు. మనుషుల చేయి తప్పించుకొని పారిపోయింది. ఎంతోకష్టంతో తిరిగి గొలుసుల తో బందించి తెచ్చి ఆమె శిరస్సును శ్రీ వారి సమాధికి తాకించగానే ఆమె నాట్యం చేస్తూ భజనలు పాడ మొదలుపెట్టింది. క్రమంగా పిచ్చి తగ్గి పోయాక గూడ ఆమె కృతజ్ఞతతో మూడు సంవత్సరాల వరకు శ్రీ దాదాజీ గారి సమాదికి సేవ చేస్తూ ఉండిపోయింది.

బైతూల్ నివాసి శివరామరాజుగారు తన దివ్యానుభవం ఇలా చెపుతున్నారు. భక్తి శ్రద్ధలకు మా ఇల్లు పెట్టినది పేరుగా ఉండేది. నేను జన్మించగానే నాపేరు శివరాజు అని పెట్టారు. అప్పటికే మా పెద్దలంతా శ్రీ దాదాజీ గారి భక్తులు. నేను ఒక సంవత్సరం బిడ్డగా ఉండగా మాతల్లి నన్ను శ్రీ దాదాజీ గారి పాదాల వద్ద పడుకోబెట్టింది. వెంటనే శ్రీ దాదాజీ "ఏమి కావాలి?" అని అడుగుతూ తన కర్ర తీసుకుంటుంటే మా అమ్మ భయపడి నన్ను తనచేతులలోకి తీసుకుంటూ "ఏమీలేదుస్వామి" అనిందట. వెంటనే శ్రీ దాదాజీ గారు "ఏమీ లేకుంటే ఏమీలేదు" అన్నారట. ఆమాటల కర్ధం ఏమిటో ఎవరూ పట్టించుకోలేదు. క్రమంగా మా పెద్దలందరూ స్వర్గస్థులై దాయాదులు మమ్ములను కోర్టులపాలుచేశారు. నా రాజీ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఈ కేసులు అనేక సంవత్సరాలు జరిగాయి. నేను కూడా శ్రీ దాదాజీ గారి భక్తుడనే. శ్రీ దాదాజీ 1930 సం॥ సమాది చెందారు. నేను కోర్టు కేసుల వత్తిడి తట్టుకోలేక 1950 ప్రాంతంలో శ్రీ దాదాజీ గారిని మనశ్శాంతిని ప్రసాదించమని తీవ్రంగా ప్రార్ధించేవాడిని. మనశ్శాంతి కొరకు శ్రీ దాదాజీ గారి అగ్నిహోత్రం చేయసాగాను. క్రమంగా నాకు శాంతి లభించడమే కాక కోర్టు కేసులన్నీ సద్దుమణిగాయి. ఇంటిలో శాంతి నెలకొనింది.

క్రమంగా నా శరీరానికి పాలు తప్పమిగత ఏవస్తువులు పడకుండా చేశారు శ్రీదాదాజీ. వ్యాయామం కూడా మొదలు పెట్టాను. కోర్టు వ్యవహారముల వలన ప్రపంచ విముఖత ఆత్మసాక్షాత్కారానికై తపన మొదలైంది. కానీ నాకెవ్వరూ గురువులు లేరు. మహా సమాధి అనంతరం కూడా శ్రీ దాదాజీ గారే నాకు శరణ్యం అయ్యారు. క్రమంగా నాకు సిద్ధులు సంక్రమించాయి. శ్రీ దాదాజీ గారి కృపతో వాటిని కూడా అతిక్రమించాను. అప్పుడు భక్తి నుండి జ్ఞాన మార్గంలోకి తెచ్చారు. అప్పుడు అగ్నిహోత్రం కూడా మానేశాను. అప్పుడు బాహ్యంగా శ్రీ నారాయణ దాస్‌జీ గారి మార్గదర్శకత్వం లభించింది. ఈ జగత్తంతా దృశ్యమాన జగత్తుగా తోయసాగి ఆత్మానందంలో మునగసాగాను. ఏమీ లేకుంటే ఏమి లేదన్న శ్రీ దాదాజీ గారిమాట లప్పుడర్ధమయ్యాయి. మనసులో ఏమి లేకుంటే ప్రతి బంధకాలన్నీ ఏమీ లేవని మిగిలేది దైవమేనని తెలిసింది. మహాసమాధి అనంతరం కూడా శ్రీ దాదాజీ నమ్మిన వారికి కల్పవృక్షమే.

భారత స్వాతంత్ర్య యోధుడు హల్కుప్రసాద్ గారు ఈనాటికీ భారత ప్రభుత్వ పెన్షనుతో పాటు కొంతభూమిని కూడా స్వాతంత్ర సమరయోధుల పారితోషికంగా ప్రభుత్వం నుండి పొందియున్నారు. జబల్‌పూరు నివాసియగు వీరి కుమార్తె శ్యామాభాయికి ప్రేతబాధవల్ల ఇరవై సంవత్సరాలుగా సంతానం కలుగలేదు. ఈమె ఒకసారి ఖాండ్వాలో శ్రీ దాదాగారిని దర్శించి వారిపోటో తీసుకవెళ్ళి తనఇంట్లో గోడకు తగిలించింది గాని పూజ పునస్కారము చేయలేదు. ఎన్నో వైద్యాలు, భూతవైద్యాలతో సహా వ్యర్ధమైనాయి. ఒకసారి శ్రీ చోటేలాల్ అనువారు శ్రీ దాదా గారి స్నానమునకు, త్రాగేందుకు అల్హాబాద్ నుండి త్రివేణీ సంగమ జలము తీసుకపోతూ జబల్ పూరులోని శ్యామాభాయి గృహాన్ని దర్శించారు.



పూజలు లేకుండా గోడకు వ్రేలాడు తున్న శ్రీ దాదాజీ గారి ఫోటో క్రిందకు దించి తగిన ఆసనముపై శ్రీ దాదాజీగారి పోటోను ఉంచి పూజాదికములు నిర్వర్తించారు. అక్కడికి వచ్చిన భక్తులకు శ్రీ దాదాజీగారిని గూర్చి చెపుతూ వారు పరమ శివుని అవతారమై యున్నారనియు, ఆవిధంగా పూజలేకుండా వారి చిత్ర పటాన్ని నిరాధరణగా ఉంచడం అపచారమైనదిగా వివరించారు. భక్తులందరితో పాటు శ్యామాభాయి తీర్ధప్రసాదాలు తీసుకుంటుంది. చిత్రంగా ఆమె ఒడిలో ఒక మామిడి పండు, రెండు జామ పండ్లూపడ్డాయి. శ్రీ చోటే లాల్ గారి సలహాపై ఆమె ఆ పండ్లు తిని భక్తితో శ్రీ దాదాజీ గారిని నిత్యం పూజించ సాగింది. మూడు సంవత్సరములలో వరుసగా ఆమెకు ఒక మగబిడ్డ, ఇద్దరు ఆడపిల్లలు కలిగారు. ప్రేతబాధ వైదొలగింది.

మహాత్ముల చిత్ర పటాలను మనమెంత భక్తి శ్రద్దలతో సేవించాలో ఈలీల తెలుపుతుంది. మహాత్ముల దర్శనమును అంగడి బేరంవలెగాక శ్రద్దా భక్తులతో వినియోగించుకోమని తెలుపుతుంది.

ముల్తాయీ నివాసి శ్రీ నీల కంఠరావు గారు షుమారు ఎనిమిది సంవత్సరాలుగా పిచ్చితో బాధపడ్డారు, వీరు పోలీసు ఇనస్పెక్టరుగా పనిచేస్తూ ఇలా అయ్యారు. వారు చేయించిన వైద్యాలన్నీ విఫలమయ్యాయి. కనపడిన వారినందరినీ కొట్టడం తిట్టడంతో అనేక సార్లు వీరిని జైలుకు పంపారు.

చివరి ఆశగా వీరి తల్లిగారైన మహాలక్ష్మీబాయీ చౌబే గారు శ్రీ దునీవాలా దాదాగారి సమాదిని ఆశ్రయించింది. తన బిడ్డ ఆరోగ్యం బాగు చేయమని హృదయ విధారకంగా శోకిస్తూ శ్రీవారి సమాదిని పూజించసాగింది. కాని ఒకనెల తర్వాత రావుగారు అందరినీ కొట్టసాగినందున పిచ్చాసుపత్రిలో చేర్చినట్లు లెటర్ వచ్చింది. ఆప్తుల సలహాపై ఆమె ఇంటికివెళ్ళే ప్రయాణం మానుకొని శ్రీ వారి సమాదికే తన మనోవేదన మొరపెట్టుకో సాగింది.

ఖాండ్వా కలెక్టరు గారైన శ్రీ దుబే సాహెబ్ గారు తనకు బంధువు గనుక తన కొమారుని విడిపించే ప్రయత్నం చూడమని అర్థించింది. మనసుస్తిమితంలేని అతడు ఆస్పత్రిలో నుండడమే మేలని ఆమె శ్రీ దాదాగారి సమాది సేవ చేస్తుంటే త్వరలో వారి ఆరోగ్యం తప్పక చక్కబడుతుందని కలెక్టర్ శ్రీ దుబేగారు చెప్పడంతో ఆమె ఎంతో పట్టుదలతో ఆర్తితో శ్రీ దాదాగారి ని సేవించసాగింది.

వారికి పిచ్చి ముదిరినందున గొలుసులతో బంధించారని మరొక నెలతర్వాత జాబు వచ్చింది. ఆప్తుల సలహా ననుసరించి ఆమె ఇంటి ప్రయాణం మాని తన సాధన కొనసాగించింది. అనతి కాలంలో వారికి పూర్తిగా పిచ్చి తగ్గిపోయిందని డాక్టర్లు తీర్మానించి ఆస్పత్రి నుండి పంపేశారు. ఆ విషయం తెలిసిన వారి తల్లి మహ లక్ష్మిభాయిగారు తన కోడలు కొమారుడు,మనుమరాళ్ళను శ్రీ దాదాజీ గారి దర్బారుకు రప్పించి పూజాదికములు ఎంతో కృతజ్ఞతా భావంతో జరిపించారు. లక్ష్మీభాయి మాత్రం ఇంటి మొకం చూడకుండా శ్రీ దాదాగారి సమాది సేవ చేయుచున్నందున నీలకంతరావు గారికే గాక వారి తమ్ములకు గూడా ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చి సుఖ శాంతులతో జీవించారు.

పరమ దయానిధియైన శ్రీ దాదాగారు మహాసమాధి అనంతరం కూడా భక్తులకు భౌతిక దర్శనం ప్రసాదించి కష్టాలు తీర్చడం సంపూర్ణ దత్తావతారం అని నిస్సందేహంగా నిరూపిస్తుంది. శ్రీ దాదాగారి కూర్పు భక్తులలో వామన్ రావు చౌబే ఒకరు. ఒకప్పుడు వీరి పొలములో తగాదా ఏర్పడింది. మహా సమాది అనంతరంకూడా శ్రీ దాదాగారు ఆ పొలములో ప్రత్యక్షంగా కన్పించి తగాదా తీర్చారు. ఆదర్శనం లభించిన కొద్ది పాటి కాలంలో అక్కడనున్న వారిలో ఒక్కరికైనా అది అద్భుతంగా ఆసమయంలో తోచక పోవడమే మహాద్భుతం.



## పడవ ప్రమాదం తప్పించిన శ్రీ దాదాగారి నామం

1945 వ సం॥ లో శ్రీ శంకరానందగారు, శ్రీ శంకర శాస్త్రి ఆర్వీకర్, శ్రీ బాలశాస్త్రి, శ్రీ పురుషోత్తమ ఆర్వీకర్ మొదలైన వారంతా పడవ మీద నర్మదానది దాటుతున్నారు. ఎత్తునుండి ఉధృతంగా ప్రవహించే నదీ ప్రవాహానికి పడవ విచ్చలవిడిగా కంపినక్తా మునిగిపోయే ప్రమాదమేర్పడింది. పడవ తన ఆధీనంలో లేదని తెలిసిన పడవ నడుపువాడు ప్రాణ రక్షనార్థం నీటిలోకి దూకి ఈదసాగాడు. గట్టున వున్న వారంతా పడవ మునిగి పోయిందని భయ బ్రాంతులయ్యారు. కాని పడవలోని వారు ప్రాణ భీతిచే ఎలుగెత్తి శ్రీ దాదా నామస్మరణలో మునిగి పోయారు. పడవ నడుపు వాడు లేకుండానే పడవ క్షేమంగా ఒడ్డుకు చేరింది. సర్వవ్యాపకుడు, స్మృతి మాత్ర ప్రసన్నుడు అయిన శ్రీ దాదాగారి కృపను అందరూ కొనియాడారు.

1978-79 వ సంవత్సరంలో ఆశ్రమ భవన నిర్మాణం జరుగుతుంది. మధ్యలో సిమెంటుకు డబ్బులేక పని ఆపవలసి వచ్చింది. ఆశ్రమ నిర్వహణాధి కారియైన శ్రీ చరణానందగారు చాలా బాధ పడుతున్నాడు. ఒకరోజొక భక్తుడు వచ్చి తాను ఝాన్సీ నివాసిననియూ, తన కుమారునికి వివాహమై తనకొక మనుమడు పుట్టాడనియు అందువలన శ్రీ దాదాగారికి ఈ చిన్న కానుక సమర్పించ వచ్చానని చెప్పి కొంత పైకం శ్రీ చరణానంద చేతిలో పెట్టి వెళ్ళాడు. ఆడబ్బు ఎంచితే సరిగ్గా సిమెంటుకు సరిపడు నంతే వుంది. ఆభక్తునికొరకు వెదికితే ఆ ప్రాంతంలో ఎక్కడాలేడు. శ్రీ నర్మదా మాత ఒడిలో నుండి బంగారు రూపాయలు అందుకోగల్గడం, అగ్నిగుండము నుండి బంగారు ఇటుకలు తీసిన మహనీయమూర్తికి అసాధ్యమేమున్నది.

1941 డిసెంబరు 5వతేదిన శ్రీ సహస్ర చండీ యజ్ఞము ఖాండ్వాలోని శ్రీ దాదాగారి ఆశ్రమంలో జరుపబడుతుందని కరపత్రములు విడుదల చేశారు. కానీ ఆసమయంలో ఆశ్రమమునకు ఆయజ్ఞం జరిపే ఆర్థికస్తోమతు లేదని అందరికీ తెలుసు. లక్షల కొలది రూపాయలు లేనిదే ఆయజ్ఞానికి జరుప సాధ్యం కాదు. శ్రీ దాదాగారి కృప వలన సమయానికి అవ్యయానికి అవసరమైన ధనమంతా సమకూడి యజ్ఞం విజయ వంతమైనది. అంతేగాక అంతవరకు ముస్లింల ఆధీనంలో నున్న ఆశ్రమ స్థలమంతాకొని ఆశ్రమం పేరుతో రిజిష్టరు చేయించుకొన్నారు. పై రెండు కార్యక్రమాలు కేవలం శ్రీ దాదాగారి దివ్యమహిమ వలననే జరిగాయి.

1932వ సం॥లో శ్రీ శంకరానంద గారు (శ్రీ ధునీవాలా దాదాగారి శిష్యులలో ఒకరు) హిమాలయములకు యాత్రకువెళ్ళారు. తుంగనాత్ శిఖరాలపై మంచు కొండలు తప్ప మరీమీ కానరాని ప్రదేశంలో ఒక రావి మాను ధాని క్రింద అగ్ని హోత్రము ముందు కూర్చొనియున్న ఒక దిగంబర యోగి గారిని శ్రీ శంకరానంద గారు చూచి సంభ్రమాశ్చర్యములతో వారి దగ్గరకు వెళ్ళారు. ఆదిగంబరయోగి మంచినీరు, జీర్ణ వస్త్రములు అడిగి స్వీకరించారు. వెంటనే నిప్పులలో చేయిపెట్టి కొన్ని నిప్పుకణికలు, విభూతి తీసి శ్రీ శంకరానందగారు సమర్పించిన ఒక గుడ్డలో మూట గట్టి వారికి ప్రసాదించారు. “మేము గిరిరాజ మకుటమణులము (అది శ్రీ ధునీవాలా దాదాగారి బిరుదు). మరుగున పడుతున్న మాపేరు మా జ్వలనాగ్నిని వెలుగులోకి తీసుకరా అనిచెప్పి వారికి సెలవిచ్చారు. శ్రీ శంకరానందులవారు శిష్యసమేతంగా బోజనాలు ముగించి తిరిగి ఆ ప్రదేశమునకు వచ్చి చూస్తే ఆ రావి చెట్టు గాని ఆదిగంబర యోగిగారుగాని అచ్చటలేరు. మేము గిరిరాజ మకుటమణులమని చెప్పారు గనుక వారు తప్పక శ్రీ ధునివాలా దాదాగారే. నేటికీ అసంఖ్యాకులైన భక్తులకు భౌతిక దర్శనము లనుగ్రహించి రక్షిస్తున్నారు.



ఒకప్పుడు శ్రీ దాదాజీ గారి మహా సమాది అనంతరం అకోలాకుచెందిన శ్రీసుభాష్ బాబాగారి అభ్యర్థనపై హింధీ మూలం రచయితగారు ఆకోలాకు పూర్ణాహుతికి వెళ్ళారు. అక్కడ జనం రద్దీ అయి ఒకపిల్లవాడు ఆరద్దీలోమరణించాడు. ఆబిడ్డను అగ్ని హోత్రం దగ్గర పరుండబెట్టారు. శ్రీ దాదాగారి తీర్థం ఆబిడ్డకు పోసి విభూతి అతని శరీరానికి పూయగానే బిడ్డ పునర్జీవితుడయ్యాడు. వాతావరణమంతా శ్రీ దాదాజీ గారికి జై అనే నినాదాలతో మిన్ను ముట్టింది. శ్రీ దాదాజీ గారి మహిమ అంత గొప్పదన్న సత్యం ప్రజలందరికీ రూఢి అయింది.

మహాసమాధి అనంతరం కూడా సద్గురువులు కోరినపుడు శరీరంతో భూమిపై తన భక్తులకు దర్శన మివ్వగలరని సర్వత్రా, సర్వధా తన భక్తులందరినీ కంటికి రెప్పవలె కాపాడగలరనీ వారి సమాదులు వారి ప్రత్యక్ష సజీవ రూపాలేననే సత్యం దత్తసాంప్రదాయ మెరిగిన వారిలో కూడ చాలా మందికి హృదయ గతం కాదు. సద్గురుడు మహాసమాది చెందాక వారి సమాధిని వారు శరీరంతో ఉన్నప్పుడు దర్శించినంత తరుచుగా దర్శించడం మానేస్తారు. కానీ పరమ కారుణ్య మూర్తులైన సద్గురువులు మాత్రం మనం వారిని వదలినా వారు మనలను వదలరు. “మహా సమాది అనంతరం కూడా మేము సజీవులై మిమ్ముల నుద్ధరించుటకు బద్ధకంకణులమై ఉన్నామని మనకు తగు విధంగా ఎరుకపరచి మన భక్తి శ్రద్ధలు పూర్వం లాగే వృద్ధి చెందే నిదర్శనాలు ప్రసాదిస్తారు.

శ్రీ దాదాగారి మహాసమాది అనంతరం మదన్ మోహన్ గారు చాలా కాలం వరకు ఖాండ్వా వెళ్ళి వారి దివ్యసమాధిని దర్శించలేదు. ఒకప్పుడు వారు సమాది దర్శనం చేసి అచ్చట నిద్రించారు. ప్రేమమయుడైన శ్రీ దాదాగారు స్వప్న దర్శనమిచ్చి మదన్ గారిని కౌగిలించుకొని “ఒరేయ్ నీవు పిల్లల మధ్య చిక్కుకొని భారత దేశములోని

పంచ ధామమైన నామొద్దకు రాకుండా మానేశావు. అర్ధరూపాయి మిగిల్చిన నాయెద్దకు రాగలవు. వచ్చినప్పుడు పదిరోజులుండి నన్ను తృప్తిగా సేవించి పోతుండు.". అని పలికాడు. వారి ప్రేమకు కరిగి పోయిన మదన్ గారికి ఆనంద భాష్పాలు రాలాయి. మరుసటి సారి సమాధి దర్శనానికి వచ్చి పదిరోజులుండ దలచాడు. కానీ వెంటనే రమ్మని జిల్లా కలెక్టరు టెలిగ్రాం పంపారు. శ్రీ దాదాగారి శిష్యులైన హరిహర భగవానులది చూచి "శ్రీ దాదాగారి ఉత్తరువైనాక మరి ఎవరి ఉత్తరువులు చెల్లనేరవు. నీవేమీ భయపడవద్దని' సలహా ఇచ్చారు. పదిరోజులతర్వాత డ్యూటీకివెళితే కలెక్టరుగారావిషయమే ప్రస్తావించలేదు.

ఇట్టి మహాద్భుత చరిత్రను మనకుప్రసాదించిన పూజ్యపాదులు ఆచార్య శ్రీ భరద్వాజ మాష్టరు గారికి తెలుగు శ్రోతలందరమూ ఎంతో ఋణపడియున్నాము. ఆ దత్తావతారాల చరిత్ర నిత్యపారాయణ చేయడమే సాధకులైన వారికి, లౌకికులకుకూడా ఈ కలియుగంలో అత్యుత్తమమైన నిష్కామ కర్మ, ఇట్టి పారాయణ మనల నుద్ధరించుటయేగాక సాటి మానవులకు కూడా అనేక విధములుగా సహాయం చేస్తుంది. శ్రీ భరద్వాజ మాష్టారు గారు కోరినట్టు నిత్యం ఆ సద్గ్రంధాలు పారాయణ చేసి, నిత్య సత్ సంగాలు జరిపి వారి ఋణం తీర్చుకుందాము.

సర్వేజనా సుఖినోభ వంతు

లోకాన్ సమస్తాన్ సుఖినోభవంతు.





శ్రీ గౌరీ శంకర్ మహరాజ్‌గారు

స్వామి కృప పబ్లికేషన్స్ - గొలగమూడి,
నెల్లూరు జిల్లా - 524 321.

## మా ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| అవధూతలీల - (భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి చరిత్ర) | 40-00 |
| శ్రీ స్వామి సన్నిధి. | 20-00 |
| అవధూత భోధామృతం | 15-00 |
| అవధూత లీల ఇంగ్లీషు | 30-00 |
| శ్రీ వెంకయ్య స్వామి ఇంగ్లీషు | 3-00 |
| స్వామి కృప | 1-50 |
| పిలచిన పలికే దైవం | 1-50 |
| మౌన బోధ | 1-00 |
| శ్రీ వెంకయ్య స్వామి పూజ | 1-50 |

### శ్రీ స్వామి వారికి దక్షిణ పంపే వారు

టుది రిసీవర్ - శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమం
గొలగమూడి (పోస్టు), (వయా) సర్వేపల్లి,
నెల్లూరు జిల్లా - 524321
అని పంపాలి. వ్యక్తుల పేర్లతో పంపరాదు.